
ఆంధ్రసచిత్రవార

పత్రిక

20-1-67





తప్పక చూడండి!
గౌరి ప్రొడక్షన్స్ వారి
గోపాలుడు భూపాలుడు
పూర్ణా రిలీజ్
నిర్వహణ ఎ.భావనారాయణ దర్శకత్వం జి.విశ్వనాథం
NAVRANG







ఉత్తరాలు

కథలు

2—12—66 సంచికలో కొడవంటికాశీపతిరావుగారు వ్రాసిన కథ "నవ్వు"లో "లేబరేటరీలో పైనలియరువాళ్లు కలిసినప్పుడు" అని వ్రాశారు. తర్వాత "ఇకనామిక్స్ డెఫినిషన్ ఏమిటో సరిగా బోధపడలేదు కొంచెం చెప్పవోయ్" వెయిటింగ్‌రూములో అడిగింది సుమంత.

ఇకనామిక్స్ ఆర్ట్సు వాళ్లకు చెందినది అనుకుంటాను. మరి ఆర్ట్సువాళ్లు లేబరేటరీలో మూడు గంటలు ఎందుకుంటారో అర్థం కావడం లేద.

ఈపొరపాటు తప్పించి కథ చాలా బాగుంది.

డి. వి. ఆర్. (గుంటూరు)

* * *

శ్రీరంగం రాజేశ్వరరావుగారి రచన "చలి" ఎంతో బావుంది. రచన హాయిగా సాగింది. సున్నితమైన పదజాలంతో సాగి, చివర కరుణ రస పూరితమైన వర్ణనలతో హృదయాన్ని దేవింది. సున్నిత హృదయుడు నిజమైన మానవుడూ అయిన ప్రభాకరం, ప్రియాతి ప్రియమైన ఎంతో ఖరీదైన కొంగ్రొత్త కోటును, గాఢమైన చలిలో ఒంటికి బట్టలేక ఒణికిపోతున్న ఒక అనాధ వృద్ధునికి దానం చేసేస్తాడు. జీవితంలో యింతవరకూ యిలాంటి సంఘటనకు నోచుకోని ఆ నిరుపేద ప్రపంచంలో మానవత్వం యింకా అక్కడక్కడా వున్నదని కన్నీరు కారుస్తాడు.

కోటును ప్రభాకరం ఆవృద్ధునికి దానం చేసిన ఘట్టంలో పాఠకులకు ఒళ్లు పులకించి, కళ్లలో నీరు తిరుగుతుంది. నిజమైన మానవత్వంగల యువకుడుగా "చలి"లో ప్రభాకరం చక్కగా ప్రకాశించాడు.

కొండ్రాజు వి. రామారావు (గానుగ పెంట)

న్యూఢిల్లీ లేఖ

ఈనాడు ఉపవాస దీక్ష అనేది ప్రతి చిన్న కార్య సాధనకూ వజ్రాయుధంలాగా ఉపయోగపడుతోంది. ఇది సమర్థనీయం ఎంతమాత్రమూ కాదు.

ఈ ఉపవాస దీక్షకు మార్గదర్శకుడు—మూల పురుషుడు మహాత్మా గాంధీజీ. అయితే ఆయన యీ అస్త్రాన్ని ఒక మహోన్నత కార్యసాధనకు ఒక ఉపఖండ దాస్యవిముక్తికై వినియోగించారు. జయించారు. మహాత్ముడై భగవంతునిలో కలిసిపోయారు.

ఈయన తరువాత యీ అస్త్రాన్ని సద్వినియోగం చేసినవారు శ్రీ పొట్టి శ్రీరాములుగారు. ఆయనగారు కూడా ఆత్మాహుతి చేసుకుని మనకు ఆంధ్రరాష్ట్రాన్ని ప్రసాదించారు.

ఈ అస్త్ర ప్రయోగాన్ని యింతటితో విరమిస్తే శుభస్కరం అని తోస్తుంది. ప్రతిచిన్న విషయానికీ యీ అస్త్రాన్ని ప్రయోగించటంతో ఫలితం శూన్యం కాగా, అలజడులూ, ఆందోళనలూ కష్టనష్టాలూ సంభవించటం తప్పనిసరి అవుతోంది.

విశాఖ ఉక్కు కర్మాగారానికి ఆంధ్రులు కొందరు ఉపవాస దీక్షచేశారు. దీనివల్ల ఎంతో అలజడి రేగి, మనరాష్ట్రం కొంత నష్టపడింది. రైల్వే లూటీలు, ప్రభుత్వ భవన విధ్వంసనలూ, వ్యాపార స్థంభనలూ, ప్రయాణసాధనాలు నిలుపుదలలూ వీటివల్ల అటు ప్రభుత్వమూ యిటు ప్రజలూ నష్టపోయారు. బాధపడ్డారు. ఇది సమర్థనీయమేనా?.........

అలాగే సంత్ ఫతేసింగుగారి దీక్షకూడా!

మనరాష్ట్రం పారిశ్రామికంగా ఎంతో వెనుకబడివున్నమాట నిజమే. మనరాష్ట్రంలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పబడడం అత్యంతావశ్యకం. అయితే అందుకు మరేదయినా పటిష్ఠమయిన మార్గం సమర్థనీయమైన మార్గం ఆలోచించి అనుసరించటం అత్యంతావశ్యకం. ప్రతి విషయానికీ మూఢ పట్టుదలగా ఉపవాస దీక్ష చేయుటం ఏమంత మంచిది కాదని మనవి.

ముక్కోటి ఆంధ్రులూ ఏకమై, పట్టుదలతో కృషిచేస్తే ఒక్క ఉక్కుకర్మాగారమే కాదు. మరేదయినా సరే మనరాష్ట్రానికి లభిస్తుంది.

శ్రీరామ్ (నెల్లూరు)

* * *

30—12—1966వ తేదీ గల ఆంధ్ర పత్రిక వారపత్రికలోను, కొద్దివారాలుముందు పత్రికలోను (2—12—66) శ్రీకృష్ణగారు "గోవధ నిషేధాందోళన" గూర్చివ్రాసిన వారి వ్యాఖ్యానధోరణి పాఠకులకు ఎంతో శోచనీయంగా ఉంది. అంతేకాదు. కటువుగా కూడా ఉందిమాకు. శ్రీకృష్ణగారి ఎన్నో వ్యాఖ్యానాలు పాఠకుల మనస్సును నాటుకున్నాయి, కాని ఈ ఒక్క విషయంలోను వారిభావాలతో పాఠకులు ఏకీభవించలేరు. అంతేకాదు శ్రీకృష్ణగారి వ్యాసం కాబట్టి ఈపత్రికలో చోటు చేసుకుంది, కాని మరొకరు వ్రాస్తే మరొక పత్రిక ప్రచురిస్తే, ఆ ధోరణి ఆమోదయోగ్య మయేదా?

గోవధకు అనుకూలంగా అనేక కారణాలు నిరుపయోగకరంగా వ్రాశారు. ప్రతి వాదానికీ ప్రతివాదం ఉందికదా! దీన్ని అంగీకరించి, "గోహత్యానేరం" ప్రచార సాహిత్యం చదివితే రెండవ పక్షంలోని నగ్న సత్యాలు రుజువవుతాయి. శ్రీకృష్ణగారికి ఎందుకనో "గోచీరాయుళ్ల" మీద అక్కసు ఎక్కువపాళ్లలో ఉంది.

అన్నిరంగాల్లోనూ, పూర్తిగా ఏసంస్థ పాల్గొనలేదు. అలాగే జగద్గురువు కానివ్వండి, జనసంఘ్ కానివ్వండి, జయప్రకాశ్‌నారాయణ్ కానివ్వండి. శ్రీకృష్ణగారనుకున్నవన్నీ "నిజాలుగా" ప్రకటించారు. జగద్గురువుగారు ఎన్నికల్లో నిలబడలేదు. తమ పాలసీ ప్రకటించలేదు. అందుచేత "ఆకలితో మాడి చచ్చిపోతున్నవారికి" హామీ చూపించవలసింది ప్రభుత్వం అవుతుంది కాని జగద్గురువు అవుతాడంటారేమిటీ శ్రీ కృష్ణగారు?

"శ్రీకృష్ణ" తమ నామధేయముయినందుకు ఈవిషయంలో మౌనం ప్రకటించి ఉంటే సార్థక నాముడయేవారు. ఇది అలాఉంచితే ఇహ గోజాతి సంరక్షణా ధోరణిగల వారంతా ఆయన దృష్టిలో గోపాలకృష్ణులు కాదు. ఈసాధువులు, మహాత్ములు, జగద్గురువులు అంతా "గోచీరాయుళ్లు" కాబోలు!

“భారతదేశచరిత్ర” ఆంగ్లేయ పరిపాలకులు వారి హయాంలో వ్రాస్తే ఎంత వాస్తవికత ఉంది? అలానే ‘గోవధ నిషేధం’ గూర్చి ఆ “ప్రవీణులు” వ్రాస్తేనూను! “పశువధ, గోవధ”ను గూర్చి ఆందోళన స్వతంత్రమొచ్చిన దగ్గర్నుంచీ సాగుతున్నదని శ్రీ కృష్ణగారే ఒప్పుకున్నారు. మరయితే— “జనసంఘ్” రాజకీయ పార్టీగా బయటకు వచ్చి ఎన్ని సంవత్సరాలయింది.!? గోవధను గూర్చి ఒక్క జనసంఘం, ఒక్క జగద్గురువు వాపోతున్నారనుకోవడమెందుకు?

గోరక్షణ సదుపాయాలు సరిగాలేవని ఎంతకాలం కలకత్తా, బొంబాయి, పంజాబు, బీహారుమొ. పట్టణాల్లో చూసే వారికి ఎలా తెలుస్తుంది? ‘న్యూఢిల్లీ’ కారణాలు అంతవరకే పరిమితాలు. దేశంలోని పశువులు 5శాతమే నగర ప్రదేశాల్లో ఉన్నాయని శ్రీ కృష్ణగారే వ్రాశారు. మిగిలిన 95 శాతం మాటేమిటి? పల్లెటూరు రైతును అడిగితే గోసంరక్షణలో వారి శ్రద్ధను చెబుతాడుకదా!

ఉత్తరాలు

ఢిల్లీలో ఏం తెలుస్తాయి? ఢిల్లీమొదలగు పట్టణాల్లో పాల వ్యాపారం చేసే వాళ్లే కనిపిస్తారు కాని నిజమైన పోషకులు ఎలా కనిపిస్తారు మనకు?

మన స్థితిగతులను బట్టి మన ఆవులు పాలిస్తున్నాయేగానీ, పాశ్చాత్య దేశాల్లో వలె 80 పౌన్ల పాల నిమ్మంటే ఎలా యిస్తాయి? మరి మన దేశంలో సగటున మనిషి ఎంత సంపాదిస్తున్నాడు? మన ఎకరాకు ఎంత దిగుబడి వస్తోంది? భారత దేశచరిత్ర పరిస్థితులు మనకు అర్థం కానివా?

ఈ ‘గోవధ నిషేధాందోళన’ ఒక్క జనసంఘ్ గుత్తకు తీసుకుందని అన్నారు శ్రీకృష్ణ. ఇలా అంటూనే మొరార్జీదేశాయ్, స్వతంత్రపార్టీ ప్రోత్సహిస్తున్నదనీ వారే వ్రాశారుకదా! అందరి భాగం ఉందికదా మరి!.

ఈ ఉద్యమాన్ని పూతగా గొని, ఆవు ఆందోళనతో ఓట్లను కూడబెట్టు కోవాలని చూస్తోంది అన్నారు శ్రీకృష్ణ. వారి దృష్టిలో జనసంఘ్ కాబోలు అలా చూసేది. అయితే వారి సానుభూతి పొందిన శ్రీమతి ఇందిరా గాంధిగారి పార్టీ ఎన్నికల గుర్తు కూడా “కాడి ఎద్దుల జతే”కదా!

ఏ పార్టీది ఎక్కువ అభిమానంగా రుజువవుతున్నదీ శ్రీకృష్ణగారు గుర్తించలేదల్లే ఉంది. ఈ వాదన ఎట్లాగుందంటే— కమ్యూనిస్టుదేశాలైన రష్యా మొదలగునవి మనకరువుకు తిండిగింజలు పంపవచ్చును., సాంకేతిక శిక్షణ ఇవ్వవచ్చును. మననాయకులు అక్కడ పర్యటిస్తూ బ్రహ్మరథం పట్టించుకోవచ్చు, ఆ నాయకుల కిక్కడ పట్టవచ్చు. అయితే మనదేశంలో కమ్యూనిజం భావం గల వాళ్లు మాత్రం దేశద్రోహభావం గల వాళ్లన్నట్లు ఉంది.

“ఒకనాస్తికుడు” (సికిందరాబాదు)

రచయితలకు విజ్ఞప్తి

తమ రచనలతో కాక విడిగా స్టాంపులు పంపే వారి రచనలు తిప్పి పంపడం సాధ్యం కాదు. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే అవకాశం కూడా లేదని గుర్తించ ప్రార్థన

సం॥

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 20—1—'67
పరాభవ స॥ పౌష్య మాసం॥ శుద్ధ నవమి

సంపుటము : 59 సంచిక : 19

స్థాపితము:
1908

ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు:
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

చందా వివరాలు :
భారతదేశం


పోస్టు ద్వారా

సంవత్సర చందా	19.25
6 మాసముల చందా	9.62
3 మాసముల చందా	4.80
విడిప్రతి	0.35

ఇతరదేశాలకు
ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	32.00
అర్ధసంవత్సర చందా	16.00

విషయానుక్రమణిక



వెల 35 పై.

శ్రీకృష్ణ

'షాహీ' యిజంలో సోషలిజం

ఒక కాంగ్రెసు వ్యక్తి అయిదు సంవత్సరాలు ఇష్టారాజ్యంగా ఆధిపత్యం చలాయించాలంటే నాలుగు దశల్ని దాటి వెళ్లాలి. ఇవి యక్షప్రశ్నలంతటి కష్టమైనవయినా మార్గాలు చాలా వున్నాయి. తన పేరు ప్రదేశ్ కమిటీకి సిఫారసు చేయమని జిల్లా కాంగ్రెసుకమిటీ వారిని-బాబూ నాయనా అని బ్రతిమాలడంగాని, లేదా మీరలాంటివారు ఇలాంటివారని ముఖస్తుతి చేసి; ఎలాగైతేనేం ప్రయోజనాన్ని సాధించడం మొదటి దశ. ఈ మొదటి ప్రయత్నం అనుకూలించగానే అదే మోతాదులో పాత మంత్రాన్ని పఠించి తన పేరు సెంట్రల్ కాంగ్రెసు కమిటీకి సిఫారసు చేయమని ప్రదేశ్ కాంగ్రెసు కమిటీని కోరుతాడు. ఇది రెండవదశ. అంటే ఇక్కడ ఈ మహాశయుడు కామరాజుగారి దృష్టిలోకి వచ్చేస్తాడన్నమాట. ఇచ్చట సై అనిపించుకుని న్యూఢిల్లీకి వస్తాడు. అక్కడ అధికారంలో వున్న సిండికేట్‌లో చేరి వ్యక్తిగత రాజకీయాల్లో కలగజేసుకుని నలుగుర్ని ఆకర్షిస్తాడు. అంతే, దాంతో కాంగ్రెసు టిక్కెట్ చేతి కొచ్చేస్తుంది. ఇది మూడవదశ. ఈ మూడు దశల్లోను నెగ్గుకు రావడానికి ఇంతింత చాతుర్యం చూపించినవాడు, తర్వాత పప్పులో అడుగేస్తాడని ఎవరనుకుంటారు? శ్రీవారు తిరిగి తమ నియోజకవర్గానికి వేంచేస్తారు. ఓపికున్నంత వరకు ఓటర్లనందర్నీ కలుసుకుని పరామర్శిస్తాడు. ఎక్కడలేని ప్రేమ వలకబోస్తాడు. పదిమందినీ ఒప్పించి నెగ్గాననిపించుకుంటాడు. అక్కడనుంచి మాత్రం దేశాన్నంతా గుత్తకు తీసుకున్నట్టు వీర విహారం సాగిస్తాడు. ఇది అంతిమ విజయం. దేశానికి ఎంత ఉపయోగకారిగా వుంటాడు, ఈ అధికారానికి ఎంతవరకు పాత్రత వుంది? అనే ప్రశ్నలు ఇక్కడ తలెత్తవు. ఎందుకంటే ఆయన చాలా డబ్బున్నవాడు మరి! మూడవదశలోని ఇటువంటి స్వార్థత్యాగాలు (?) న్యూఢిల్లీకి బాగా అనుభవం. ఈ గొడవంతా ఇపుడు సద్దుమణిగిపోయింది. ఎన్నికల పర్యటనకు ఆయత్తమయ్యారు శ్రీ కామరాజు.

టాల్‌స్టాయ్ జీవితచరిత్ర కొంత ప్రస్తావిస్తాను. అయినా, ఆయనగారి భార్య ఎప్పుడూ కొట్లాడుకొంటూ వుండేవారు. చివరి కిద్దరూ వేర్పడిపోయారు. తనదనుకున్న ఆస్తిని వెంటేసుకుని టాల్‌స్టాయ్ ఇల్లు విడిచి పెట్టేశారు. ఎంతోదూరం వెళ్లలేకపోయారు. మార్గమధ్యంలో వారి ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయినాయి.. భర్త చనిపోయి పడి వున్నాడని తెలుసుకున్న ఆయన భార్య అక్కడికి పరుగెత్తికెళ్లింది పాపం. ఆమె వెళ్లీవెళ్లగానే ఏంచేసిందని? భర్తను వళ్లో వుంచుకుని ఫోటో తీయించుకుంది. ఇది వారి అన్యోన్య జీవితానికి చిహ్నం. వాళ్లలో వాళ్లు ఎంతకీచులాడుకొన్నా, ఈ ఫోటోవల్ల ప్రజలు 'హవ్వా..!' అని ముక్కు మీద వేలేసుకుని ఆమె సహృదయతను, శీలాన్ని మెచ్చుకుంటారన్నమాట!


ప్రధాని శ్రీమతి గాంధి, శ్రీయుత కామరాజుగారు కలిసివున్న ఒక ఫోటో వుంది. (అందులో ఇద్దరూ మూతులు బిగించుకునే కూర్చుని వుంటారు!) ఈ ఫోటో న్యూఢిల్లీలోని ముఖ్యమైన పత్రికలన్నీ ప్రచురించాయి. ఢిల్లీలోని కాంగ్రెసు అభ్యర్థుల్ని ఎన్నిక చేయడంలో ఇద్దరికీ ఎంత రాద్ధాంతమైందో ఆ ఫోటో క్రింద వివరంగా చర్చింపబడింది! ఎన్ని వ్యతిరేక ఫలితాలే. వారిద్దరికీ ఎందులోనూ పొసగడం లేదని తేటపడుతూనే వుంది.

క్రిందటిసారి 'మొఘల్‌షాహి' గురించి చర్చించుకున్నాం. దాని మీద శ్రీమతి గాంధి వ్యాఖ్య కూడా ఇచ్చాను. దానికి ఆమె ఎంత వ్యతిరేకత కనబర్చారో తెల్లమైపోయింది గదా!

మన ప్రధాని శ్రీమతి గాంధి తండ్రిగారూ, కీర్తిశేషులూ అయిన పండిట్ జవహర్లాల్ నెహ్రూ ఆత్మకథలో వున్న ఒక విషయాన్ని విశదం చేస్తాను:

''మేము కాశ్మీరీలము. సుమారు రెండు వందల సంవత్సరాల క్రితం, పద్దెనిమిదవ శతాబ్దంలో మా పూర్వీకులు కొండ కనుమల్లో నుంచి క్రిందికి దిగివచ్చారు. వారికి ఎన్నో అభ్యుదయ పథకాలున్నాయి. అవి మొఘల్‌షాహి పరిపాలన క్షీణ దశలోకి వస్తున్న రోజులు. ఔరంగజేబ్ తర్వాత ఫరూక్‌షియర్ సింహాసనాన్ని అధిష్ఠించాడు. మాపూర్వీకుల్లో ముఖ్యమైనవాడు రాజ్‌కౌల్. ఫరూక్‌షియర్ ఒకసారి కాశ్మీరు దర్శనం చేసుకున్నప్పుడు మా రాజ్‌కౌల్ ఆయన్ను ఆకర్షించాడు. 1716 లో మావారు ఢిల్లీకి వలస వచ్చేశారు. బహుశా చక్రవర్తిగారి ఆదేశాన్ని అనుసరించే అయి వుంటుంది. చక్రవర్తిగారు ఒక కాలువ చేరువగావున్న 'జాగీరు'ను మా రాజ్‌కౌల్‌కు ఈనాముగా ఇచ్చేశారు.''

నెహ్రూగారు వివరించిన దానివల్ల మనకు తెలుతున్నదేమిటి? అంధకారంలోంచి



ఇటీవల చలన చిత్ర నటుడు శ్రీ సురేంద్రనాథ్ అధ్వర్యాన ఫిజీ, న్యూజిలాండ్‌లకి వెళ్ళిన సాంస్కృతిక బృందంతో తెలుగు మానో ఏక్టర్ శ్రీ వేణుమాధవ్ కూడా వున్నారు. వారికి (ఎడమనుంచి మూడవవ్యక్తి) బొంబాయిప్రాంత ఆంధ్రసంఘం వీడ్కోలు ఇచ్చింది.

అవతలికి తీసి 'నెహ్రూ' వంశానికి కీర్తి ప్రతిష్ఠలు కూర్చి ప్రపంచనాయకహోదాలో ఘనతను సంపాయించడానికి దోహదం చేసింది మొఘల్‌షాహి అనేకదా! జైసాల్మీర్ రోడ్డులో ఫరూక్‌షియార్ నీడలు కాంగ్రెసు చుట్టూ పరిభ్రమణం చేస్తున్నాయి. 'జఫూర్‌షాహి' అని ఒకరోడ్డుకు నామకరణంచేశారే? ఇది నెహ్రూ వంశ మర్యాదకు కృతఘ్నత కాదా? తన్నిర్మాణానికి నెహ్రూవంశం ఎంత పాటుపడింది, ఎంత కృషి చేసింది....!

ఇక్కడ మరో విషయం చెప్పాలి. మొఘల్ రాజ వంశంలోని జహంగీర్ మొట్టమొదట కాశ్మీరంటూ సుందరవన మొకటుందని కనుగొన్నారు. వెంటనే ఆయన శ్రీనగర్‌ను తను వేసవి విడిదిగా, రాజధానిగా ఏర్పాటు చేయించేశారు. శ్రీనగర్‌కు ఇప్పుడింత సంస్కృతి, అందం, ఆకారం వచ్చాయా అంటే దానికి కారణం జహంగీర్ భార్య నూర్జహాన్.

ఇటువంటి 'షాహి' లను ఢిల్లీ చాలా చూసింది. అక్బర్‌షాహి, మొఘల్‌షాహి, నదీర్‌షాహి, మహమ్మద్‌షాహి. బహదూర్ షాహిని కూడా అందులో చేర్చాల్సిందే. ముందు లేఖలో మనం, ఒక సరికొత్త 'షాహి' స్థానం ఆక్రమించుకొన్నట్టు ప్రస్తావించుకున్నాం. అదే గుల్జాల్‌షాహి. అది ఢిల్లీలో విశృంఖలంగా పని చేస్తూవుంది. నడుస్తున్న చరిత్రలో ఇది ఒక చూడ చక్కని 'బొమ్మలాట!' ఇది మొఘల్‌షాహి కంటె భరించలేనిదీ సహించలేనిదీను. శ్రీమతి ఇందిరాగాంధికి శ్రీయుత కామరాజు గార్కి మధ్యనున్న చీలికలు, మనస్పర్ధలు బట్టబయలై పోయాయి. ఇవి శ్రీమతి ఇందిరాగాంధికి ఎంత హానికరమైనవో ఎంత కీడు చేస్తాయో ఢిల్లీ బాగా ప్రదర్శించి వుంది. శ్రీమతి గాంధి ఇప్పటికే అనుభవాన్ని సంపాయించుకొని వుండాలి!

ప్రణాళికా సంఘం

సుమారు ఒక సంవత్సరం నుంచి ప్రణాళికా సంఘం తర్జనభర్జనలు జరుపుతున్నట్టు కావలసినంత ప్రచారమయింది. ఎన్నికలకుముందే పథకాన్ని ఒక రూపంలోకి తీసుకొచ్చేందుకు ఈ సంఘం తీవ్రమయిన కృషి చేస్తోందని ఒకవారం క్రితం చెప్పబడింది. అనేక కమిటీలను నియమించిన పార్లమెంటు తన అభిప్రాయాన్ని వెలిబుచ్చింది, ఉన్న పరిమాణాన్ని ఒట్టి ఆదాయాన్ని బట్టి రాష్ట్ర ప్రణాళికలు అంతిమ రూపాన్ని దలుస్తాయంటున్నారు. ఇందులో బాహ్యపరిస్థితి అంతర్‌స్థితి అందరికీ తెలిసిందే, అయినా ఆలోచిస్తూ మంటున్నారు. ఇటువంటి పరిస్థితిలో ప్రణాళికకు ఒక సమగ్ర స్వరూపాన్ని తీసుకురావడం దుర్లభం. దేశంలోని ఆదాయం ఇలానే వుండి, విదేశీ సహాయం గనక తటస్థ వైఖరిలో వున్నట్టయితే ప్రణాళికలో వేసిన కొన్ని ప్రాజెక్టుల్ని తక్షణమే విరమించుకోవలసి వుంటుంది. ప్రణాళికా ప్రతిని సిద్ధం చేసినా ఇలాంటి సవరణలు ఎప్పుడూ తప్పవు.

ప్రణాళికను తయారు చేసే ప్రవీణులు ఇప్పటి ఆర్థిక ప్రతిష్ఠంభనాన్ని దృష్టిలో వుంచుకునే వున్నారు. అంచేత దృగ్గోచరమయ్యే విషయమేమిటీ అంటే ఇటువంటి ప్రతిష్ఠంభనాన్ని సడలించాలంటే వెంటనే తగుచర్యలు తీసుకొని డబ్బును మదుపు పెట్టడానికి ప్రయత్నించాలి. కూడబెట్టడానికి కొన్నిమార్గాలు వెతకాలి. వ్యయాన్ని తగ్గించడంవల్లగాని పన్నుల ద్వారా వచ్చే రాబడిని సక్రమపద్ధతిలో మదుపు చేయడంగాని జరగాలి. ప్రభుత్వం ప్రజల్ని అవలంబించమనే నినాదమే ఇది! ఆర్థిక పరిస్థితిని నిలద్రొక్కుకోవాలంటే పన్నులు అధికం చేయడం తప్పితే మరోవిధాన మేదీ లేదనే ఆలోచన ఒకటుంది.

విదేశీ సహాయాన్ని నమ్ముకుని ప్రయత్నాలు ప్రారంభించామో, అప్పుడు మనం గోతిలో దిగినట్టే. ఇదమిద్ధంగా 'ఇంత' వస్తుందని కూడా మనకు తెలియదు. ఇటువంటి అనిశ్చిత పరిస్థితికి కొంతకారణం అమెరికా. మన బకాయీలే ఈ పరిస్థితికి దారి ఏర్పరచాయి. భారతదేశపు విదేశీ విధానంలో లోటుపాట్లు కూడా ఒక కారణమే. ప్రాజెక్టుల క్రింద వచ్చే సహాయం మీద మన ప్రాజెక్టులు కొన్ని ఆధారపడి వున్నాయి. ప్రాజెక్టేతరమైన సహాయమూ లభిస్తుంది. భారతదేశం యొక్క ప్రస్తుత పరిస్థితి దృష్ట్యా ఎంత సహాయం వచ్చినా మజ్జిగ చిక్కబడదు.

వచ్చే సంవత్సరానికి సంబంధించినంత వరకు దానికి సరిపడా పథకం తయారై పోతుందిలెండి, అని ప్రణాళికా సంఘంలోని ఒక మహాశయుడన్నారు. జనవరి నెలలో

(10 వ పేజీ చూడండి)

లోకం పోకడ

" రాజకీయాలతో — అందులో వర్గాలకి సంబంధించిన రాజకీయాలతో మతసంబంధమైన విషయాలని కలపటం ఎంత అనుచితంగాఉందో సంత్ (ఫతేసింగ్) గ్రహిస్తారని భావిస్తున్నాము. "

—ఆర్గనయిసర్, వారపత్రిక.

* * *

"జ్యోతిషం ప్రకారం (సంత్ ఫతేసింగ్) సజీవ దహనం జరగదని నాకు తెలుసు," హర్యానా ముఖ్యమంత్రి శ్రీ భగవత్‌దయాళ్ శర్మ.

—'పేట్రియాట్'లో వార్త.

(27-12-66)

* * *

" వామపక్షం కమ్యూనిస్టులు 10, 15 అసెంబ్లీ సీట్లకోసం ద. ము. క. దగ్గరకి వెళ్లారు. నా దగ్గరకి వస్తే ఇంకా ఎక్కువే ఇచ్చేవాడిని."

—శ్రీ కామరాజ్ అన్నట్లు కలకత్తా వారపత్రిక 'నవ్' ప్రచురణ

(30-12-66)

* * *

(కాంగ్రెసు కేంద్ర ఎన్నికల సమావేశంలో) "శ్రీ సంజీవరెడ్డిగారు ధారాళంగా, భావావేశంతో కాంగ్రెసులో చీలికవర్గాల సమస్యని గురించి మాట్లాడారు.'

—'హిందూస్తాన్ టైమ్స్'లో శ్రీ క్రిషన్ భాటియా

* * *

చైనా నాయకుడు ల్యూషావ్‌జీ కుమారుడు, కుమార్తె తమ తండ్రి "విప్లవానికి ద్రోహం చేశా"డనే ఆరోపణ చేశారు... —వార్త

* * *

"ఇటువంటి (సోషలిస్టు) విప్లవానికి నాయకుడుగా కృష్ణమీనన్ ఒక సోషలిస్టు ప్రభుత్వంలో భారతదేశానికి ప్రధానమంత్రిగా అధికారంలోకి రావచ్చు"నని (బ్లిట్జ్ సంపాదకుడు) అన్నారు.

—'బ్లిట్జ్'లో వార్త

* * *

కలకత్తా టెస్ట్‌మాచ్ సందర్భంలో భారతదేశం జట్టు ఆట సంతృప్తికరంగాలేదని సుమారు 200 మంది ప్రేక్షకులు తమ నిరసన ప్రకటించారు. —వార్త

* * *

(గోరక్ష) సమితి ఈ పుణ్యపురుషుల ప్రాణాలని కాపాడాలనే ఇష్టపడుతున్నది. కాని, ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని గుర్తించక పోవటంవల్ల వారి పవిత్ర సంకల్పాన్ని వదులుకొనమని చెప్పలేకుండా ఉన్నది.

—'ఆర్గనయిసర్'లో సంపాదకుడు



వారం తర్వాత తిరిగి లండన్‌లో. .


'రాత్రి బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ గవర్నర్ని చూశాను. మేము బంగారం దొంగ రవాణా విషయం చర్చించు కున్నాము.'

'దాన్ని గురించి నాకంతగా తెలీదు'

'తర్వాత తెలుస్తుంది. ఇంగ్లండ్‌లో అందరికన్నా ధనవంతుడెవరో తెలుసా 007?'

'ఎల్లెర్‌మన్ అనుకుంటా. లేకపోతే రోత్ చైల్డ్స్‌లో బహుశ ఒకరై ఉండొచ్చు? డైమండ్ మాన్ ఓప్పెన్ హీమర్ కావచ్చు.'

'నువ్వసలు పేకముక్కల్లో ఉండే జోకర్నే విస్మరించావు. గవర్నర్ చెప్పాడు. గోల్డ్‌ఫింగర్ గొప్ప ధనవంతుడు—ఆరిక్ గోల్డ్‌ఫింగర్!'




నవ్వుదామన్న కోర్కెను అణుచుకున్నాడు బాండ్. తాను గోల్డ్‌ఫింగర్‌తో పేచీ పెట్టుకొనాలని విధి నిర్దేశించబడినట్లే కన్పించాడు...

'గతవారంలో అతన్ని కలిశాను. మేమిద్దరం ఒకరోజు గోల్ఫ్ ఆడాలని నిర్ణయించుకున్నాము. త్వరలో అతను తిరిగి ఇంగ్లండ్ వస్తాడు.'

'అయితే అతను నీకు తెలుసన్నమాట! మంచిది. బాంక్ వాడి మీద ఓ కన్నువేసి ఉంది. ఈ క్షణం నుంచి నువ్వు కూడా'

'అతనికీ బంగారం దొంగ రవాణాకీ సంబంధం ఉందా?'

'ఉంది. సాయంత్రం నువ్వు బాంకులో కల్నల్ స్మితర్స్‌ని కలుసుకోవాలి. ఆయన అన్నివిషయాలు వివరిస్తారు. ఇప్పటికింతే 007.'



ఆ మధ్యాహ్నం బాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో...

'కల్నల్ స్మితర్స్! మీరు బంగారాన్ని గురించే నాకు చెప్తారనుకొంటాను. ఇంకేమైనా ఇతరవిశేషాలు...'

'కూర్చోండి కమాండర్ బాండ్. మీ గురించి గవర్నర్ దగ్గర్నుంచి నాకో నోట్ వచ్చింది!'

అరగంట తర్వాత...

'...కాబట్టి మన బంగారపు నిల్వలు తరిగిపోవడాన్ని ఆపటం ఎంత కష్టమో చూశారుగా. దానికి ముఖ్య కారకుడు గోల్డ్‌ఫింగర్. అతను బంగారాన్ని కొని, కరిగించి ఎలాగో బయటికి రవాణా చేస్తున్నాడు!'

'ప్రపంచమంతటా అతనికి 20 వేల పౌన్ల విలువ చేసే బంగారం సేఫ్ డిపాజిట్లలో ఉంది. అదంతా యీ దేశానికి చెందినదే. త్వరలో దాన్ని మన వశం చేసుకోవాలి.'



సంబాషణ అయిన తర్వాత కల్నల్‌స్మిథర్స్ వద్ద సెలవు తీసుకున్నాడు బాండ్...


'గోల్డ్‌ఫింగర్ ఈ దొంగరవాణా ఎలా చేస్తున్నాడో కనిపెట్టి అతన్ని రికార్డులోకి ఎక్కించాలి. ఆ బంగారాన్ని వశం చేసుకోడం ఎంతైనా అవసరం.'

అతను సరాసరి వెళ్ళి తిరిగి తన అధికారిని కలుసుకున్నాడు...

'అదీ విషయం...నేను గోల్డ్‌ఫింగర్ జాడ కనుక్కొని వాడి అంతు తేలుస్తాను.'

'ఇలా చూడు యిది గోల్డ్‌ఫింగర్ బంగారపు అచ్చు. దాని మీద చిన్న Z ఆకారం ముద్రించి ఉంది. అది వాడి గుర్తు.'

'మరికొన్నిటితోబాటు యిది మన చేతికి చిక్కింది. గోల్డ్‌ఫింగర్ ఓ విధంగా స్మెర్ష్‌కి కోశాధికారిగా ఉన్నాడని నా నమ్మకం 007!'



(స్మెర్ష్-స్మియర్ట్ స్పియోనంకు—గూఢచారులు పాలిటి మృత్యువు—సోవియట్ 'ప్రెసిడియం' వారి హత్యాసంస్థ! బాండ్ వళ్ళు జలదరించింది...)

'ఈ గోల్డ్‌ఫింగర్‌ని బుట్టలో వేసే మార్గం ఏమైనా తట్టిందా?'

'గాల్ఫ్ ఆడేరోజు రావాలి—అక్కడ్నించి అదే పనిలో ఉంటాము.'

'రికల్వర్‌లో అతని కేదో వ్యాపారసంస్థ ఉంది—అక్కడే గాల్ఫ్ ఆడుతూ ఉంటాడు!'

'మంచిది అక్కడికెళ్లి నువ్వు సాధించిన వాటిని నాకు తెలియపరుస్తూండు.'

తర్వాత క్రింద కార్లు ఉండే ప్రదేశంలో ..

'నేను ఈ ఆస్టర్ మార్టిన్ డి. బి. 111 ఏసి కెళ్తాను. అద్దైతే అన్నివిధాలా ఉపయోగంగా ఉంటుంది.'

'సార్...'



మర్నాడు ఉదయం .రికల్వర్ వెళ్తూ...

''ఎం' సిద్ధాంతం సరయినదే ననుకుంటాను. స్మెర్ష్ ఉద్యోగం గోల్డ్‌ఫింగర్‌కి తగినదే..'

'గోల్డ్‌ఫింగర్ లాంటి ధనవంతుడ్ని ఉపయోగించుకొనటమూ స్మెర్ష్ పద్ధతిలోనేఉంది. అతని స్వభావం అటువంటిది! మొదట్నుంచీ వాళ్లతోనే ఉండి ఉండి ఉంటాడు...'

'అదేనా ఆరిక్ గోల్డ్‌ఫింగర్ హెడ్‌క్వార్టర్లు? మోసగాడూ, స్మెర్ష్ ఉద్యోగీ! సరే మాద్దాం...'

[ఇంకా ఉంది

సర్వాధికారలేఖ

(7 వ పేజీ తరువాయి)

వివిధ మంత్రులతో సంప్రదింపులయిపోయాయి. ఇక రాష్ట్రాల వారీ సమాలోచనలు జరుగవలసి వున్నాయన్నారు.

"పెట్టుబడి గురించే కొంచెం వెనకా ముందూ ఒడ్డడం జరుగుతోంది, మరి ఎలక్షన్లని చూస్తే దగ్గరకొచ్చేశాయి, ఉప పన్ను ఆదాయాన్ని పెంచడానికి ఎన్నికల తర్వాతి రాష్ట్ర ప్రభుత్వాలుగాని, కేంద్రప్రభుత్వంగాని సమ్మతిస్తాయో లేదో" అని ఆయన అనుమానాన్ని వెల్లడించారు.

వచ్చేపంటల ఫలితాన్ని బట్టే ఏదైనా ఆధారపడి వుంటుంది. రాబోవా పంటల్లో కాకపోయినా సారవా పంటల్లో అయినా కొంత మిగులు తేలితే, కనీసం మెరుగుదల కనిపిస్తే బ్రతికిపోతాం. ఈ అభివృద్ధి లేకపోయిందో, ఆర్థిక విధానం పటిష్ఠమయ్యే సూచన లింకేమీ కన్పించవు అని ఆయన అన్నారు.

ఇప్పటి ఆర్థిక పరిస్థితి ముఖ్యంగా రెండు వ్యతిరేక శక్తుల మధ్యపడి నలిగిపోతోంది. అయిదు సంవత్సరాలు ఏకధాటిగా ఏర్పడిన కాటక పరిస్థితి ఒకటి, పారిశ్రామికరంగంలో ఉత్పత్తి నానాటికి జారిపోవడం రెండు.

దిగుమతి చేసుకోవలసిన వస్తువులు సులభంగా లభించినట్లయితే పారిశ్రామిక సంబంధమైన ఉత్పత్తి ఒక్కపెట్టున పుంజుకుంటుంది అంటున్నారు. అదే విధంగా వ్యవసాయికోత్పత్తి, లంచనాల మేరకు సంతృప్తికరంగా వున్నట్లయితే కనీసం ఎనిమిది శాతమన్నా అభివృద్ధి కన్పించవచ్చునని భావిస్తున్నారు.

జనపనార ఎగుమతి

నేపాల్ నుంచి తిరిగి ఎగుమతి చేసే భారతదేశపు జనపనార సమస్యను ఇంతవరకు పరిష్కరించలేదు. మామూలుగా నేపాలులో మిగులు తేలిన జనపనార భారతదేశానికి ఎగుమతి చేయడం వుండేది. అలానే భారతదేశమూను. జనపనార ఎగుమతిదార్లకు సబ్సిడీ శాతం తగ్గింపు రేటుతో నేపాల్ ఈమధ్య వర్తకం చేస్తూ వుంది. భారతదేశం నుంచి నేపాల్‌కు, నేపాల్ నుంచి విదేశీ ద్రవ్యార్జన ప్రదేశాలకు ఈ వర్తకం సాగుతూ వుంది. అందుచేత నేపాల్‌కు జనపనార ఎగుమతి చేయడం ద్వారా, భారతదేశానికి ఈ వర్తకంలో విదేశీద్రవ్యార్జన కుంటుపడిపోయింది. శ్రీ కె. బి. లాల్ ప్రతినిధిగా ఖాట్మండూ పర్యటించి వచ్చారు. కాని ఈ సమస్యకు సామరస్యమైన ఒక ఉమ్మడి ఒప్పందమంటూ ఏదీ జరిగినట్టులేదు. ●

ఎప్పుడూ అందంగా కనిపించాలి!

శ్రీమతి విద్యా కనకతుంగం.



శిరోజాలంకరణలో శ్రీమతి విద్యా.

సన్నగా అందంగా కనబడాలని ఆడవాళ్లందరూ కోరుకుంటారు. ప్రతివారూ అందంగా వుండాలనే చూస్తారుగాని, ఆ అందం తెచ్చుకోడానికి శరీరాన్ని జాగ్రత్తగా పోషించుకోవాలి అనిపించదు. ఈ బద్ధకమే శరీరాన్ని బరువెక్కిస్తుంది. సరి అయిన వ్యాయామంలేక, తగుపాళ్లలో ఆహారం తీసుకోక పోవడంలాంటి విషయాల్లో అశ్రద్ధ చేయడం వల్లనే ప్రకృతి సిద్ధమైన అందం అణగారిపోతుంది. లావుగా వూరిపోతూవుంటారు. లావైనందువల్ల చూడ్డానికి వికృతంగా కనిపించడమేకాకుండా కొన్ని అనుకోని రోగాలు ప్రాప్తిస్తాయి. రక్తపుపోటు, కీళ్లపోట్లు, బలహీనత, అలసట, ఏపని చేయాలన్నా ఉత్సాహం లేకపోవడం, ఇవన్నీ లావుగా వున్న వాళ్లలో సాధారణంగా కన్పించే లక్షణాలు. లావుగా వుండడం ఒక అవలక్షణమని అందరికీ తెలుసుననుకోండి. ఇలాంటి వాళ్లకు ఎంత ఖరీదైన బట్టలన్నా వేసుకున్నా సరిగ్గా అమరవు. ఎంత జాగ్రత్తగా కుట్టించినా, ఎంత మంచిరంగు ఎన్నుకున్నా వృధా శ్రమే అవుతుంది. సన్నంగా వున్న అమ్మాయి వుందనుకోండి, ఆ అమ్మాయి నలుగుర్నీ ఇట్టే ఆకర్షించేస్తుంది. లావుపాటివాళ్లుగూడా ఆకర్షింపబడతారుగాని, ఈ ఆకర్షణ లోలోపల కొంత అవహేళన వుంటుంది.

అందుచేత ప్రతి స్త్రీ కొన్ని ఆహారనియమాలు తప్పకుండా పాటించితీరాలి. అలాగని ఆకలితో వుండమనీకాదు, ఎక్కువగా తినమనీకాదు. రోజూ మామూలుగా తిన్నట్టే మూడుసార్లూ తినొచ్చు కాని ఈ తినడానికి మధ్యలో ఏమీ ముట్టుకోకూడదు.

లావుగా వున్నవాళ్లు ఈ క్రింది చిట్కా ఉపయోగించి చూడండి.

ఉదయాన్నె తీసుకొనే ఆహారం : బ్రెడ్డయితే ఒక స్లయిస్ వెన్న లేకుండా తీసుకోవాలి. కాల్చకుండాను ప్రేల్చకుండాను ఏరూపంలో తీసుకున్నా సరే ఒక కోడిగుడ్డు. ఒక ఏపుల్‌పండు. ఒక గ్లాసు తాజా నారింజరసం, లేదా నిమ్మరసం. ఇదంతా పూర్తిచేసిన తర్వాత ఒక 'మల్టి విటమిన్ టాబ్లెట్'. శక్తివున్నవాళ్లు ఇలా 'బ్రేక్‌ఫాస్ట్' తీసుకుంటే శరీరానికి మంచిది.

మధ్యాహ్న భోజనం : అన్నంతోపాటు శాకాహారం లేదా మాంసాహారం ఏదైనా తీసుకోవచ్చు. కేరట్, కేబేజి, టమేటోల్లాంటి తాజా కూరగాయలే ఎక్కువగా తినాలి. అన్నం ఎంతతగ్గిస్తే అంత మంచిది. నెయ్యిమాత్రం దూరంగావుంచాలి.

రాత్రి భోజనం : మధ్యాహ్న భోజనానికి ఎలా అమర్చుకున్నారో అలానే చేసుకోవచ్చు గాని కొంచెం మార్పువుంటే మంచిది. అన్నానికి బదులుగా ఒకటి రెండు చపాతీలు నేయి లేకుండా తీసుకుంటే బాగా పనిచేస్తుంది.

వ్యాయామం : 1. రోజూ ఒక మైలు దూరమన్నా నడవాలి. 2. ముందుకు ఒంగుని పాదాల్ని స్పృశించాలి. మొదటివారంలో రోజుకు ఐదుసార్లు ఇలాచేస్తేచాలు. రెండోవారం పదిసార్లు, మూడవ వారం పదిహేనుసార్లు చేయాలి. బరువును తొందరగా తగ్గించేసుకోవాలంటే మీరోపని చెయ్యొచ్చు. 'డా. స్టెల్లెజర్స్ స్విస్ రెడ్యూసింగ్ క్రీమ్' ఒకటి వుంది. దానిని శరీరమంతటాపూస్తే బరువువేగంగా తగ్గిపోతుంది.

మీ సమస్యలకు సమాధానాలు

శ్రీమతి టి. టి. ఆర్, గూడూరు.

నడుము సన్నగా అవాలంటే ఏంచేయాలి?

* కాళ్లు ముందుకు చాచుకుని కూర్చోండి. నడుం వంచి బొటనవేలిని తాకండి. రోజూ ఉదయాన్నే పదిసార్లు ఇలా చేసి చూడండి.

శ్రీమతి ఎమ్. పి. డి., మద్రాసు.

కనురెప్పలమీద వెంట్రుకలు పొడవుగా అవాలంటే ఏంచేయాలి?

* వేళ్ల సుతకు ఆముదం రాసుకుని రోజూ పడుకోబోయేముందు కనురెప్పల్ని మర్దించి చూడండి. మంచి ఫలితాన్నాశించడానికి మూడు నెలలైనా ఇలా చేయాల్సి వుంటుంది.

శ్రీమతి టి. పి. టి., నెల్లూరు.

నేను చాల నలుపు. నా నలుపు ఏమాత్రమయినా మారేందుకు అవకాశముందంటారా?

* బ్లీచింగ్ ట్రీట్‌మెంట్‌తో నలుపు కొంచెం చాయ మారడానికి అవకాశం ఉంది. ఈ చికిత్స మా క్లినిక్‌లో ఇప్పుడు చేస్తున్నారు. ఒకసారి ఈ చికిత్సపొంది తర్వాత మీ యింటిదగ్గర అనుసరించవచ్చు. పూర్తి అడ్రసు తెలియపరచి 15 పైసల తపాలాబిళ్ల పంపిస్తే వివరాలు పంపిస్తాము.

ప్రశ్నలు శ్రీమతి విద్య, బాక్స్ నెం. 1000, కేరాఫ్ ఆంధ్రపత్రిక, మద్రాసు—1 కి పంపాలి.

దీపం

బి.పి. కరుణాకర్



కుండ కడిగి నిండా నీళ్ళు ముంచుకుంది సీత. రెండు మెట్లు ఎక్కింది. కాలు జారింది. క్రింద పడిపోయేదల్లా చేయి ముందుకు చాపి తమాయించుకుంది. కుండ మెట్ల మీద పడి పగిలిపోయింది. తలెత్తి చుట్టూ ఒకసారి చూసింది. రేవు గట్టు మీదున్న చిటికేసర చెట్లు సాయంకాలపు మసక చీకట్లో ఒదిగిపోతున్నాయి. సీతకు ఒక్కసారిగా దుఃఖం ముంచుకు వచ్చింది. ఈ సంగతి తెలుస్తే అమ్మ తిడుతుంది. పెద్దోడికి, చిన్నోడికి చెబుతుంది. పెద్దోడు ఏమీ అనడు కాని, చిన్నోడు వూరుకోడు. వాడికి కోపం ఎక్కువ. నాల్రోజుల క్రిందటే మంచి నీళ్ల కుండ పగిలిపోయింది. దాన్ని తనే పగలగొట్టింది. చిన్నోడు ఏఖయాల్లో ఉన్నాడో కాని తననేమీ అనలేదు. మరో కుండ కొనితెచ్చాడు. ఈసారి ఊరుకోడు.

పగిలిన ముక్కలు ఏరి చేత్తో పట్టుకుని గట్టు మీదకు వచ్చింది. ప్రక్కనే ఉన్న కంచెలోకి విసిరి వేసింది. వెనకకు తిరిగి ఇంటి వైపు నడవసాగింది. తనకు తగిలే తిట్లు తలుచుకుని సీత హృదయం భయంతో క్రమంగా భారం కాసాగింది.

ఇల్లు దగ్గరైంది.

చప్పుడు కాకుండా ఇంట్లోకి అడుగు పెట్టింది సీత. గదంతా చీకటిగా ఉంది. దీపం ఇంకా వెలిగించలేదు. అడుగులు తడబడుతున్నాయి. వంటింట్లోకి నడిచింది. పొయ్యి దగ్గర కూర్చుని అట్టముక్కతో మంటను విసురుతున్న తల్లి దగ్గరకు వచ్చి ప్రక్కనే నిలబడింది.

"అమ్మోయ్" పిలిచింది సీత.

వెంకమ్మ తలెత్త లేదు.

సీత తిరిగి పిలిచింది.

వెంకమ్మ తలెత్తకుండానే, "ఏటే" అన్నది.

"ఇంటో దీపమెట్టనేదేటే"

వెంకమ్మ మాట్లాడలేదు.

"పెద్దోడు, సిన్నోడు రానేదా పొలం కాడ్నుండి?"

వెంకమ్మ తలతిప్పి సీత వంక చూసింది. ఏదో చెప్పబోయి ఆగిపోయింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. సీత తల్లి ప్రక్కనే కూర్చుని తల్లి చేతిలోని అట్టముక్కను తన చేతుల్లోకి తీసుకుంది.

"ఏటైనాది?" అడిగింది సీత.

వెంకమ్మ జవాబు చెప్పలేదు. మండుతున్న పొయ్యిలోకి రెండు క్షణాలు చూసింది. ఆమె కళ్ళల్లో నీరు నిలవడంలేదు. చెంపల మీదుగా కారిపోతోంది. చెంగుతో ముఖం తుడుచుకుంది.

"సీతా" అన్నది వెంకమ్మ.

సీత ముందుకు వంగి తల్లి ముఖంలోకి చూసింది.

"ఏటైనాదే. సెప్పు."

"నీళ్ళు తెచ్చేవా ?"

సీత హృదయం లిప్త కాలంపాటు ఆగిపోయింది.

"మరే...మరే..."

"తేనేదా?"

"కుండ పగిలిపోనాదే" అన్నది సీత మెల్లగా. సీతకు దుఃఖం ముంచుకు వచ్చింది. "కాలు జారిపోనాదే. సత్తెం. ఇంకెప్పుడూ పగలగొట్టనే. సిన్నోడికి ఈ ఇసయం సెప్పమాకేం.." తల్లిని పట్టుకుని ఏడుస్తూ అన్నది.

వెంకమ్మ కూతురును దగ్గరకు తీసుకుని తల నిమిరింది. ఆమెకూ దుఃఖం ఆగలేదు.

"సిన్నోడ్ని.." అని ఆగిపోయింది వెంకమ్మ.

"సిన్నోడ్ని?"

"కొట్టారే... తల బద్దల సేసేసినారే."

సీత ఉలిక్కిపడి తల్లి ముఖంలోకి చూసింది. వెంకమ్మ పెద్దగా ఏడుస్తుంది.

"ఎప్పుడు?" అడిగింది సీత.

"ఇప్పుడే."

"ఓ రేటి?"

"సొదరయ్య కొడుకు. రచ్చబండ కాడ. సొదరయ్య కొడుకు ఈస్వరానికీ, సిన్నోడికీ మాటామాట వచ్చిందట. ఆమాల్ను ఈస్వరం, ఎంకటసామి, ఈరయ్యా ముగ్గురూ కల్సి కర్రలుచ్చుకుని సిన్నోడి తల బద్దలు కొట్టేసినారమ్మా..."

సీత హృదయం బాధతో సుళ్ళు తిరిగింది. చాలి

సేపటి వరకూ మౌనంగా మంటలోకి చూసింది. వెంకమ్మ కుమిలి కుమిలి ఏడుస్తోంది. తల్లికి ఎట్లా వోదార్చాలో సీతకు అర్థం కాలేదు. చివరకు అడిగింది: "పెద్దోడేడి?"

"సిన్నోడ్ని పట్నం తీసుకుపోయాడు. నే కూడా ఒత్తానంటే ఒద్దన్నాడు.. ఆ ముదనష్టపోళ్ళు సిన్నోడ్ని బలంగా కొట్టాక...అంతా రగతం...నన్ను కూడా సరింగ సూడనీలేదు..." దుఃఖంలో ఆమె మాటలు ఎక్కడిక్కడ తెగిపోతున్నాయి.

సీత లేచి నుంచుంది. కళ్ళు తుడుచుకుంది. మధ్య గదిలోకి వచ్చింది. దుఃఖం ఆగడం లేదు. దీపం వెలిగించాలన్న ఆలోచన హృదయాంతరాల్లో పొంగి పొర్లుతున్న ఆవేదనలో ఇంకిపోయింది. బైటకు వచ్చింది. అరుగు మీద నుంచుంది. సావడిలో లేగ దూడ అరుస్తోంది. దాని దగ్గరకు వెడదామని, దాని తల నిమురుదామని అనిపించడంలేదు. అరుగు దిగి మంచం వాల్చింది. తిరిగి ఎత్తింది. కోడుకు తల అన్చి కొట్టుకుంది. "సిన్నోడా.. సిన్నోడా" మనసు కుళ్ళికుళ్ళి ఏడుస్తుంటే అనుకుంది.

సీత పుట్టిన సంవత్సరానికి వెంకమ్మ భర్త ఇహ లోక యాత్ర చాలించాడు. భర్త మిగిల్చిన నాలుగు ఎకరాల భూమితోనూ, తన గుండె నిబ్బరంతోనూ పెద్దకొడుకు నారాయణను, చిన్నకొడుకు రమణయ్యను, సీతనూ పెంచి పెద్ద చేసింది వెంకమ్మ. తల్లి మంచితనం నారాయణకూ, సీతకూ అబ్బింది. రమణయ్య కోపిష్టి. తొందరపాటు మనిషి. సీతకు పదహారేళ్ళుంటాయి. చందనపు బొమ్మలా అందంగా వుంటుంది. పాల నురుగులాటి యవ్వనం సీత రూపు రేఖలను మరింత దేదీప్యమానం చేసింది. సీతలాటి అందగత్తె ఆ వూళ్ళోనే కాదు, ఆ చుట్టుప్రక్కల వూళ్ళల్లో కూడా ఎవరూ లేరు. సీత పొందు కావాలనే ఉబలాటం ఆవూరి కుర్రకారుకే కాదు, పెద్దవాళ్ళకూ ఉంది. రమణయ్య అంటే భయం వల్ల కావచ్చు, వెంకమ్మ కుటుంబం మీదున్న గౌరవం వల్లకావచ్చు. ఆ ఉబలాటం అవ్యక్తంగానే ఉండిపోయింది.

అయితే—

సరిగ్గా నెలా పదిరోజుల క్రిందట ఒక సంఘటన జరిగింది. ఆ సంఘటన జరిగి ఉండకపోతే ఈరోజు రమణయ్యను ఈశ్వరం, వెంకటస్వామి, వీరయ్య కలిపి రచ్చబండ దగ్గర కొట్టి ఉండేవారు కాదు.

ఆరోజు—

సాయంత్రం.

చీకటి పడలేదు.

సీత పొలానికి వెళ్ళింది. గడ్డి కోసుకుని మోపు కట్టి, తల మీద పెట్టుకుని సరివితోపు ప్రక్కగా ఉన్న బాట మీద మెల్లగా నడుస్తోంది. ఎదురుగా గుట్ట. గుట్టదాటితే వూరు. అంతలో ఈశ్వరం వెనక గుండా వచ్చి సీత చేయి పట్టుకు లాగాడు. సీత కుడి చేతికున్న నీలం రంగు గాజులు రెండు పగిలిపోయాయి. గడ్డిమోపు క్రింద పడిపోయింది. సీత నిశ్చేష్ట రాలైంది. ఈశ్వరం సీత చేయి వదలలేదు. మరింత గట్టిగ పట్టుకుని సరివితోపులోకి లాగుతున్నాడు.

సీత కదలలేదు. ఆలోచలన్నీ ఆగిపోయాయి. గుండె మండుతూ వేగంగా కొట్టుకోసాగింది. గొంతులో తడి ఆరిపోయింది.

"పినబాబూ" అన్నది సీత పెద్దగా.

ఈశ్వరం ఉలిక్కిపడలేదు. ఎర్రగా ఉన్న కళ్ళతో అందంగా నవ్వాడు.

అతని చేతి పట్టు విడిపించుకోబోయింది సీత వీలు కాలేదు.

"ఒదులు."

"రాయే సీతా.. ఎవరూ లేరు."

"పినబాబూ."

సీత కాళ్ళు వణుకుతున్నాయి. ఈశ్వరం వది లేట్టు లేదు. ఎక్కడలేని శక్తి కూడ దీసుకుంది. ఒక్కసారిగా ఈశ్వరం చేయి విదిలించుకుని గడ్డి మోపుకున్న కొడవలి అందుకుంది. చేయి వణుకుతోంది.

"ఒక్కడుగ్గాని ముందు కేస్తివా..." కొడవలి ఎత్తి పట్టుకుని అన్నది సీత.

ఈ హఠాత్ చర్యకు ఈశ్వరం బిత్తరపోయాడు. నుంచున్న చోటు నుండి కదలలేదు. సీత వెన్నక్కి తిరిగి గట్టు దాటి పరుగెత్తుకుంటూ వూళ్ళోకి వచ్చింది. ఇంట్లోకి వచ్చిన తర్వాత కూడా సీత అలుపు తగ్గలేదు. జరిగినదంతా రమణయ్యకు, తల్లికి చెప్పింది. రమణయ్య వింటూనే కోపంతో నిలువెల్లా వణకిపోతూ, పైపంచ మీద వేసుకుని ముల్లుకర్ర తీసుకుని బైటకు వచ్చాడు.

"అరే సిన్నోడా! ఆళ్ళతో ఎందుకురా తగాదాలు? ఆళ్ళు పెద్దోళ్ళు. ఎన్నిసేసినా సెల్లుద్ది. నా మాట ఇనుకో. పోమాక. పైగా మన పరువే పోద్ది. అసలేం జరగనేదనుకుందాం" రమణయ్యకు అడ్డువస్తూ అన్నది వెంకమ్మ.

"నీకుతెలీదు వూరుకోయే. ఆళ్ళకూ ఆడకూతుళ్ళున్నారు. ఆళ్ళనిలా సేత్తే వూరుకుంటారూ? సెప్పు." అన్నాడు రమణయ్య.

సమయానికి చౌదరయ్య, మునసబు ఇద్దరు ముగ్గురు వూరిపెద్దలు రచ్చబండ దగ్గరే ఉన్నారు. చౌదరయ్యను చూడగానే అప్పటివరకు తనను అధిగమిస్తున్న ఆవేశానికి అంతకుమించిన ఆవేదనకు కారణమైనవిషయాన్ని ఎట్లా చెప్పాలో రమణయ్యకు తోచలేదు.

"దండాలు బాబూ" అన్నాడు రమణయ్య వినయంగా.

మెలితిప్పినమీసాల్లోంచి చిన్నగా నవ్వి, "ఏమిట్రా రమణయ్య, బావున్నావా?" అడిగాడు చౌదరయ్య.

"తమతో ఒక ఇసయం సెబుదామని వచ్చేను." అన్నాడు రమణయ్య.

మునసబు ముందుకు జరిగి కూర్చున్నాడు.

చౌదరయ్య జేబులోంచి చుట్ట తీసి వెలిగించాడు. "ఏట్రోయ్ అది?" అన్నాడు.

జరిగిన విషయాన్ని చెప్పాడు రమణయ్య. చౌదరయ్య అంతా విని, "మావాడు అలాటి వాడు కాడే" అన్నాడు.

"అవునవును" అన్నాడు మునసబు.

"నేనబద్ధం సెబుతున్నానా?" కోపాన్ని దిగమింగుకుని అన్నాడు రమణయ్య.

చౌదరయ్య భుజాలు ఎగర వేశాడు. "ఏమో. అయినా చూడు రమణయ్య, మన బంగారం మంచిదైతే..." అని ఆగిపోయి పొగ పీల్చి వదిలాడు.

రమణయ్య శరీరంలోని రక్తం అంతా ఒక్కసారిగా అతని కళ్ళల్లోకి ప్రవహించి గడ్డ కట్టింది. "బాబూ! అబద్ధం సెబితే నాకేమీ రాదు. తమకూ ఆడకూతుళ్ళున్నారు. ఆళ్ళను ఎవరేనా అట్టా సేత్తే ఎట్టా ఉంటది?" అడిగాడు రమణయ్య.

"అడ్డి నరికి పారేస్తాం."

"మిగతా ఆళ్ళు కూడా అంతే అనుకోండి. సినబాబును కాస్త ఒళ్ళు దగ్గరెట్టు కోమని సెప్పండి." అని ముల్లుకర్రను టకటక లాడించుకుంటూ వెళ్ళిపోయాడు రమణయ్య.

చౌదరయ్య వదనం వివర్ణమైంది. వణికే చేత్తో నోట్లోంచి చుట్ట తీసి రమణయ్య వెళ్ళిన వైపే చాల సేపటి వరకు చూస్తుండి పోయాడు.

చౌదరయ్య ఆ వూరికి మకుటంలేనిరాజు. అతని మాటకు తిరుగు ఉండదు. ఉండకూడదు. అథవా ఉన్నా ఏదో విధంగా ఆ'తిరుగు'ను రూపు లేకుండా చేయగల శక్తి అతనికి వుంది. సీతకు జరిగిన అవమానానికి తన కొడుకు కాకుండా మరొకరు మరొకరైతే పంచాయతీ పెట్టించేవాడే. అయితే ఇప్పుడది చేయదల్చుకోలేదు. 'నిజమేనా' అని ఈశ్వరాన్ని కూడా అడగలేదు. ఈశ్వరం అటువంటి పనులు చేస్తుంటాడని అతనికి తెలుసు. ఈ విషయాన్ని నలుగురి ముందూ తనను అడిగినందుకు రమణయ్య మీద 'కోపం' వచ్చింది చౌదరయ్యకు.

అందుకే మాట మీద మాట పెంచుకుని చౌదరయ్య మద్దత్తుతో రమణయ్యను ఒక్కడిని చేసి కొట్టారు. రమణయ్యకు నాలుగురోజుల వరకు స్పృహ రాలేదు. ఐదో రోజున స్పృహ వచ్చింది. కాని ప్రాణం నిలువలేదు.

పై వూరునుండి ఈ కేసు విషయాలు ఆరా తీయడానికి ఒక సబ్ఇనస్పెక్టర్ నలుగురు పోలీసులతో వచ్చాడు. చౌదరయ్య వాళ్ళందరకూ కోళ్ళు కోసి విందు చేశాడు. ఆవూళ్ళోవాళ్ళురెండురోజులున్నారు, మూడో రోజున వెళ్ళిపోయారు. అంతే. ఏమీ జరగలేదు.

రోజులు గడచిపోతున్నాయి. వెంకమ్మ మానసికంగా చాల కృంగిపోయింది. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ కూర్చుంటుంది. నారాయణకు తమ్ముడి చావు అఘాతంలా తగిలినా, ఆ బాధను దిగమింగుకుని కాలం దాటుకు వస్తున్నాడు. ఈశ్వరం ఆగడాలు రానురాను ముదిరి పోసాగాయి. సీత ఇంట్లోంచి బైటకు రావడం మానివేసింది. ఈశ్వరం అప్పుడప్పుడు నారాయణను మాటలతో కవ్వించేవాడు. నారాయణ ఆ మాటలేవీ పట్టించుకునే వాడుకాదు. మాట మీద మాట పెరిగితే తనే తగ్గిపోయేవాడు. ఇంటికి వచ్చి జరిగినదంతా తల్లితో చెప్పేవాడు.

"పెద్దోడా! అంతేరా ఆళ్ళు. పైన బగమంతుడు వ్నాడు. ఆళ్ళ పాపాన ఆళ్ళే పోతారు." అన్నది వెంకమ్మ ఒకరోజు.

"ఎన్నాళ్ళనే వూరుకునేది?" అడిగాడు నారాయణ.

వెంకమ్మ ఏడుస్తూ, "సిన్నోడు నన్నాయం సేసిండు. నా కడుపు కాలిపోనాది. నువ్వు నన్నాయం సేత్తావురా?" అడిగింది.

ఒకరోజు ఈశ్వరం తలవంచుకుని పోతున్న నారాయణను పేరెట్టి పిలిచి సీత మీద బూతు మాట విసిరాడు నవ్వుతూ. నారాయణ తన కోపాన్ని నిగ్రహించుకునేందుకు ఎటువంటి ప్రయత్నం చేయలేదు. ముందుకు వచ్చి ఈశ్వరం చొక్కా పట్టుకున్నాడు. మెలి తిప్పి క్రింద పడేశాడు. మీద కూర్చుని ఈశ్వరం ముఖం మీద తన శక్తి కొద్దీ నాలుగు గుద్దులు గుద్దాడు. లేచి, "నాయాల! మాయమ్మ ముకం సూసి ఇంతటితో ఒదుల్తుండాను. రగతం తాగుతాను. ఏటనుకున్నావో. ఒళ్ళు తగ్గరుంచుకో." అని తన దారిన తాను వెళ్ళిపోయాడు నారాయణ.

యాభై గజాల దూరం నుండి అంతా చూస్తూనే ఏమీ చేయలేకపోయాడు చౌదరయ్య. ఈ విషయం వెంకమ్మకు తెలియదు. సీతకు తెలిసింది. తల్లికి చెబుదామనుకుంది. చెప్పలేదు.

అర్ధరాత్రి సమయంలో వెంకమ్మకు హఠాత్తుగా మెలకువ వచ్చింది. లేచి కూర్చుంది. కోడిగుడ్డు దీపం గదిలో సన్నగా వెలుగుతోంది. సీత పండుకున్న మంచం వైపు చూసింది. నిద్ర పట్టక కదులాడుతుంది సీత.

"సీతా" పిలిచింది వెంకమ్మ.

సీత లేచి కూర్చుంది. చల్లటి గాలి వీస్తోంది. దుప్పటి తీసి నిండా కప్పుకుంది.

"నిద్దోలా?"

"లేదే."

"ఏం?"

సీత జవాబు చెప్పలేదు. ఆమె మనసంతా అవ్యక్తమైన భయాందోళనతో నిండి ఉంది. మంచం దిగి నుంచుంది.

"కాసిని దప్పి కియ్యే" అన్నది వెంకమ్మ.

సీత ప్రక్కగదిలోకి కదలబోయింది. తలుపు మీద ఎవరో తడ్తున్న చప్పుడు వినిపించింది.

"ఓరు."

"నేనే. రాజయ్యను. తలుపు తీయ్. బేగే."

సీత తలుపు గడియ తీసింది.

"ఏట్రా రాజయ్యా?" అడిగింది వెంకమ్మ. రాజయ్య ముఖమంతా చెమట పట్టి ఉంది. ఆయాస పడ్తున్నాడు. ఇంట్లోకి రెండడుగులు వేసి ఆగిపోయాడు. వెంకమ్మ ముఖంలోకి చూశాడు. "మరి...మరేం.." అని ఆగిపోయాడు.

"ఏట్రా. సెప్పు." విసుక్కుంది వెంకమ్మ.

"నేను మీ పొలం కాడ్నుండే వత్తుండ.. మరి.. మరి.. పెద్దోడ్ని సంపేసినాడే.. మంచెంత రగితం.. నా కళ్ళు తిరిగిపోనాయి..." ఆతర్వాత రాజయ్య ఏం చెప్పాడో సీతకు వినిపించలేదు. కుప్పలా కూలిపోయింది. అరగంట తర్వాత స్పృహ వచ్చింది. చుట్టూ చూసింది. తల్లి లేదు. తలుపు బార్లా తెరచి ఉంది. లేచి నుంచుంది. దేవుడి పటం దగ్గరకు వచ్చింది. రెండు చేతులూ జోడించి చిన్నగా పెదాలు విప్పింది. కళ్ళల్లో నీరు నిలవడంలేదు. దేవుడి పటం మీద సీత నీడ పడుతోంది. "బగవంతుడా..." అన్నది సీత. దుఃఖం ఆగలేదు. "నా కోసం.. మేమేం సేసాం?..

... నువ్వు గొప్పోడివి...శానాశానా గొప్పోడివి."

వెనకకు తిరిగింది. తలుపు దగ్గరకు నడిచి బైటకు చూసింది. చిక్కగా కురుస్తున్న వెన్నెలలో వూరు మత్తుగా నిద్ర పోతోంది. తలుపు వేసి గడియ పెట్టింది. దీపం దగ్గరకు వచ్చింది. వత్తి పెద్దది చేసింది. చిమ్నీ పసి బారి పోసాగింది. ●

పి. రామలక్ష్మి

నేటి పత్రికలలో పురుషులకన్నా స్త్రీలే ప్రజాదరణ పొందుతున్న రచనలు చెయ్యడానికి కారణం?

ఈ ప్రశ్న క్లిష్టంగా వుంది. ఎందుకంటే స్త్రీలు చాలా గొప్పగా వ్రాస్తున్నారని నేను అనుకోవడం లేదు, బాగా ప్రజాదరణ పొందుతున్నాయని తెలిసినా.

అయితే ముఖ్యమైన ప్రశ్న స్త్రీల రచనలు **ఎందుచేత ఎక్కువ** ప్రజాదరణ పొందుతున్నాయి? నాలుగు వాక్యాల్లో నాకు తోచినది చెప్పగలను. కాని అందువల్ల చదివిన ప్రయోజనమైనా మిగలదు. **అంతరాంతరాల్లో** మరో భయం కూడా వుంది. **బరువైన** మాటల్ని తేలికగా తీసుకుని, కాబోయే పురుష రచయితలు ఆడవాళ్ల ఫక్కీ అనుసరిస్తే చాలా అన్యాయమైపోతుంది సాహిత్య లోకం.

మామూలుగా పత్రికా రచనకి స్త్రీ పురుషులు **అవలంబిస్తున్న** విధానం క్రింది విధంగా ఉంటున్నది.

(1) ప్రయోజనాత్మక దృష్టితో వచ్చేరచనలు (2) ప్రయోజనంతో పనిలేని (అనగా మనస్సును కేవలం **ఆహ్లాదపరిచే**)రచనలు. (3) జీవితంలోనో, సంఘంలోనో ఉన్నలోటు పాట్లను యథా తథంగా చిత్రించి, ఫలితాన్ని గాలికీ, తెలివైన మెదడుకీ వదిలేవి. (4) గంభీరమైన సత్యాన్ని హాస్యంతోనో, **వ్యంగ్యం** గానో చెప్పే మరికొన్ని కథలు నవలలు.

పాఠకుని మనస్తత్వం బాల్య కౌమార యవ్వన ప్రౌఢ వార్ధక్య చరమ దశల్లాగ మారుతుంటుంది. **లేక ఒక** క్రమం లేకుండా మారుతుండవచ్చు. ఒకప్పుడు ప్రయోజనాత్మకంగా లేని కథల వల్ల లోకానికి **ఒరిగేదేమిటి అనిపిస్తుంది.** మరొకప్పుడు మనో**రంజకమైన రచన** చదివినప్పుడు, మనస్సుని ఆహ్లాదపరిచే **రచనే ఉత్తమమైంది** అనే నిర్ణయంలోకి వస్తాడు పాఠకుడు. **వీటన్నిటినీ** మించినది, ఇటీవల రచయితల కలాల్నిస్వాధీనం చేసుకుంటున్న ధోరణి **ఒకటుంది.** "ఓ మానవుడా నువ్వింతనీచంగా దయనీయంగా ఉన్నావు" అని చెప్పడం కాక "మనిషి కథ ఇంత దరిద్రంగా లేదా నికృష్టంగా వుంది" అని చెప్పే లౌక్యమైనమార్గాన్ని అవలంబిస్తున్నారు రచయితలు. అవి నీతి కథలు చెప్పేటప్పుడు ఈ మార్గం ఈ రకమైన కథలు, నవలలు **ఎంత** అసత్యాన్ని చెప్తాయో, ఒక్కొక్కప్పుడు **అంతగానూ** కదిలించి వదుల్తాయి. వైవిధ్యంతో కూడిన ఇలాటి కథారచనలో నాకు తెలిసినంతమటుకు, చదివినంత వరకు స్త్రీ, పురుషులు సమానంగా ఉన్నారనిపిస్తుంది. ప్రతియేటా **వచ్చే పోటీకథల వల్ల** ఈసంగతి స్పష్టం అవుతుంది.

ఇక పోతే నవలలు, అంటే పత్రికా ముఖంగా **సీరియల్సు** అన్నమాట.

ముఖ్యంగా నవలా రచనలోనే ఆడవాళ్లప్రత్యేకత కనిపిస్తుంది. (అంటారు చాలామంది). కొంతవరకు వాస్తవమే.

'నిజంచెప్పాలంటే రచయిత అనేవాడు ఒక కథ వ్రాసింతర్వాత దాన్నే మళ్లీ మళ్లీ వ్రాస్తూంటాడ'ని ఒకరచయితచెప్పినట్టు ఓవిమర్శకుడువ్రాశారు 'అక్షరాల నిజం అనిపించింది. అయితే రెండుగా **విభజించాలి.** రచయితలు 'పాత్ర' అనే మళ్లీమళ్లీ వ్రాస్తున్నారు. **రచయిత్రులు** 'కథ' నే మళ్లీమళ్లీ వ్రాస్తున్నారు. **వీళ్లంతా** ఎందుకిలాంటి 'వల'యంలో ఉండి పోతున్నారా అని ఆలోచన వస్తుంది. ప్రత్యేకతను సాధించడానికి అనే జవాబువస్తే సరిగా లేదను కుంటాడు పఠిత. ప్రఖ్యాతి కొనుగోలుకి అని తోస్తే మాత్రం పఠితగా అనుభవజ్ఞుడైన ఏమనిషి హర్షించడు. ఒకపాత్ర ఎంతగా ఉగ్రాతలూగించినప్పటికీ అదే పాత్ర అదేరచయిత మళ్లీ వ్రాయడం జరిగితే పాఠకుడికి **విసుగు లాటి నిస్పృహ** కలిగి తీరుతుంది. అవే పాత్రలు (ముఖ్యంగా గంభీరమైనవి) వరసగా వస్తే వేరుగా చెప్పాలా?

ఇక ఒక ప్రసిద్ధ పాత్రను మరోరచయిత గ్రహిస్తే (గ్రహించినట్లనిపిస్తే) మరీ **హాస్యాస్పదంగా** తయారవుతుంది. తను సృష్టించిన ఒక పాత్రమీద నమ్మకం కలగడం, దానిలో గొప్ప ఆదర్శం లేదా ఆకర్షణ కనిపించడం రచయితకి సహజం. తన మునుపటి పాత్రలోనే సున్నితమైన మార్పుతేగలగడం అరుదుగా జరుగుతుంది. ఎందుకంటే సంకల్పాను సారంగా కలం నడవక పోవడమే. తన పద్ధతి ఉద్దేశం మారకుండా, తన ఇష్టమూ ఆదర్శమూ మారకుండా కథలో బాగా విభిన్నత తీసుకొచ్చే రచయితే రచయితగా నాలుగు తరాల్ని వూగించగలడు. అయిదుగురు మహా **రచయితలుం**టే ఏయిద్దరో అలాంటి వారుంటారు. ఉన్నారు. కాస్త వ్యూహబలమున్న పఠిత పోల్చుకోడం కష్టం కాదు. ఒక ప్రసిద్ధ **రచయిత** మూడు తరాలు చూసి (కనీసం ఎనభై ఏళ్లన్నావుండి) విరివిగా రచిస్తే **తరానికొక** రచన చొప్పున మూడు 'రచనలుఉన్నతస్థానంలో నిలబడతాయి. **మిగిలిన** వన్నీ రచయిత విలువ ఆకర్షణల్ని బట్టే అని నిస్సంకోచంగా అనుకోవచ్చు.

రచయిత్రుల సంగతి మరీ సరదాగా **వుంటుంది.** అసలు ఈశీర్షిక ప్రాముఖ్యం అదే.

రచయిత్రుల నవలల్లో, కథ (మూలకథ)కొద్దిగా మార్పు చెందుతుంది. జరిగేకథ (సీరియల్‌గా) చదువుతుంటే కొద్దిరోజుల క్రిందట ఆరచయిత్రే వ్రాయగా చదివిన నవల మళ్లీ చదువుతున్నట్లుంటుంది. సంభాషణల్లో అయితేనేం, ఘట్టాలలో అయితేనేం మార్పు కనిపించడమే అరుదు. చూసిందే చూస్తున్నట్లనిపించే స్వంటుచిత్రాలకి సీటికీ ఒకే లక్ష్యం. ఒకటే తేడా. నిడివిలో చాలా పోలిక. ప్రయోజనమన్నా ఎక్కడుందోఒకపట్టాన దొరకదు **ఆలోచించే పాఠక వర్గానికి.**

కానిమరి స్త్రీల రచనలే ప్రజాదరణ **పొందు**తున్నాయంటే కారణం 'ఆడవాళ్లు' **అవటంచే** మాత్రం కాదు. స్త్రీ అయినా పురుషు**డైనా** 'బాగా' వ్రాయకపోతే రచనకి ఆదరణ **గగనకుసు**మంలాటి దైపోతుంది ఆడపిల్ల కదా **అంటూ** ప్రశంస వస్తే అది ప్రశంసకాదు. **ఆత్మ**వంచన చేసుకునే పాఠకుడు పాఠకుడూకాడు. **రచయిత్రు**లకి చాలా ఉత్తరాలు వస్తాయి. **అందులో పది** ప్రశంసా లేఖలొస్తే వాటన్నిటికీ సరిపడే **ఉత్తరంఒకటి** రాకపోదు. "మీరచన ఏం బాగా లేదు. **దయ**చేసి మీరిక మీదట ఇలాటి కథలు మానెయ్యండి. తక్షణం మానేస్తారు కదూ?" దీని '**అర్థమేమిటి?** నిరంతరం కొత్తవైపుకి పరిగెత్తే పాఠకుడికి విభిన్నత కనిపించక విసుగెత్తుకొస్తోందన్నమాటే.

అయితేనేం పురుషులకన్న స్త్రీలు బాగా వ్రాస్తున్నారు అని ఒకవిధమైన సాహసంతోచెప్పాలి. ఎందుచేతంటే ఆ'బాగావ్రాసే' వాళ్లు **బహుకొద్దిమంది.** ప్రజాదరణబట్టి చూస్తే స్త్రీ తెలివి తేటలు **అర్థ**మవుతాయి పందొమ్మిదేండ్ల అబ్బాయికంటే పదిహేడేండ్ల అమ్మాయి ఆలోచనా **పరురాలు**లంటారు. సాధారణంగా అంతే. రచయిత్రి **అయిన** స్త్రీ (శ్రీమతి అయినా కుమారి **అయినా**) **పద్దెని**మిది వయసు దాటాకనే గొప్పగా వ్రాయడం జరుగుతుంది.

పురుషులకన్న మిన్నగా వ్రాస్తున్నారా **అన్నది** సమస్య అయితే, మొత్తానికి సరిసమానంగా రాగలరు అన్నదే సమాధానం. ప్రజాదరణ **ఒక్కటే ఘనతా?** నాలాటివాళ్లు **ఒప్పుకోరు.** ప్రజాదరణ కారణాలు చాలా ఉంటాయి.

ప్రధానవస్తువు ఏదైతే పాఠకుల **గుండెను** పిండగలదో రచయిత్రులకి తెలుసు బాగా **కదిలించే** వాస్తవిక ప్రయోజక లేక సాంఘిక నవలలు (నవలికలైన) వ్రాయలేకపోయినా పాఠకుల ఆనందానికి వాలిపోయే తాత్కాలిక రచనలు చక్కగా వ్రాస్తారు. ముఖ్యంగా సున్నితమైన ప్రకృతి వర్ణనలు ఆడవాళ్ల రచనల్లోనే సహజత్వాన్ని నింపుకుంటాయి. వచ్చీరాని బాలలు వ్రాసిన వ్యాసంలా ఉండకుండా, పండితుల అప్రతిమాన సరళిలా కాకుండా ఆహ్లాదకరంగా చిత్రిస్తారు. స్త్రీ పురుషుల్ని (భార్యాభర్తలు, లేక ప్రేయసీ ప్రియులు) కాస్త ఎడంగా నిలబెట్టి దీర్ఘ సంభాషణలు కొనసాగిస్తారు. వాళ్లు కౌగలించుకో బోతున్నారేమో అన్నంత ఉద్రేకంగా సంభాషణ సాగిసాగి అంత పనీ జరిగే సమయానికి కొంచెం ముందుగా 'ఇంకా వుంది' తో ఆగుతుంది. వారంకోసం, లేదా నెలకోసం ఉత్సాహంతో ఎదురు

వనితాలోకం

చూస్తారు పాఠకులు. ఒక్కొక్కప్పుడు వడిగావులు పడతారు. స్త్రీలవి సున్నిత హృదయాలు. ఓ విధమైన బలహీనత ఆవరించి ప్రపంచంలోని ఉన్నత లక్షణాలన్నీ నాయికా నాయకు లిద్దరికీ పంచిపెడతారు. ఇవన్నీ ప్రజాదరణకారణాలు కావని అనుకోకూడదు.

స్త్రీల నవలల్లో సాధారణంగా సంఘాన్ని సంస్కరించే ఉద్దేశం కనబడదు. కాని ప్రజల్ని ఎక్కువగా ఆనందింప జేస్తాయి సాహిత్య రంగానికి అలంకారాలు అనగల స్త్రీ రచనలు నిజానికి తక్కువయినా, పత్రికాలోకాన్ని అలరించగలశక్తి స్త్రీ రచయితలకే ఉందేమో అని అనుమానం వస్తుంది. ఇంత ప్రఖ్యాతి గడిస్తున్నా—అయిదుగురు మహా రచయిత్రులుండీ, ఏ ఒకరో యిద్దరో, ఒకటీ, అరా మంచిదనిపించే రచన (నవలే అనుకుందాం) అందిస్తున్నారు.

రచయిత్రిగా నేను వ్రాసినవి చాలా తక్కువ. లేకపోతే అనుభవ పూర్వకంగా నిష్పాక్షికంగా ఎన్నో విశేషాలు చెప్పగలిగేదాన్ని.

హృదయాన్ని తాకే ఉత్తమ రచన అందివ్వడానికి స్త్రీ అనీ పురుషుడనీ భేదం వుండదు. ఉండక్కరలేదు. కాని తమ రచన మీద తమకే విశ్వాసం లేక స్త్రీలపేర్లతో చలామణి అయ్యే పురుషులున్నారని అన్నప్పుడు నవ్వాలా ఏడవాలా? కొందరి తెలివి తక్కువ వల్ల రచయిత్రులంతా నిందల పాలయే పరిస్థితులు వస్తుంటాయి.

మొత్తంమీద చెప్పాలంటే పురుషులు సాంఘిక ప్రయోజనం సాధించడానికన్నట్టు వ్రాస్తారు. స్త్రీలు సాంసారిక జీవన సహజత్వాన్ని చిత్రిస్తూ వ్రాస్తున్నారు. ముందు ముందు స్త్రీలు తమ రచనల్లో వైవిధ్యాన్ని చూపాలని, విభిన్నత తీసుకురావాలని అంటాను. ●


ఆహారము - ఆరోగ్యము

*ధనవంతులు ఏమైనా ధనంతో కొనగలరు బీదవారు రెక్క ఆడితే డొక్క ఆడుతుందని ఆరోజు తెచ్చుకొన్నది ఖర్చుపెట్టి యింత తిని వుండగలరు ఎటొచ్చీ మధ్యతరగతి కుటుంబీకులకే ఎక్కడలేని సమస్యలు. రోజురోజుకి పెరిగిపోతున్న ధరలు వీరి పెద్ద సమస్యే. ఉదరపోషణకు అవసరమైన ఆహార పదార్థాలు ఎంత ధరైనా కొనుక్కోక తప్పదు. తగినంత బలమైన ఆహారం తీసుకోలేక వీరిలో పెద్దలకు నీర్సాలు, పిల్లలకు వయస్సుకి తగ్గ ఎదుగుదల లేకపోవుట మనం గమనిస్తూనే వున్నాము. ఈ రోజులలో పెద్దలలోను, పిల్లలలోను కూడా సాధారణంగా వచ్చే జబ్బులకు మూలకారణం 'మాల్ న్యూట్రిషన్' (అంటే తగిన ఆహార పోషణ లేకపోవుట). డాక్టర దగ్గరికి వెళ్ళితే "పళ్ళు, పాలు బాగా తీసుకోండి, యీ టానిక్కులు వాడండి" అంటాడు. డాక్టర తప్పులేదు. పళ్ళు, పాలు, టానిక్కులకు మనిషి ఒక్కంటికి నెలకు రమారమి 50 రూ. అవుతుంది ఇంత డబ్బు కుటుంబంలో ఒక్కరి మీదే ఖర్చు పెట్టడం సాధ్యంకాదు. అలాంటి వాళ్ళు కుటుంబంలో యింకా వుంటారు. నా స్నేహితురాలు సరోజ మధ్యతరగతికి చెందినదే. ఆమెను వేధించుతున్న సమస్యలు, బాధించుతున్న రోగాలు యిన్నీ అన్నీకావు. ఇద్దరు బిడ్డల తల్లికి ఎందుకు యీ సమస్యలు? తన ఆరోగ్యము, పిల్లల ఆరోగ్యము ఎప్పుడూ బాగుండదు అని అంటుంది. గృహిణి ఆరోగ్యము బాగులేకపోతే యింక ఆ యిల్లు నరకమే. ఇంతకూ ఆమెకు, పిల్లలకు తగినంత జబ్బు అంటూ ఏమీలేదు. ఎల్లప్పుడు తన నీడ లాగే నీర్సమూ వుంటుందిట. "మొన్న డాక్టరు దగ్గరకు వెళ్ళేను. రక్తము తక్కువగా వుంది, విటమిన్లు లోపించేయి," అని టానిక్కులు వ్రాసి యిచ్చేడు. అంత డబ్బు యిచ్చి కొనుక్కోలేను. కొనుక్కొన్నా తీసుకొన్నన్నాళ్ళు బాగానే వుంటుంది, మానీగానే మళ్ళా నీర్సం మొదలు." అంటుంది సరోజ. మల్లెపువ్వు లాగ వుండే అన్నమంటే యిష్టపడే సరోజ మందులు, టానిక్కులు కొనలేక నీర్సముతో తన బంగారం లాంటి సంసారాన్ని సమస్యల పాలు చేసుకుంటున్నది అంటే చాలా విచారకరమైన విషయం. తక్కువ ఖర్చుతో ఎక్కువ బలంగల పదార్థాలు చేసుకోలేక బాధపడుతున్నది.

మధ్యతరగతి కుటుంబీకులకు, ముఖ్యంగా తక్కువ రాబడి పెద్ద కుటుంబం వున్న వాళ్ళకి వున్న దానితోనే బలమైన ఆహారం లభ్యమయే విధాలు ఎన్నోవున్నాయి, మన కుటుంబాల్లో చాలామందికి నిజంగా తినడానికి బలమైన తిండి లేకపోయినా గొప్ప లెక్కువ. కొన్ని ఆహారలు, తినుబండారాలు అంటే కొంతమంది తక్కువగా చూస్తారు. అవి తినే వాళ్ళని వెక్కిరిస్తారని మరికొందరి భయం. ఇది కేవలం మనస్సు యొక్క బలహీనత—పిరికితనం. బొప్పాయి, వేరుశనగ కాయలు, ఆకుకూరలు, దుంపలు, అరటిపువ్వు, దంపుడు బియ్యం, అన్నం వార్చిన గంజి, జామపళ్ళు మొదలైనవి తక్కువవాళ్ళు తింటారని కొందరు అభిప్రాయపడతారు. కాని వీటిల్లో వున్న బలం యింక వేటిల్లోను లేదని తెలుసుకోరు చాలామంది.

గృహిణి తన తెలివితేటలు వుపయోగించి వంట చెయ్యాలి. తన వంట యిల్లే తన రీసెర్చి లేబరేటరీ. శాస్త్రాలలో ఎక్కడా యీ కూర యిలాగ చెయ్యాలి, ఆ పచ్చడి అలాగ చెయ్యాలి, యిది వండాలి, అది పారెయ్యాలి అని లేదు. ఉన్న దానిలోనే బలమైన ఆహారం లభ్యమయ్యే మార్గాలు చర్చిద్దాం.

మొదట అన్నం విషయం చూద్దాం. బియ్యం రకాలు అన్నిటిలోను దంపుడుబియ్యం చాలా శ్రేష్ఠమని అందరికి తెలిసినదేగాని యీ రోజులలో పట్నాలలో అవి దొరకవు. దంపుడు బియ్యం తరువాత ఉప్పుడు బియ్యం బలమని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. ఉప్పుడు బియ్యం అన్నం వాసన అని కొందరు అంటారేమో. కొన్నాళ్ళు అలవాటు అయితే ఏ వాసనా వుండదు. ఏ అన్నమైనాసరే వార్చడంతో కొంత బలం గంజిలో పోతుంది. అత్తెసరుగాని, కుక్కరుగాని పెడితే బలం అంతా అన్నంలోనే వుంటుంది. ముగ్గురు నలుగురు గల కుటుంబం అయితే కుక్కరు పెట్టుకో



వచ్చు. కుక్కరు అంటేమరేమీలేదు. ఒకపెద్ద గిన్నెలోగాని, మూకుడులోగాని నీరుపోసి అందులో అన్నంగిన్నెదింపి సరియైన మూత ఆవిరి పోకుండా పెద్దగిన్నెకి పెడితే అన్నం ఆవిరిమీద వుడుకు తుంది యిడ్లీలాగ. దీనికికూడా అత్తెసరులాగే ఒక కప్పుబియ్యానికి రెండు కప్పులు నీరుపొయ్యాలి. అన్నం మృదువుగా చాలా బాగుంటుంది. గంజివార్చి నట్లయితే తాగవచ్చును. అందులో వుప్పు, మజ్జిగ, నిమ్మరసం వేసుకుని త్రాగుతే బార్లీలాగ చాలారుచిగా వుంటుంది.

తరువాత కూరలు సంగతి. ఏ కూరైనాసరే వుడి కించినప్పుడు అందులో కొన్ని విటమిన్సు, లవణములు నీటిలోకి దిగుతాయి. ఆ కూరలో నీరు వార్చేస్తే అందులో వున్న విటమిన్లు, లవణములు మనకి లభ్యం కాకుండాపోతాయి. అప్పుడు మనం తినేది పిప్పి మాత్రమే. ఇంగ్లీషు వాళ్ళు కూరలు వుడికించి వార్చిన నీరుతో సూపు చేసుకుని తాగుతారు. ఉత్తర హిందూ దేశంలో కూర వుడికించి వార్చడం అంటే తెలియదు. ఏ కూరైనా తరిగి పొపు (తిరగమూత)లో వేసి కొంచెం నీరుపోసి వుప్పు, వసుపు ఎండుకారం వేసి మూత పెట్టి, వుడికిన తరువాత గరమ్ మసాలా (పొడిగాని, ముద్దగాని) వేసి దించుతారు. కాకరకాయ సహా వుడికించి వార్చరు. గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాలలో సాధారణంగా యిగురు కూరలు చేస్తారు. వార్చకపోవడం వల్ల నీటిలో కూడా సారంపోదు వంకాయ, దొండకాయ మొదలైనవి కూడా తిరగ మూతలో వేసి తగినంత నీరు జల్లి, మూత వుంచి వుడికిన పిదప దించుతారు. ఏ కూరైనాసరే వార్చకుండా ఏవిధంగా చేసినా విటమిన్సు, లవణములు కాలువలో పురుగులకు కాకుండా మనకే లభ్యమవుతాయి. ఒకవేళ అనపకాయ (సొరకాయ), బీరకాయ, కేబేజీ వంటివి వార్చినా ఆ నీరు చారులో పోసుకోవచ్చును. అరవవాళ్ళు, కన్నడం వాళ్ళు ఏ కూరైనా సాంబారులో వేస్తారు. వాడిపోని బీరకాయులు తొక్క తీసి ఆ తొక్కు వేయించి పచ్చడి చెయ్యవచ్చు. ఫలానాది పారెయ్యాలి అని ఏ శాస్త్రంలోను వ్రాసిపెట్ట లేదు. ప్రతి కూర తొక్కలోను బలం వుంది. మృదువుగా వుండే బీరకాయ తొక్కలాంటివి పచ్చడికి వుపయోగించవచ్చు. యాపిలు పండు, ద్రాక్ష పండు, జామపండు తొక్కతోనే తింటాము కదా! ముల్లంగి ఆకు, (లేతది) తోటకూర పులుసులాగ చెయ్యవచ్చు. దొండకాయులు కొంచెం పండుతే కూరకి పనికిరాదని కొందరు పారవేస్తారు. వేయించి కమ్మగా పచ్చడి చేసుకోవచ్చు దొండపళ్ళతో. బొప్పాయికాయ (మదనానబకాయ), బొప్పాయి పండు ఉత్తర హిందూ దేశంలో గొప్పవాళ్ళు సహా విరివిగా వాడుతారు సామాన్యంగా కూరలలో లేని 'పాప్పైన్' వంటి పదార్థాలు బొప్పాయిలో వున్నాయి. ఇది లివరుకి చాలా మంచిది. లివరు జబ్బులున్న వాళ్ళకి ప్రత్యేకంగా పెట్టమని డాక్టర్లు చెబుతారు. సొరకాయ లాగే బొప్పాయి కాయతో కూర వండవచ్చు. నువ్వుల పొడి జల్లి, మసాలా పెట్టి, ఆవపెట్టి, యిలాగ చాలా రకాలుగా వండుకోవచ్చు. బొప్పాయి కాయ తొక్క తీసి పల్చగా చక్రాలు మాదిరి తరిగి పంచదార లేత పాకంలో వేడి మీదే యీ ముక్కలు వేసి, చల్లారిన తరువాత పొడిగా వున్న సీసాలో వేసి టిఫిను క్రింద తినవచ్చు. అరటిపువ్వులు కొన్నిచోట్ల చౌక కదా అని అది గడ్డికూర అనుకోకూడదు. ఆకుకూరలు కూడా అంతే. ఆకూ అలమూ తినడమేమిటి అని కొందరు అంటారేమో. అందులో విటమిన్లు, లవణములు, ప్రోటీన్సు (మాంసకృత్తులు) ఎక్కువగా వుంటాయి. నీరసంగా వున్న వాళ్ళని డాక్టర్లు ఆకుకూరలు ఎక్కువగా తినమని చెప్తారు. ఆకుకూరలు తింటే ఒంట్లో పసరు చేరుతుందని కొందరి అభిప్రాయం. డయబిటీస్ లేనివాళ్ళు పంచదార తింటే డయబిటీస్ వస్తుందన్నట్లుగానే వుంటుంది యిది కూడాను. రష్యాలో ఎందుకూ పనికి మాలిన ఆకులలో నుండి, పచ్చగడ్డి నుండి ప్రోటీన్లు తీసి మనుష్యుల ఆహారానికి వుపయోగిస్తున్నారు. మన భారతదేశంలో కూడా ఆకుల నుండి ప్రోటీన్సు తయారు చేసే మిషన్లు నెలకొల్పుతున్నారు. మనకి చౌకగా, సులభంగా లభ్యమయే ఆకుకూరలు విరివిగా తినడంలో తప్పేమిటి?

ఇక పండ్ల విషయం చూద్దాం. 'రోజుకి ఒక యాపిలు పండు తింటే డాక్టరుని దూరంగా వుంచవచ్చు' అని ఇంగ్లీషు వాళ్ళలో సామెత వుంది. రోజుకి ఒక యాపిలు తింటే జబ్బులు అంతగా రావని అర్థం. మనదేశంలో అరటి పళ్ళు ఎంత చవకో వాళ్ళ దేశంలో యాపిలు పళ్ళు అంత చౌక కనుక ఆ సామెత వాళ్ళలో వచ్చింది. మనదేశంలో యాపిల్సు చాలా ప్రియం. గొప్పవాళ్ళుగాని కొనుక్కోలేరు. 'జామపండు పేదవాని యాపిలు' అన్నాడు ఒక డాక్టరు. జాతి అయిన జామపళ్ళు యాపిలు పళ్ళంతేసి వుంటయి. ఉత్తర హిందూదేశంలో లక్షాధికారులు కూడా జామపళ్ళు, బొప్పాయి పళ్ళు అపురూపంగా తింటారు. అరటి పళ్ళు కూడా బలమే.


వేరుశనగలో శరీరానికి కావలసిన అన్నిపదార్థాలు వున్నాయి. బలానికి పాలు, కోడిగ్రుడ్డుకి సమానం. 'మల్టీపర్పస్ ఫుడ్' లో ముఖ్యమైన వస్తువు వేరుశనగే. ఢిల్లీ మొదలైన మహానగరాల్లో గొప్పవాళ్ళు సహా రోడ్డు మీద వేరుశనక్కాయలు కొనుక్కొని తింటూ పోతారు. ఈ వేరుశనగ నుండే బేబీఫుడ్ (చంటిపిల్లల పాలడబ్బాలు) తయారు చెయ్యబోతున్నారు. రోజూ సాయంకాలం స్కూళ్ళ నుండి వచ్చే పిల్లలకు ఏమి టిఫిను చెయ్యడమా అని సమస్య అవుతుంది కొందరికి. వేరుశనగ పిక్కలు వేయించి బెల్లం పాకం పట్టి చిన్న వుండలు కట్టి పొడిగా వున్న డబ్బాలో గాని, సీసాలోగాని వుంచుతే వారం పదిరోజులు వరకు నిలవ వుంటుంది. రోజూ సాయంకాలం తలొక వుండ తినవచ్చును. వేరుశనగకు పైత్య గుణం వుంది. గాని దానికి బెల్లం విరుగుడు. వేరుశనగ పప్పు బెల్లం కలిపి తినవచ్చు. వేరుశనగ పిక్కలు నానవేసి, వానిని తరువాత కొంచెం వుప్పు వేసి వుడికించి తింటే రుచిగా వుంటుంది.

చిలగడ దుంపలు చక్రాలు తరిగి బెల్లంగాని, పంచదారగాని పాకం పట్టితే ఎంతో రుచిగా వుంటుంది. బలానికి బలం. ఒకరోజు టిఫిను సమస్య తీరిపోతుంది.


పెసలు, శనగలు నానవేసి వుడికించిగాని, మొలకలు వచ్చిన తరువాత పచ్చివిగాని తింటే బలం.

పైన చెప్పిన వాటిలో సాధ్యమైనన్ని చేస్తే కొంత మట్టుకైనా నీరసాలు తగ్గి, బలం చేకూరి డాక్టరు బిల్లులు తగ్గుతాయని ఆశిస్తున్నాను

శ్రీప్రకాష్ ●



రామన్ ప్రభావ గాథ



వైజ్ఞానిక గాథావళి-87


ఆకాశము నీలంగా ఎందుకుంటుంది? అన్న సమస్యను టిండల్ జిజ్ఞాస చేశాడు. దూరపు పొగ నీలంగా వుంటుందన్న అవలోకనము అతనికి సాయపడింది. పొగ అంటే కాలిపోని బొగ్గు కణాలేకదా? అవి నల్లగా ఉంటాయే మరి, పొగ నీలంగా ఎందుకుందీ? దూరాన సున్నపు పొగా, పసుపూ కుంకం పొడులు కూడా పొగవాదిరిగా లయేటట్టు దులిపితే నీలంగానే కనబడతాయి. పలాచని మజ్జిగ వంటి "కరిగిన కణములు కనపడే ద్రావణముల"ను వాటిలోంచి వెల్తురు పంపి పరిశీలించాడు టిండల్. వెల్తురు కిరణపుంజము నీలముగా కనబడింది. "సూక్ష్మకణాలు వెల్తురును చెదిర్చినప్పుడు వెల్తురులోని నీలపురంగు కిరణాల్ని ఎక్కువగా చెదుర్చుతున్నవ"ని టిండల్ సూత్రీకరించాడు. ఇలాగ చెదరిన నీలపురంగు కిరణాలు మజ్జిగలో ప్రవేశించిన అసలు కిరణాలవలె నిండైనవి కాక సూక్ష్మాతిసూక్ష్మ అద్భుత్యరిబ్బన్ల వలె ధ్రువీకృతములు (Polarised) అయినాయి. ఈ రకపు ప్రయోగాల్ని పురస్కరించుకుని టిండల్ "ఆకాశపు నీలము గాలిలో తేలే ధూళి కణాలు చిన్నతుంపురులూ వంటి వాటివల్ల చెదర్చబడిన సూర్య కాంతి వల్ల ఏర్పడింద"న్నాడు.


"అయితే మరి వానబాగా కురిసి వెలిసిన తర్వాత కొండకొమ్ములనుంచి చూస్తేనూ, ఆకాశము ఇంకా శుభ్రమైన నీలముగా కనిపిస్తుందేమి? అప్పుడు గాలిలో ధూళి తగ్గిపోయి ఉంటుందికదా?" అని 'రాలే' ప్రశ్నవేసి, గాలికణాలు కూడా తమ మీద పడిన వెల్తురును చెదుర్చుతాయని చెప్పి, గణితము వేసి నీలము ఎక్కువగా చెదురుతుందని నిరూపించాడు. అయితే అకాశ నీలపు కాంతి, టిండల్ ప్రయోగాలలో సూక్ష్మ కణాలు చెదిర్చిన నీలపు కాంతి యింతమట్టుకు ధ్రువీకృతము కాదని కనుక్కున్నారు. రాలే "గాలికణాలు టిండల్ కణాలంత సౌష్ఠవము (Symmetry) కలవి కావు. అందువల్ల కచ్చిత గోళములైన టిండల్ సూక్ష్మ కణాలు ధ్రువీకరించినంతగా గాలికణాలు ధ్రువీకరించలేదు నీలపు కిరణాల్ని" అని విశదీకరించాడు.

రామన్ మహాశయులు మధ్యధరాసముద్రపు నీలమూ హరిత వర్ణమూ గుర్తించి, నీటికణాలు కూడా తమ మీద పడిన కాంతిని చెదుర్చుతాయనీ, ఇంకేదైనా విశేషం ఉంటుందని ఊహించి నూటికి మించిన ప్రయోగాలు ప్లాను చేశారట. ఎ. శేషగిరిరావనే యువకుడు ఆయన పర్యవేక్షణలో ద్రవములు చెదిర్చేకాంతి యొక్క ధ్రువీకరణము ఏపాటి? అని శోధించాడూ, అసలు కాంతి—అంటే ఆ ద్రవమును వెలిగించిన కాంతి—రంగు మారుతూంటే ధ్రువీకరణ లోపము మారుతోంది, అని కనుకున్నాడు. కె. ఆర్. రామనాథన్‌గారు వెల్తురును పూర్తిగా హరించగల రెండు రెండు రంగు గాజు పలకలను వాడిఒక పలకలోంచి వచ్చిన ఆ రంగు వెల్తురును ద్రవాలలోంచి పోనిచ్చి, చెదరినరంగు కిరణాల ధ్రువీకరణ లోపమెంత? అని శోధించారు. ఈ ప్రయోగములో ఒకరంగు పలకలోంచి వచ్చిన వెల్తురు దాని జంట పలకలోంచి మరి రానే కూడదు, రెండూ చేరి వెల్తుర్ని అడ్డేస్తాయిగదా? అయితే రామనాథన్‌గారి ప్రయోగంలో ఒకరంగు పలకలోంచి వచ్చి ఏదో ద్రవములో ప్రవేశించి, చెదరి వచ్చిన వెల్తురు రెండో పలక వల్ల హరించబడలేదు. కొంచెము మిగిలింది. కె. ఎస్. క్రిష్ణన్ గారు ఈహీన కాంతి ద్రవముయొక్క ప్రతిదీపన కాంతి కాదనీ చెదరి వచ్చినదేననీ నిరూపించారు. రామన్‌మహాశయులి దశలో వర్ణచిత్ర విశ్లేషణి (Spectrograph) ని వాడి, "ద్రవములు (గాని వెల్తురును తమలో నుంచి పోనిచ్చే పదార్థాలు ఏవిగాని) వెల్తురును చెదర్చినప్పుడు చెదరిన అసలు కాంతితో పాటు ఆ ద్రవ అణువులు పీల్చగా మిగిలిన హీన శక్తిగల కాంతికూడావచ్చును." అని కనుక్కుని ప్రకటించారు. అసలు కాంతిశక్తికీ ఈహీన కాంతి శక్తికీ గలతేడా, ఉపయోగించిన ద్రవాన్ని బట్టివుంటుంది. అంటే ఏమన్నమాటా, పారదర్శక పదార్థపు అణువులు కాంతి శక్తి కణము నుండి తమ స్వోమతప్రకారము శక్తిని గ్రహించుకుని మిగిలిపోయిన శక్తి తోనే ఆకాంతిశక్తి కణాల్ని పంపుతాయన్న మాట. ఈ రెండింటి శక్తులకూ తేడానుబట్టి ఆ పదార్థపు కొత్తగుణము తెలుస్తోంది అన్నమాట. ఆతరువాత పరిశోధన రెక్కలు కట్టుకు ఎగిరింది. అన్ని పారదర్శక పదార్థాల "రామన్ ప్రభావమూ" పరిశీలించు కున్నారు వర్తమానులు. అదృష్టవంతులు ఆయన శిష్యులు.

మూడేళ్ళు పట్టింది భారతీయ వైజ్ఞానికుని కృషి పారదర్శక పదార్థాలు—ఘన, ద్రవ, వాయు పదార్థాల అణువుల విశేషధర్మాన్ని బయటబెట్టి, అణు విజ్ఞానానికి కొత్తరహదారి తెరిచిందని పాశ్చాత్య మేధావులు గుర్తించి రామన్ గారికి నోబెలు బహుమాన మివ్వడానికి . "భారతీయులు వీరు వేచి ఉండాలి" అన్నాడట కూడానూ ఒక మహామేధావి.

రామన్ ప్రభావము ఇదివరకు వేరే దారుల్లో కనుక్కున్న విజ్ఞానాన్ని బలపరుస్తూ కొత్తధర్మాన్ని చాలా బయటపెట్టింది. కాంతిశక్తి కణానికీ ద్రవ్య (Matter) కణానికీ, శక్తిని ఇచ్చిపుచ్చుకోడాలు సాధ్యమే అని ఇదివరకు తెలుసును గాని పుచ్చుకోడానికి ఉదాహరణలు దొరకలేదు. రామన్ ప్రభావము ఇచ్చి పుచ్చుకోడాల్ని నిరూపించింది. మనుష్యుల గుణాల్లాగే అణువులగుణాలు కూడా ఒక్క పరిస్థితిలో బయటబడే గుణాలు ఇతరత్రా బయట బడక పోడముతో రామన్ ప్రభావ పరిశీలన అణువులకు సాధారణమైపోయింది.





అంతస్థులు అనుభవాలు

ఉన్నవ విజయలక్ష్మి

జరిగిన కథ

స్కూలు ఫైనలు పరీక్షలకు ఇన్విజిలేటర్‌గా వచ్చిన సారధి, పరీక్ష రాస్తున్న ఇందిరను ఆకర్షించాడు. ఫలితంగా వాళ్ళిద్దరికీ పెళ్ళయింది. వారికి ఒక మగపిల్లాడు, మరో అమ్మాయి కల్గింది. ఇందిర ప్రయివేటుగా చదివి బియ్యే పాసయింది. ఇంకా పైకి చదివేందుకు సారధి ప్రోత్సహించాడు. ఒకరోజు సారధి హఠాత్తుగా కన్నుమూశాడు. భవిష్యత్తు నాలోచించుకున్న ఇందిర ఉద్యోగంచేయడానికి నిశ్చయించుకుంది. ఒక గరల్స్‌స్కూల్లో టీచరుగా చేరింది. ఇంటిదగ్గర పరిస్థితులు నచ్చక, స్వర్ణ సహాయంతో హైదరాబాద్‌లో మరోస్కూల్లో టీచరుగా చేరింది. అక్కడ అరుణతో ఎక్కువ స్నేహం ఏర్పడింది.

8

అలాంటి స్థితిలోనే మరో విశేషం జరిగింది. కాలేజీలో లెక్చెరర్లు, ఇంకా తెలిసిన వాళ్ళు కొంత మంది కలిసి ఓ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీగా ఫారమ్ అయారు. ఇందిరని కూడ మెంబరు అవమన్నారు.

అంతకు కొద్దికాలం క్రిందట, ఏదో ఓ స్థలం కొనుక్కుని చిన్నయిల్లు కట్టుకుంటే బాగుంటుంది అని ఇందిర అనుకుంటున్న సమయంలోనే అరుణకి ఓ చిత్రమయిన అనుభవం అయింది.

కొనే మనిషి కనిపించాలేకాని, ఎవరి స్థలమ్మైనా వరే అమ్మేసేయగలవారు కూడ వుంటారనే సంగతి ఇందిరకి అప్పుడే మొదటిసారిగా తెలిసింది.

ఒక తమ్ముడు, చెల్లెలు ఉద్యోగంలో స్థిరపడిన తరువాత, ఇంటి బాధ్యత వాళ్ళకి వదిలేసి, వివాహం చేసుకోవాలనుకున్న అరుణ తన దగ్గరున్న డబ్బుతో చవగ్గా వచ్చింది కదా అని ఓ చిన్నస్థలం కొంది. ముందుముందు ధరలు మరీ పెరిగిపోతాయి, స్థలం కొనిపడేస్తే తమ్ముళ్ళు మెల్లిగా ఓ యిల్లు కట్టుకుంటారని ఆమె ఉద్దేశ్యం.

ఓ సాయంత్రం అరుణ, తమ్ముళ్ళు, చెల్లెళ్ళు, మరో నలుగురు స్నేహితులకి తమ స్థలం చూపించాలని తీసుకువెళ్ళారు. దూరం నుంచే, ఆ స్థలంలో ఓ చిన్నగుడిసె, దానిముందు కాలి మీద కాలు వేసుకుని కూర్చుని ఠీవిగా సిగరెట్ కాలుస్తున్న గూర్ఖా కనిపించాడు. క్షణం అరుణ గుండెలు కొట్టుకోడం మానేశాయి. అంతలోనే తను పొరపాటున మరో దగ్గరికి రాలేదు కదా అనే అనుమానం వచ్చి చుట్టూ చూసింది. ఊహు. సందేహంలేదు. అది తను కొన్న స్థలమే. ఇంచుమించు అదే అవస్థలో వున్న ఆమె తమ్ముళ్ళు వాళ్ళు "అసలు ఎవరో ఏమిటో అడుగుదాంరా." అంటూ ముందుకి వెళ్ళారు.

తనకేమీ తెలియదనీ, ఆ స్థలం ఫలానా ఆయనదనీ, ఆయనే గుడిసె వేయించిఇచ్చి, జీతం ఇస్తూంటే తన స్థలం కాపలా కాస్తున్నాననీ చెప్పాడు ఆగూర్ఖా.

వింటున్న వాళ్ళకి నోట మాట రాలేదు. వెళ్ళి ఆ ఫలాన ఆయన్ని కలుసుకున్నారు.

"ఆ స్థలం నాది. ఆ డాక్యుమెంట్సు అన్నీ నాదగ్గర వున్నాయి. ఇంకెవరో దాన్ని మీకెలా అమ్మతారు— నేనూ అమ్మాలనే అనుకుంటున్నాను. నేను అడిగిన ధర ఇస్తే అది మీకు ట్రాన్స్‌ఫర్ చేయడానికి నాకేం అభ్యంతరం లేదు." అన్నాడు తాపీగా.

ఈసారి వాళ్ళకి మాటేకాదు, మతే పోయినట్లయింది. మెల్లిగా, మొదట అమ్మినాయన దగ్గరికి వెళ్ళారు.

"వాడెవడు మధ్య. డాక్యుమెంట్సు నా దగ్గిరా వున్నాయి. మీకు చూపించానుగా." అన్నాడు.

ఆయనతో మాట్లాడి లాభంలేదని లాయర్ని సంప్రతించారు. ఆ వ్యవహారం అంతా తేలేదాకా అలా వూరుకోకూడదనీ ఆ స్థలం మీద తన హక్కుని నిరూపించుకోడానికి ఆమె కూడ మరో గుడిసె వేయించాలనీ సలహా యిచ్చారు. ఆ ప్రకారమే మరో మూల గుడిసె వేయించి గూర్ఖాని పెట్టింది. మొదటి గూర్ఖాకి కాలక్షేపం కావటంలేదన్న బాధ తీరిపోయింది. సిగరెట్ల ఖర్చు తగ్గింది.

చాలా చాలా అవస్థలు పడి చివరికి ఎలాగయితేనేం స్థలం దక్కించుకుంది అరుణ. కొన్నదానికి రెట్టింపు వదిలినా, అసలు అంటూ మిగిలిందికొండి అనేది. పాపం అంతకన్న అనగలిగేది మరేంలేదు గనుక.

అదంతా చూసిన ఇందిర స్థలమూ వద్దు ఇల్లూ వద్దు, డబ్బేమైనా వుంటే బ్యాంకిలో వేసుకుంటే వుత్తమం. అయినా స్థలం కొనగానే సరిపోతుందా ఇల్లు కట్టుకోడానికి డబ్బు కావద్దూ అనుకుని ఆ ఆలోచనకి స్వస్తి చెప్పింది. ఇప్పుడు దీంట్లో అలాంటి గొడవలేం వుండవనీ, పైగా కో ఆపరేటివ్ సొసైటీకి గవర్నమెంటు లోన్ కూడ ఇస్తుందని దాంతో చిన్న యిల్లు కట్టుకుని హాయిగా అద్దెలోనే వుంటూ నెమ్మదిగా అప్పు తీర్చుకోవచ్చుననీ నలుగురూ చెప్పటంతో మళ్ళీ మెత్తబడింది. వాళ్ళ సొసైటీ ఎన్నుకున్న స్థలానికి ఎలాంటి పేచీలు లేవని రూఢి చేసుకుని ధైర్యంగా తన పేరు ఇచ్చింది.

ఆ వివరాలన్నీ వ్రాస్తూ, తను ఈ వూరు వచ్చే ముందు లలిత పెళ్ళికి తీసుకున్న నాలుగు వేలూ పంపించమని తండ్రికి వ్రాసింది ఇందిర.

వారంరోజులలో వుత్తరంతోపాటు డబ్బు కూడ వచ్చింది. "ఇప్పుడు ఇంట్లో డబ్బుకి ఎంత ఇబ్బందిగా వుందో నీకు తెలియనిదికాదు. అయిదేళ్ళ క్రితం లీల పెళ్ళికి బోలెడు అప్పు చేశాం. అది యింకా తీరలేదు.— పరాయివాళ్ళల్లా నువ్వు కూడ వత్తిడి చేస్తూ డబ్బు కోసం తొందరపడటం, కాస్త వ్యవధి అయినా లేకుండా పంపించమనటం ఏం బాగుండ లేదు." అంటూ ఏవేవో నిష్ఠూరాలు వేస్తూ చివరికి, "పెద్దబావ సమయానికి సహాయం చేశాడు" అని ముగించాడు సూర్యం.

అది చూడగానే, స్థలం కొనాలి ఇల్లు కట్టాలి అన్న ఉత్సాహం అంతా చచ్చిపోయింది ఇందిరలో. "అయినవాళ్ళతో డబ్బు వ్యవహారాలలో ఎప్పుడూ మనస్సులు కష్టపెట్టుకోడమే అవుతుంది. వాళ్ళు అంత విసుక్కుంటూ ఇచ్చిన డబ్బుతో అది కొనుక్కోకపోతే ఏం? మా ప్రాణాలు తీసి డబ్బు పట్టుకుపోయి స్థలం కొనుక్కుంది అని ఎప్పటికీ వాళ్ళు చెప్పుకోడానికి అవకాశం ఇచ్చినట్లే వుంటుంది. వాళ్ళకి వీలయినప్పుడే ఇస్తారు ఇది మళ్ళీ వెనక్కి పంపించేస్తాను." అనుకుంది.

"తాతయ్యగారి దగ్గర నించి వుత్తరం వచ్చిందా" అంటూ సంబరపడుతూ వచ్చిన గిరి, తల్లి మొహం చూసి తెల్లబోయి వుత్తరం తీసుకున్నాడు. గబగబ చదివేసి ప్రక్కన పడేసి, "ఈమాత్రానికే నువ్వు బాధ పడకూడదమ్మా. మనం మెత్తగా వుంటున్న కొద్దీ మరీ లోకువయిపోతాం. లేకపోతే మనది మనకి ఇవ్వడానికి ఏదో దయాధర్మం చేసినట్లు వ్రాస్తాడేమిటి—కానీ వడ్డీ ఇవ్వలేదు సరికదా అసలు ఇవ్వడానికే ఇన్ని నిష్ఠూరాలు. అయినవాళ్ళం కనకే అన్ని సంవత్సరాలు అడగకుండా వూరుకున్నాం. ఇంకొకరయితే తెలిసేది—లీల పిన్ని పెళ్ళికి చేసిన అప్పు తీరలేదని బాధ పడుతున్నాడు కానీ అంతకుముందే తీసుకున్న దానికి తొందరలేదు కాబోలు—పెద్దనాన్న సాయం చేశాడని ప్రత్యేకంగా అంత గొప్పగా వ్రాశాడెందుకు? అప్పుడు నువ్వు ఇచ్చినప్పుడు ఎవరికైనా చెప్పుకున్నారా? సమయానికి సహాయం చేశావని ఒక

పించిమాట కూడ అని వుండరు.— అసలు వాళ్ల పొట్లేమో వాళ్ళు పడతారని వూరుకోవలసింది, నువ్వెందుకిచ్చావ్?" అన్నాడు రోషంగా.

అయోమయంగా కొడుకు వంక చూస్తూ కూర్చుంది ఇందిర.

"ఎలాగయినా వాళ్లకి దొడ్డమ్మ అంటే అభిమానం ఎక్కువ. వాళ్లకి డబ్బు వుందని కాబోలు— న్యాయం ఆలోచిస్తే మన మీదే కాస్త సానుభూతి, ఆడదానివి కష్టపడి పైకి వచ్చావనే అభిమానం వుండాలి. అదేంలేదు. చిన్నప్పటి నుంచీ చూస్తున్నాగా. ప్రతిదానికి కృష్ణుడ్ని వాళ్లని గొప్ప చెయ్యటం, నన్ను పద్మని చిన్నబుచ్చటం..." గిరి గొంతులో బాధ గుర్తించిన ఇందిర మెల్లిగా వాడి తల నిమురుతూ,

"పోన్లే బాబూ, దానికంత ఇదవుతా వెందుకు. ఎంత స్వంతవాళ్లయినాసరే, వాళ్లంతట వాళ్లు అభిమానించాలేకాని బలవంతాన దాన్ని అందుకోలేం. వాళ్ళు మనల్ని ప్రేమగా చూడటంలేదు అని బాధపడటంలో అర్థంలేదు." అంది అనునయంగా.

"నాకేం బాధ లేదమ్మా. వాళ్ల నైజం చెప్పానంతే."

"వాళ్లే ఏమిటి ఎవరైనా అంతే—డబ్బు గలవాళ్లనే అభిమానిస్తారు, గౌరవిస్తారు." అంది ఇందిర. కొంచెంసేపు ఆగి మళ్లీ "ఇంత గొడవ జరిగాక అది తీసుకోవాలనిపించటంలేదు. డబ్బు వెనక్కి పంపించేస్తే...."

"కోపం వచ్చి వెనక్కి పంపించేశావని వాళ్ళు అనుకోడానికా? అయినా మన డబ్బు మనం తీసుకోడానికి వాళ్లేదో అన్నారని పౌరుష పడటం ఏమిటి? స్థలం తీసుకోకపోతే వీ గతా మెంబర్సు దగ్గర మనకి చిన్నతనంగా వుండదా...చెప్పమ్మా మాట్లాడవేం... నువ్వు అది తీసుకునే దాకా నేను అన్నం తినను."

ఏం చేయాలో నిర్ణయించుకోలేక అటూ ఇటూ వూగుతున్న ఇందిర మనస్సు, కొడుకు మాటలు వింటూ వాడి ఖిన్నవదనం చూసేసరికి ఎలాగో అయిపోయింది. "ఇది వీళ్ల నాన్నగారి కష్టార్జితం. ఈ విషయంలో ఇలా మాట్లాడగలిగే హక్కు వీడికి వుంది. వీడిని చిన్నబుచ్చటం న్యాయంకాదు." అనిపించి, "అలాగేలే. రేపు నీకు కాలేజీ లేదన్నావుగా. ఇద్దరం వెళ్లి కట్టివద్దాం." అంది కొడుకుని దగ్గరికి తీసుకుని అభిమానంగా నవ్వుతూ.



తరువాత నాలుగునెలలో తండ్రి దగ్గర నుంచి వచ్చిన రెండుమూడు వుత్తరాలు మరీ పొడిగా, కేవలం ఇందిర వుత్తరానికి జవాబుగా మాత్రమే వున్నట్లనిపించి, ఈ డబ్బు గొడవతో వాళ్లకి మరీ దూరం అయిపోలేదు కదా అనుకుంది ఇందిర.

ఓ రోజు సావిత్రి కూతురు పెళ్లి శుభలేఖ, వచ్చింది. తప్పకుండా రావాలి అంటూ సావిత్రి విడిగా వుత్తరం కూడ వ్రాసింది.

పెళ్లిళ్లకి, శుభకార్యాలకీ వెళ్లాలనీ చూడాలనీ ఉత్సాహం లేకపోవటంవల్ల స్వంత చెల్లెలూ, తమ్ముడూ అయినా లీల పెళ్లికీ చంద్రం పెళ్లికీ వెళ్లలేదు. తను అక్కడ వుండగా నిశ్చయం అయింది. వచ్చేస్తే బాగుండదు అని లలిత పెళ్లికి వుండిపోయిందికాని, బంధువు లందరూ వున్న నాలుగురోజులు గదిలోంచి ఇవతలకే రాలేదు. ఏ సమయంలో తన కళ్లు చమరుస్తాయో, అవి దానికేం అశుభం కలిగిస్తాయో, అన్నట్లు ఎవరితో మాట అయినా ఆడకుండా పుస్తకం చదువుకుంటూ కూర్చుంది—ఇప్పుడీ పెళ్లికి మాత్రం వెళ్లేదేమిటి అనుకుని ఆరోజుకి అందేలా శుభాకాంక్షలు, బహుమతి పంపింది.

"గట్టిగా రావాలనుకుంటే నాలుగురోజులు శలవు దొరకదా. నీకు అనిపించకపోయినా నలుగురూ సరదాగా కలుసుకున్నప్పుడు నువ్వు లేకపోవడం నాకెంతో వెలితిగా వుంది. జరిగింది మరిచిపోయి మనస్సు రాయి చేసుకోవాలి మరి. అయినా నీకిదేం పరాయి చోటా? ఎంత దగ్గరి వాళ్లమయినా వస్తూపోతూ వుంటేనే అభిమానాలు నిలుస్తాయి." అంటూ నిష్ఠూరంగా వుత్తరం వ్రాసింది సావిత్రి.

ఇక బాగుండదని, అటువేపు వెళ్లి చాలారోజుల యిందని, శలవ లివ్వగానే పిల్లల్ని తీసుకుని ప్రయాణం అయింది.

బండి దిగగానే ఇంట్లో అందరూ అడిగిన మొదటి ప్రశ్న ఇల్లు ఎంతవరకు వచ్చింది గృహప్రవేశం ఎప్పుడు అని. ఇందిర తెల్లబోయి,

"ఇప్పుడే ఎక్కడ. అంతా అయేసరికి మరో సంవత్సరం పడుతుంది. మీరంతా రావాలి." అనేసింది మొహం మీదికి నవ్వు తెచ్చుకుంటూ.

కాళ్లు కడుక్కుని వచ్చి కాఫీ తాగుతూంటే వైకుంఠంగారు మనవరాలి పెళ్లి కబుర్లు చెప్పడానికి కూర్చున్నారు సావకాశంగా. సంవత్సరం క్రితం, సావిత్రి మామగారు పోవడంవల్ల పెళ్లి పెత్తనం మంతా ఈయన చేతిలో పెట్టాడు అల్లుడు. అందుకే ఆయనకి అన్ని వివరాలు తెలిశాయి.

"మేనరికం అయినా ఆరువేల రూపాయల కట్నం పోశాడు. లాంఛనాలు, పై ఖర్చు కలిసి మరో ఆరు వేలయింది. ఎంతయితే మాత్రం వాళ్ళకో లెక్కా?

దాని పిల్లలకి సంబంధాలు వెతుక్కో అక్కర్లేదు. మిగతా నలుగురికీ కూడ మేనరికాలున్నాయి. అందరికీ ఇదే లెక్కని ఇచ్చేస్తానని చెప్పాడు. మీదటికి చిన్నదానికి చేస్తారుట. అప్పుడయినా వీలు చేసుకురా. ఊళ్లో అతనికి వున్న పలుకుబడీ, ఆదర్శ అన్ని చూసి తీరాల్సిందే. సావిత్రి కూడ ఎంత ఆరిందా అయిందని. వచ్చిన వాళ్లందరినీ ఎలా మర్యాద చెయ్యాలో ఏం పెట్టాలో అన్నీ తెలుసుకుంది— అసలు దానికి వున్న ఈవి ఎవరికీ లేదు. కృష్ణుడు ఇక్కడ వున్న నాలుగేళ్లు వాళ్లకి పండినవన్నీ పంపించిందనుకో.." అలా సాగుతున్న ఆయన ధోరణి గోపి రాకతో కాస్త కట్టుబడింది.

ఎక్కడికో వెళ్లివచ్చిన గోపీ అక్కగారిని పిల్లల్ని చూసి తెల్లబోయి, సర్దుకుని

"ఇప్పుడే వచ్చారా" అని పలకరించాడు.

"ఏరే, ట్రైను కాస్త లేటయినట్టుంది—ఏం చేస్తున్నావ్." అంది ఇందిర మామూలు ధోరణిలో.

"ఏడు చదివిన చదువుకి వుద్యోగం ఎవరిస్తారు. కృష్ణ అఘోరిస్తున్నాడు." అన్నారు వైకుంఠం గారు

సావిత్రి తల్లి మొహంలోకి చూసి గిరి అక్కడ్నించి వెళ్లిపోయాడు. గోపీ అంతకుముందే జారుకున్నాడు.

"దగ్గర పెట్టుకుని, నాలుగు ముక్కలు వంట వచ్చేలా చేస్తాననుకున్నాను." అంది కామేశ్వరమ్మ గారు.

"వాడు కుదురుగా వుంటే నాకేం బరువా? లలని తీసుకువెళ్లి పాఠాలన్నీ చెప్పి పంపించలేదా— తరువాత కూడ కాలేజీలో చేర్పిస్తాను పంపించండి

అంతస్తులు - అభిమానాలు

అంటే పెళ్లి చేస్తాం అంటూ ఇక్కడే వుంచేసుకున్నారు...."

"అప్పుడల్లా అన్నాననే ధైర్యంతోనే పిడిని పంపించాను." అన్నారు వైకుంఠంగారు మధ్యలోనే అందుకుని.

"అయినా మిమ్మల్ని లక్ష్యపెట్టనివాడు నామాట వింటాడా." అంది ఇందిర వూరుకోలేక.

"అవున్లే." కామేశ్వరమ్మగారి కంఠంలో నిస్పృహ ధ్వనించింది.

వచ్చిన అరగంటలోనే ఇందిర మనస్సు నీళ్ళు కారిపోయి, వారంరోజులు ఎలా వుంటానా బాబూ అనిపించింది. వచ్చినందుకు అక్కడో వారం, సావిత్రి గారి వూరిలో రెండురోజులు వుండి పిల్లల్ని తీసుకుని హైదరాబాదు వచ్చేసింది.

లోన్ శాంక్షన్ అయి పనులు మొదలుపెట్టి ఇల్లు పూర్తయేసరికి మరో సంవత్సరం పట్టింది. వైకుంఠంగారు, కామేశ్వరమ్మగారు సూర్యం వచ్చారు. పెద్ద ఆడంబరంగా ఏమీ చెయ్యవద్దు అని ఇందిర అంటున్నా, గిరి అతని స్నేహితులు, పద్మ అంతా కలిసి చాలా హడావిడి చేశారు. అవన్నీ చూసి మొదట సంతోషించినా, ఇందిర చేసిన అప్పు సంగతి తెలుసుకుని,

"నాసిని పాలు పొంగించి అయిందనిపించేయకుండా బోలెడు డబ్బుతగలేసి ఇంత ఆర్భాటం ఎందుకు చెప్పు." అన్నారు వైకుంఠంగారు.

"ఎలాగో ఆ అప్పు తీర్చి ఇల్లు నిలుపుకో మరి." అన్నాడు సూర్యం.

"ఏమిటో ఆ సంగతి తలుచుకుంటేనే భయం వేస్తోంది. రేపు పిల్ల పెళ్లి చెయ్యాలంటే మళ్లీ అప్పు చెయ్యాలి—అసలు ఆ స్థలం అది ఏమీ కొనకుండా ఆ డబ్బుతో మహారాజులా పిల్ల పెళ్లి చేసేస్తే నీ బాధ్యత తీరిపోయేది." అంది కామేశ్వరమ్మగారు.

"ఇంక ఈ మనుష్యులు యింతే." అనుకుని లోలోపలే నిట్టూర్చింది ఇందిర.

పదిరోజులుండి వెళ్లిపోయారు వాళ్ళు. అవతే కనక దగ్గరుండి, మిగిలిపోయిన చిన్న చిన్నపనులన్నీ చేయిస్తోంది ఇందిర. చెల్లెల్ని సాయం తీసుకుని వచ్చిన అరుణ ఆ ఇంటినీ, ఇందిర దగ్గరుండి చేయిస్తున్న పనులనీ చూసి మురిసిపోతూ,

"మీరు ఇంజనీరు కూడ అయినట్టున్నారే." అంది నవ్వుతూ.

"అన్నీ అవుతాను—ఈ రావడం ఏ నెల్లాళ్ళు ముందు రాకూడదూ, బాధ్యత అంతా నీకు అప్పగించేదాన్ని."

"ఎవరూ అక్కర్లేదు. మీ పిల్లలు చాలా బాగా ఎరేంజి చేశారుట. మిస్సయినందుకు మాత్రం బాధగా వుంది—చక్కగా మావాళ్లు కూడ యిలాంటి ఇల్లు కట్టుకుంటే బాగుండును. ఎవ్వరికీ ఇష్టం లేదు." అంది అరుణ ఇల్లంతా చూస్తూ..

అరుణ కొన్న స్థలంలో ఇల్లు కట్టాలని ప్రయత్నిస్తున్న సమయంలో వాళ్ల నాన్నగారు పోయారు. ఎప్పటి నుండో తీసుకుంటున్న ఆయన పోవడానికీ ఈ స్థలానికీ ఏం సంబంధం లేదని అరుణ సరిపెట్టుకుంది. మిగతా వాళ్లంతా అందుకు వ్యతిరేకం.

గిరి ఎస్. ఎస్.సి., పరీక్షలు కాగానే, ఇంక తరువాత ఏం చేయాలా అనే ఆలోచనలో పడింది ఇందిర. ఆ ఆలోచన తెగకుండానే ఓ రోజు గిరి,

"నేను, రఘు, వాసు కలిసి బిజినెస్ చేద్దాం అనుకుంటున్నాం." అన్నాడు.

"వ్యాపారానికి బోలెడు పెట్టుబడి కావద్దూ." అంది ఇందిర, కొడుకు ఇప్పటి నుండే అప్పులో దిగుతాననంటాడేమిటా అని.

"అదంతా రఘు వాళ్ల నాన్నగారు చూసుకుంటారు. మేము ముగ్గురం వర్కింగ్ పార్టనర్స్ అన్నమాట."

వాళ్ల ముగ్గురి స్నేహం ఎలాంటిదో ఇందిరకీ తెలుసు. అయినా ఏమిటో అంతా అయోమయంగా అనిపించింది ఆమెకి.

"మాకు సలహా ఇవ్వడానికి, సహాయం చెయ్యడానికి వెనకాల ఆయన వుంటారు. నువ్వేం భయపడకు." అంటూ ఆ వివరాలన్నీ చెప్పి తల్లిని ఒప్పించాడు గిరి.

అలా మొదలైన వ్యాపారం ఈ రెండేళ్లల్లో బాగా వృద్ధి పొందిందింది. కొడుకుని గురించిన చింత ఆమెకి ఏమీ లేదిప్పుడు.


"ఏమిటమ్మా నీలో నువ్వే నవ్వుకుంటున్నావు?" అడిగింది పద్మ.

"నీ గురించే."

"అంటే?"

"ఈ ఏడు చదువు అయిపోయాక.."

"దానికంత ఆలోచన ఎందుకు. నేను ఎస్. ఎస్సి.,



చదువుతాను." తేరది పద్మ.

"ఊహు. నాకు తెలుసు." అన్నాడు గిరి.

"ఓహో. అదా సంగతి." అన్నగారిని వెక్కిరించింది పద్మ.

"ఏమిటని?"

"నువ్వు చెప్తే నేను చెప్తాను."

"సరే. బాగుంది." ముచ్చటగా నవ్వింది ఇందిర.

*　　　*　　　*

అనుపమ వస్తుందో రాదో అనుకుంటూనే ముస్తాబవుతున్న పద్మ గేటు చప్పుడు విని వెళ్ళింది.

ఎడంచేతి క్రింద నుంచి కొంగు తీసుకుని తల మీద, మొహం మీద, పడిన చినుకులని నెమ్మదిగా అద్దుకుంటూ వస్తున్న అనుపమని చూసి, "అయ్యో బాగా తడిశావా, అయినా కాలం కాని కాలంలో వానని వెంట పెట్టుకువచ్చావేమిటి?" అంది ఎర్రండా గ్రిల్ తలుపు తెరుస్తూ.

"నేను వెంటపెట్టుకు రాలేదులే మీ యింటికి రాకంటే ముందే వచ్చిందిగా—త్వరగా రా అంటూ నాకు అన్నిసార్లు చెప్పి నువ్వింకా ఇలాగే వున్నావా." అంటూ లోపలికి వచ్చింది.

"నాకూ ఎక్కువ ఆలస్యం ఏంలేదు. అయిపోయిందిలే. చీర మార్చుకోవాలనుకుంటూంటే నువ్వు వచ్చావు—మరి వానగా వుందిగా..."

"ఏం వాన. నాలుగు చినుకులేగా, రిక్షాలో వెళ్ళిపోదాం. త్వరగా తెముులు.." అనుపమ అంటూండగానే వాన ఎక్కువయి దడదడ కురవడం మొదలుపెట్టింది

ఇద్దరూ మొహాలు చూసుకుని చిన్నగా నవ్వుకున్నారు.

"ఛ, వెధ వ్వాన ప్రోగ్రాం అంతా పాడు చేసింది నేను బయలుదేరేసరికి మబ్బు కూడలేదు ఉంటే అసలు రాకనేపోదును." అనుపమ నిరాశ పడిపోయింది

"పోన్లే కాస్సేపు కబుర్లు చెప్పుకుని వెడుదువు గాని—ఈ రావడం మరో నిమిషం ఆలశ్యం అయితే పూర్తిగా తడిసి ముద్దయి పోదువు."

ఇద్దరూ లోపలికి వెళ్ళి పద్మ గదిలో కూర్చున్నారు.

అవతల గదిలో గిరి కూడ ఏదో ప్రోగ్రాం వేసుకుని తయారయిన వాడల్లా వర్షాన్ని చూసి తిట్టుకుంటూ, రైన్‌కోటు వేసుకుని, తల్లి ఏమైనా అంటుందేమో అని భయపడుతూనే మెల్లిగా హాల్లోకి వచ్చాడు. అనుకున్నంతా అయింది.

"నీకేం మతిలేదా, రెండురోజుల నించీ జలుబు భారంతో ఎలా వుండాలో అలా వున్నావు. రాత్రి నీ మూలుగు చూసి ఎంత జ్వరం వచ్చింది అని భయపడ్డాను—ఏం లేకుండా తేలిపోయింది కదా అనుకుంటూంటే ఏదో మునిగిపోయినట్లు ఆ కోటు తొడుక్కుని వానలో ఎక్కడికి ప్రయాణం" అంది వంట గదిలోంచి ఎందుకో అటువేపు వచ్చిన ఇందిర మందలిస్తున్నట్లు.

"ఎక్కడా తిరగనమ్మా. వాసు వాళ్ళింటికి వెళ్ళి కూర్చుంటాను. నా కొక్కడికి ఏం తోచటంలేదు." అన్నాడు గిరి బతిమాలుకుంటున్నట్లు.

"తోచకపోతే కాస్సేపు పద్మా నువ్వూ పేకాడుకోండి. లేకపోతే ఇదుగో నాకూ అయిపోయింది వచ్చేస్తున్నా. అందరం కూర్చుని కబుర్లు చెప్పుకుందాం. ఎక్కడికీ వెళ్ళకు." మరోసారి హెచ్చరించి పని చూసుకోడానికి వెళ్ళిపోయింది ఇందిర.

(సశేషం)

ప్రధానమంత్రి కరువు సహాయక నిధికి ఉదారంగా విరాళమివ్వండి
ప్రధానమంత్రి కరువు సహాయక నిధికి ఉదారంగా విరాళమివ్వండి
ప్రధానమంత్రి కరువు సహాయక నిధికి ఉదారంగా విరాళమివ్వండి

కమ్యూనిస్టు దేశాలలో కాంగ్రెస్ అధ్యక్షుడు కామరాజ్

(గత సంచిక తరువాయి)

ఆర్. వెంకట్రామన్

చెకోస్లోవేకియా రాజధాని అయిన ప్రాగ్ నగర విమానాశ్రయంలో కామరాజ్ ఆగస్టు 2వ తేదీ ఉదయం 9 గంటలకు దిగారు. చెకోస్లోవేకియా సోషలిస్టుపార్టీ నాయకుడు, శాసన న్యాయశాఖామంత్రి శ్రీ అలాయ్స్ న్యూమన్, విదేశాంగశాఖాధికారులు, కేంద్ర శాసనమండలి ప్రతినిధులు, ప్రాగ్‌లో భారత రాయబారి శ్రీగోహూద్ కామరాజుకు స్వాగతమిచ్చారు

చెకోస్లోవేకియా 1918 లో ప్రత్యేక రిపబ్లిక్‌గా ఏర్పడింది. అప్పుడు బొహిమియా, మురేవియా, ఆస్ట్రేలియాలో కొంత భాగమూ, ఉత్తర హంగేరి చెకోస్లోవేకియాలోవుండేవి. 1938లో హిట్లరుతో మ్యూనిచ్ ఒప్పందం ఏర్పడడంవల్ల చెకోస్లోవేకియలోని చాలభాగం జర్మనీకి, హంగేరికి, పోలెండుకు, బదిలీఅయ్యాయి రెండవ ప్రపంచసంగ్రామం జరిగిన తర్వాత ప్రస్తుతం వున్న చెకోస్లోవేకియా సోషలిస్టు రిపబ్లిక్‌గా ప్రకటించబడి, లోగడ దానిలో భాగా లయిన ప్రాంతాలన్నీ మరల దానికి చేర్చబడ్డాయి.

చెకోస్లోవేకియా దాదాపు మద్రాసు రాష్ట్ర మంతటు విస్తీర్ణం వుంటుంది. జనసంఖ్య కోటిన్నర మాత్రమే. కాని, వారి జీవనప్రమాణం యూరోప్‌లో అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగాను, కొన్ని కొన్ని విషయాలలో వారికన్నా మేలుగాను వుంది. పరిశ్రమరంగంలో పెక్కు విజయాలు సంపాదించి ముందంజ వేస్తున్నది ఈ దేశం.

'స్కోడా' అనే పేరు పరిశ్రమరంగంలో చాల ప్రసిద్ధమైనది. 'స్కోడా' కర్మాగారం గురించి మనదేశంలోను తెలియనివారు కొద్దిమందే. ఇది ఈ దేశానికి ప్రతిష్ఠ తెచ్చే కర్మాగారం. మనదేశంలోని సిమెంట్ కర్మాగారాలకు, పంచదార కర్మాగారాలకు అవసరమైన యంత్రాలను ఈ స్కోడా నుంచి దిగుమతి చేసుకున్నాము. హైదరాబాద్‌లోని భారీ విద్యుత్పరికరాల కర్మాగారం, రాంచీ, లాల్‌చంద్‌నగర్ మొదలయిన నగరాలలో వున్న మరికొన్ని యంత్రాగారాలు చెకోస్లోవేకియా సహకారంతో నెలకొన్నట్టివే.

రాజకీయరంగంలోను భారత—చెక్ సంబంధాలు సుముఖంగానే వున్నాయి. కాశ్మీర్ సమస్య విషయంలో చెకోస్లోవేకియా మొదటి నుంచి భారతదేశాన్ని సమర్థించింది. ఆవిధంగానే చైనా దురాక్రమణను మొదటి నుంచి చెకోస్లోవేకియా ఖండిస్తున్నది. కాగా, ఈ రెండు దేశాలకు వున్న పరస్పర సదభిప్రాయాన్ని పెంచడానికి కామరాజ్ పర్యటన తోడ్పడింది.

కామరాజ్‌కు, ప్రత్యేకాతిథులకు ఏర్పాటుచేసే ప్రభుత్వ అతిథి భవనంలో బస ఏర్పాటు చేశారు. అది పూర్వం ఒక కోటీశ్వరుని కోట.

రమ్యమైన ఒక గుట్ట మీది విశాలమయిన తోటల మధ్యన వున్న ఆ ప్రాసాదం పైనుంచి ఆ నగర దృశ్యం చాల రమణీయంగా వుంటుంది.

ప్రాగ్ అతిరమణీయమైన ప్రాచీన పట్టణం. చారిత్రకమైన నగరంలో పాత కోటలు, బురుజులు మొదలయిన చిహ్నాలు నగరమంతటా కనిపిస్తాయి. ఆ కోటలలోను, బురుజులలోను కన్నులకు ఇంపైన రంగురంగుల పూలతోటలు కనిపించాయి. ఆ నగరంలోను, పరిసరాలలోను మేము తిరిగి చాల సంతోషించాము.

ప్రాగ్ నగరంలో ఆ దేశం ముఖ్యనాయకులను పలువురిని కలుసుకుని మాట్లాడారు కామరాజ్. ముఖ్యంగా చెకోస్లోవేకియా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర సంఘ కార్యదర్శి గోల్డర్, విదేశాంగశాఖా మంత్రి, తాత్కాలిక ప్రధానమంత్రి గ్రేయిర్, పార్లమెంటు ఉపసభాపతి శ్రీమతి లెబ్‌లోర్వా మొదలయినవారిని కలుసుకుని సంభాషించారు కామరాజ్.

"చెకోస్లోవేకియా ప్రజలు నిరంతర పరిశ్రమతోనే పురోగతి సాధించడం సాధ్యం. త్యాగంతోనే దేశ గౌరవాన్ని, ప్రపంచశాంతిని కాపాడడం సాధ్యం." అని ప్రజలు దృఢసంకల్పంతో వున్నట్లు ఆ నాయకులు అన్నారు. జర్మనీతో తరచు తమకు కలిగిన యుద్ధాలను గురించి వారు ప్రస్తావించి, ఇక మీదనైనా ఇలాటి యుద్ధాలు జరుగకుండా చూడాలని, కాని జర్మనీలో ఇంకా తమ యిష్టానికి ప్రతికూలంగా నాజీ విధానం తల విరబోసుకుని ఆడుతున్నదని వారు విచారం ప్రకటించారు. చెకోస్లోవేకియాలోని కొంత భూభాగాన్ని పశ్చిమజర్మనీ కబళింప గోరుతున్నదని, దీనికి పరోక్షంగా బలం చేకూరుతున్నదని వారు చింత తెలియచేశారు.

మోటారుకార్ల వుత్పత్తిలో 'స్కోడా' మహత్తరమైన పురోగతిని సాధించింది. సంవత్సరం పొడుగునా లక్షలకొలది 'స్కోడా' కార్లు ఎగుమతి అవుతున్నాయి గృహనిర్మాణ విషయంలో ఈ దేశం చాల కృషి చేస్తున్నది. "ఏటా లక్షల కొలది ఇళ్లు కడుతున్నారు అయినా ఇంకా ఇళ్ల కొరతే" అని వారన్నారు.


చెకోస్లోవేకియా జీవనప్రమాణాన్ని గురించి కామరాజ్ కొన్ని ప్రశ్నలడిగారు. అక్కడి ప్రజల సరాసరి రాబడి, నెలకు 1,500 రూపాయలు. నైపుణ్యంగల ఇంజనీర్‌కు 1900 నుంచి 2000 వరకు జీతం ఇస్తున్నారు. చాల నిపుణులకు 2,500 రూపాయలు, శిక్షణ ఏమీలేని కార్మికుడు 950 రూపాయలు సంపాదిస్తున్నాడు. కొన్నివృత్తులలో ఎక్కువ జీతాలు యిస్తున్నారని వారు తెలిపారు. ఉదాహరణకు సొరంగాలలో పనిచేసే వారికి 3,200 దాక జీతం యిస్తున్నారు

వైద్యసౌకర్యాలు, విద్యాసౌకర్యాలు ఉచితం. వృద్ధాప్యపు పెన్షన్ వుంది. ప్రతిఉద్యోగి ఉద్యోగం నుంచి విరమించేటప్పుడు ఆఖరు ఐదు సంవత్సరాల సరాసరి లెక్కగట్టి పెన్షన్ ఇస్తున్నారు. కనీసపు పెన్షన్ రు. 600. గరిష్ఠపు పెన్షన్ రు. 2000. దేశం మొత్తంలో 25 లక్షలమంది వృద్ధాప్యపు పెన్షన్ పొందుతున్నారు.

ప్రభుత్వంలో పెక్కు రాజకీయ పక్షాలున్నాయి. కమ్యూనిస్టుపార్టీ, సోషలిస్టుపార్టీ, పీపుల్సుపార్టీ మొదలయిన పెక్కు పార్టీలు చేరి "నేషనల్‌ఫ్రంట్" అని ఏర్పడి, ప్రస్తుతం దేశాన్ని పాలిస్తున్నది.

చెకోస్లోవేకియాలో ఎన్నికలు రష్యాలో జరిగినట్టే జరుగుతాయి. నేడు చెకోస్లోవేకియా పార్లమెంటులో మొత్తం 300 మంది సభ్యులున్నారు. వీరిలో 20 మంది పీపుల్సుపార్టీ. 20 మంది సోషలిస్టుపార్టీ, 50 మంది ఏ పార్టీలోను చేరని పత్రికా రచయితలు, నటులు మొదలయిన కళాకారులు.

ఆగస్టు 3 వ తేదీ ఉదయం కామరాజ్‌కు గౌరవార్థం అక్కడి భారత రాయబారి తేనేటి విందు చేశారు. దానిలో చెకోస్లోవేకియాలోని నాయకులందరూ, అక్కడవున్న భారత నాయకులు, భారతీయ విద్యార్థులు వచ్చారు



భారతీయ విద్యార్థులతో కామరాజ్

జెకోస్లోవేకియాలో మరికొన్ని రోజులుండి, కర్మాగారాలను, వినోదస్థలాలను చూడాలని శ్రీమతి లెబ్ లోర్వా కామరాజ్‌ను బలవంతం చేశారు. అవకాశం లేనందున ఆమె కోరికను మన్నించలేనని కామరాజ్ తెలియజేసుకున్నారు.

కార్ల్సిలివారీ అనే స్థలం జెకోస్లోవేకియాలో చాల వుత్తమమైన విలాస యాత్రాస్థలం. వేడినీటి వూటలు, గంధకపు నీటి వూటలు అక్కడ వున్నాయి. ఈస్థలంలో అఖిలదేశ సినిమా ప్రదర్శనపోటీలు జరుగుతాయి. ఇంతకుముందు నేను ఆదేశానికి వెళ్లినప్పుడు ఈ విలాసయాత్రా స్థలానికి వెళ్లి ఆనందించాను.

జెకోస్లోవేకియాలో ఒక కొత్తరకం సినిమా—నాటక పద్ధతి వుంది. దానిని అక్కడివారు "మాజిక్ లాంట్రన్" అంటారు సినిమా, నాటకమూ రెండూ చేరిన దృశ్యవిధానమది. తెరమీద సినిమా చూపిస్తారు. ఆ సమయంలోనే సినిమాలో నటించేవారితో మరొక నటియో, నటుడో ఎదుట నిలిచి నటిస్తారు. ఎదుట నిలిచే నటుడు, సినిమాలో నటించే నటుడూ సంభాషించి నటిస్తారు. ఇలా ఇద్దరు నటించడమే గొప్ప. మరుసటి దృశ్యంలో తెరమీద వున్నవారు మన ఎదుట, లోగడ మన ఎదుట వున్నవారు తెర మీదికీ మారుతారు. ఈ నూతన పద్ధతిని జెకోస్లోవేకియా వారే తొలిసారిగా కనుగొన్నారు.

న్యూయార్క్‌లో జరిగిన ప్రపంచప్రదర్శనంలో దీనిని "రూబాండ్ కంపెనీ" ప్రదర్శించింది కాని మేము ఆ మాజిక్‌లాంట్రన్ చూడలేకపోయాము. ఎందుకంటే, అది అప్పుడు అమెరికాలో పర్యటన జరుపుతున్నది.

మరికొన్ని రోజులు ఇక్కడ వుండలేకపోయామే అనే విచారంతో కామరాజు అక్కడి నుంచి బయలుదేరారు! విమానాశ్రయానికి నాయకులందరూ వచ్చి, ఆయనకు వీడ్కోలిచ్చారు.

కామరాజు వెళ్లిన మరో సోషలిస్టు దేశం హంగెరీ.

ఆగస్టు 4 వ తేదీన హంగెరీ రాజధాని బుడాపెస్ట్ విమానాశ్రయంలో దిగారు కామరాజ్. ఆయన హంగెరీ పర్యటనను గురించి చెప్పడానికి ముందు, హంగెరీని గురించి కొంచెం చెప్పడం ఉచితం.

హంగెరీ దేశం విస్తీర్ణం మద్రాసు రాష్ట్రం విస్తీర్ణంలో మూడింట రెండువంతులు. జనసంఖ్య ఇంచుమించు కోటి. మగ్యార్ అనే భాష మాట్లాడుతారు.

కామరాజ్

హంగెరీ 19 వ శతాబ్దిలో ఆస్ట్రో.హంగెరియన్ సామ్రాజ్యంలో ఒకభాగం. ఈ సామ్రాజ్యం ఒక శతాబ్దం పాటు చాల పేరుతో కొనసాగింది. కళలకు సంస్కృతికి పుట్టినిల్లుగా వుండేది.

1944 లో నాజీ సైన్యాలు హంగెరీని ఆక్రమించుకున్నాయి. ద్వితీయ సంగ్రామ సమాప్తిలో రష్యా సైన్యాలు పురోగమించి నాజీలను వెళ్లగొట్టాయి. 1948 లో హంగెరీ సోషలిస్టు రిపబ్లిక్‌గా ఘోషించబడి, వృద్ధి పొందుతున్నది.

హంగెరీ కమ్యూనిస్టు పార్టీ ప్రథమకార్యదర్శి వేన్స్‌కాదర్ ఆ దేశ ముఖ్యనాయకుడు. ఇటీవల వరకు ఈయన ముఖ్యమంత్రిగా వుండి, దానిని వదలి ప్రస్తుతం పార్టీ ప్రథమ కార్యదర్శిగా వున్నారు. ఈయన కమ్యూనిస్టుపార్టీ వారిలో మితవాది అని అంటారు.

భారత హంగెరీ సంబంధాలు సామరస్య పూర్వకంగానే వున్నాయి. కామరాజు హంగెరీకి రావాలని ఆ దేశ నాయకులు ఎంతో కుతూహలంతో అడిగారు. వారి కోరికను మన్ని హంగరీలో మూడురోజులు గడపడానికి నిర్ణయించుకున్నాము.

"ప్రపంచంలో అందమైన నగరం ఏది?" అని హంగెరీవారినో, బుడాపెస్ట్ వారినో అడిగితే "బుడాపెస్టు" అని సమాధానం చెబుతారు. అలా వారు చెప్పడం సముచిత మనడం యాత్రికులు సామాన్యంగా అంగీకరించే విషయమే.

డాన్యూబ్ నదీతీరంలో వుంది బుడాపెస్ట్ నగరం గట్టుకు ఒకవైపు బుడా మరొక వైపు పెస్ట్. రెండు నగరాలు కొన్ని శతాబ్దాలుగా ఒకే నగరంగా వ్యవహరించబడుతాయి. ఈ నగర సమీపంలో డాన్యూబ్ నది రెండుగా చీలి, దీవి ఏర్పరచి, తర్వాత ఒకటిగా చేరి పారుతుంది. దీనికి మార్గరెట్ దీవి అనిపేరు.

మార్గరెట్ దీవి చాల రమ్యమైన పూలతోటలు, ఈత సరోవరాలు, సుందరమైన నీటివూటలు వున్న విలాసయాత్రా ప్రదేశం. చలికాలంలోను, సెలవులలోను జనం ఇక్కడికి వచ్చి ఉల్లాసంగా గడుపుతారు.

డాన్యూబ్ నదిని దాటడానికి ఆధునికమైన పెక్కు కాంక్రీటు వంతెనలు వుండేవి. వాటిని హిట్లర్ పెత్తనం వున్నప్పుడు కూల్చివేశారని, కాని హంగెరీ నిపుణులు వాటిని పూర్వం కన్నా అధిక నైపుణ్యంతో నిర్మించారని గొప్పగా అక్కడివారు చెప్పుకున్నారు

డాన్యూబ్ నది హంగెరీకి ముఖ్యమైన రవాణా మార్గం. పెద్దపెద్ద ఓడలు ఈ నదిలో పయనించడానికి వసతి, అవకాశాలు కల్పించబడ్డాయి. రష్యాలో లాగ బుడాపెస్ట్‌లోను "రాకెట్" అనే శీఘ్రగామి ఓడలు నడుస్తాయి.

మేము వెళ్లిన మొదటిరోజు నగరాన్ని చూడడానికి, అక్కడి నందనవనాలు, పాత పర్వతాలు, పర్వతాల మీద కోటలు మొదలయిన వాటిని చూడడానికి వినియోగించాము.

మరుసటిరోజు వుదయం హంగెరీ ముఖ్యమంత్రి శ్రీ కలాయ్‌ని పార్లమెంటు భవనంలో చూచి సంభాషించారు కామరాజు. ఈ పార్లమెంట్ భవనం పూర్వపు ఆస్ట్రో—హంగెరీ సామ్రాజ్యం నాటి ప్రాసాదం.

ఈ సంభాషణలో పీపుల్స్‌ఫ్రంట్ సహాయ కార్యదర్శిని శ్రీమతి ఫనోస్ బగువార్ కూడా చేరారు. ఈ సంభాషణ హంగెరీ రాజకీయాలు, ఆర్థికాభివృద్ధిని గురించి జరిగింది.

హంగెరీలో ఒకే రాజకీయ పార్టీ వుంది. దానిని వారు "పేట్రియాటిక్ పీపుల్స్ ఫ్రంట్" అని అంటారు. దీని సభ్యులలో వివిధ సిద్ధాంతాల వారు శాఖల వారు వున్నారు. కాని, వారంతా దేశం పురోగమించాలని, ప్రజల జీవనప్రమాణం ఎక్కువ కావాలని ఉద్దేశించేవారే. ఈ ఫ్రంట్‌లోని ఒకవర్గంవారు పార్లమెంటులోను మరొక వర్గంవారు సంఘసేవలోను పాల్గొంటారు. పార్లమెంటు సభ్యులు 300 మందిలో 60 శాతం ఈ ఫ్రంట్ సభ్యులు. తక్కిన 40 శాతం ఏ పక్షానికీ చెందనివారు.

తర్వాత భారతదేశం గొప్పదనాన్ని, అభివృద్ధిని గురించి, హంగెరీ, భారత్‌ల పరస్పర వ్యాపారాభివృద్ధి చేసుకోవడం గురించి ప్రధాని కలాయ్ చెప్పారు. తర్వాత అధికారపూర్వకమైన విందు జరిగింది. విందు తర్వాత ఒకరు మాతోపాటు వచ్చి, పార్లమెంట్ భవనంలోని వివిధ భాగాలను చూపారు.


ఆ సాయంకాలం అక్కడి భారత రాయబారి శ్రీ జె. సి. కక్కార్ కామరాజ్‌కు విందు చేశారు. దానికి హంగరీ నాయకులు, మాజీ విదేశాంగశాఖా మంత్రి, ఇంజినీర్లు, లఘుపరిశ్రమల మంత్రి శ్రీమతి నాగ్ మొదలయిన వారు వచ్చారు.

మన రాయబారి కార్యాలయం బుడా నగరం ఎగువన ఒక అందమైన పర్వతంపైన వుంది. ఆ పర్వతం మీది నుంచి బుడాపెస్ట్ నగరాన్ని చూపినప్పుడు దీపమాలికలు, మధ్య మధ్యన పచ్చని ప్రదేశాలు ఎంతో ముచ్చటగా కనిపిస్తాయి.

ఆగస్టు 6 వ తేదీ శనివారం బుడాపెస్ట్ నగరానికి వెలుపల వున్న అల్యూమినం కర్మాగారం చూచాము. హంగెరీలో లభించే ఏకైక ఖనిజం బాక్సైట్. దీనిని వారు రష్యాకు ఎగుమతి చేసి, దానికి మారు అల్యూమినం దిగుమతి చేసుకుంటారు. ఆ అల్యూమినంతో రకరకాల వస్తువులు తయారు చేస్తారు.

హంగెరీ సహాయంతో మనదేశంలోని మధ్యప్రదేశ్ రాష్ట్రంలో కోర్బా అనేచోట ఒక అల్యూమినం కర్మాగారం నెలకొల్పడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని వారు తెలియజేశారు.

కర్మాగారంనుంచి తిరిగి వచ్చేటప్పుడు కామరాజ్ ఒక కార్మికుని ఆపి అతని యోగక్షేమాలు, జీతబత్యాలు అడిగారు. తన నెల జీతం 1500 రూ.లని నిపుణుడైన కార్మికుడు ఇంతకన్నా రెండింతలు



మూడింతలు సంపాదిస్తాడని అన్నారు. తమ కర్మాగారం నికర లాభాలలో సగం ప్రభుత్వానికి చేరుతుందని, తక్కిన సగం కర్మాగారాభివృద్ధికి వినియోగించబడుతుందని దాని నిర్వాహకులు తెలిపారు.

తర్వాత మేము ఒక సమష్టి వ్యవసాయ క్షేత్రం చూచాము. ఇది 1950 లో ఆరంభించబడింది. సమష్టి కోళ్ల పెంపకం కేంద్రాన్ని కూడా చూచాము. కోళ్ల కోసం అక్కడ తీసుకున్న జాగ్రత్తను-డాక్టర్లు, రోగ నిరోధౌషధాలు మొదలయినవి చూచి కామరాజ్ ఆశ్చర్యపడ్డారు. ఈ కేంద్రం యూరోప్‌లోని పెద్ద కోళ్ల పెంపకం కేంద్రాలలో ఒక్కటి. దీనిలో 10 వేలకు పైగా కోళ్ళున్నాయి. ఈ కేంద్రం విజిటర్స్ బుక్కులో కామరాజ్ దీనిని మిక్కిలి ప్రశంసిస్తూ వ్రాశారు.

హంగెరీ దేశం నాలుగు వైపుల భూమి వున్నందున సముద్రం లేదు. కాని, సముద్రం వంటి గొప్ప జలాశయం వారికి వుంది. 60 మైళ్ల పొడవు, సుమారు అయిదు మైళ్ల వెడల్పు వుంటుంది ఇది. దీని పేరు బాలాటన్ లేక్.

సముద్రతీరంలో వినోదంగా గడిపేలాగే ఈ చెరువుగట్టు మీద జనం గుడారాలు వేసుకుని విశ్రమిస్తారు. ఇదొక శానిటోరియం—ఆరోగ్యకేంద్రంగానూ విఖ్యాతి చెందింది. దీని తీరంలో పెక్కు నవీన సౌకర్యాలున్న హోటళ్ళు, విశ్రాంతి స్థలాలు వున్నాయి.

మన రవీంద్ర కవీంద్రుడు 1926 లో ఈచెరువు గట్టున ఆరోగ్యం కోసం విశ్రాంతి తీసుకున్నారు. దానికి చిహ్నంగా అక్కడ ఒకచెట్టు నాటి, ఒక అద్భుత గేయం వ్రాశారు:

When I am no longer
on this earth, my tree,
Let the ever-renewed leaves of the
Spring murmur to the wayfarer
The poet did love while he lived
8 th November, 1926—
Rabindranath Tagore.

హంగెరీ ప్రభుత్వం అక్కడ టాగూర్ విగ్రహం రొమ్ముమేర వున్నది ఒకటి స్థాపించింది.

కామరాజ్ టాగూర్ విగ్రహానికి అంజలి ఘటించి బయలుదేరారు.

బాలాటన్ చెరువు దాటడానికి పెక్కు పడవలున్నాయి. వాటిలో ప్రయాణీకులు తమ మోటార్లతో పాటు ఎక్కి వెళ్లడానికి తగినట్లు ఏర్పాట్లున్నాయి.

వెచ్చని సాయంకాలపు ఎండ చెరువు నీటిపై ప్రతిబింబిస్తూ వుండినది. ఒక గట్టునుంచి మరొక గట్టుకు ఈ విశాలమైన పడవలు ఒకదాని కొకటి దాటిపోతున్నవి. వచ్చేవారికి వెళ్లేవారు అభినందనలు తెలుపుతూ వయునిస్తూ వుంటే చూడడానికి ఎంతో ఆనందంగా వుండేది.


చాలసేపు ఈ చెరువు గట్టున తిరిగి బుడాపెస్ట్ నగరానికి తిరిగి వెళ్లాము.

అక్కడినుంచి కామరాజ్ బల్గేరియాకు వెళ్లారు.

(సశేషం)

—అనువాదం: తి. రా.

(ఆనందవికటన్ సౌజన్యంతో)





కెరటాలు!

వేమకోటి సీతారామశాస్త్రి

ఆమె వెళ్లిపోయిందట.

నిట్టూర్చేను. హృదయం మూగగా రోదించింది. స్థాణువై పోయాను. ప్రకృతిలో ప్రతీ అణువూ, నన్ను స్పృశిస్తూ పరిహసిస్తోందేమో ననిపించింది.

'వెళ్దామా!' అన్నాడు శ్రీకాంత్. కళ్లు తుడుచు కుంటూ వుండగా అడిగేడు, 'ఏడుస్తున్నావా?' అని.

జీవితంలో నేనేనాడూ నవ్వలేదు. నాన్నా అమ్మా నాకు తెలిసీతెలియని వయస్సులోనే, భూమిలో కలిసిపోయారు. నేననుకుంటాను, దేవతలాంటి అమ్మ ఆదరణ, దేవుని వంటి నాన్న వాత్సల్యం పొందలేని మనిషి మనుగడ వ్యర్థమనుకుంటాను. నాకు చాలా అనుభవాలు వున్నాయి. హీనాతిహీనంగా పెరిగాను. కోర్కెల రెక్కలను సజీవంగా సమాధి చేసుకున్నాను. వారాలు చేసుకున్నాను. వీధి లాంతర్ల గుడ్డి వెలు తుర్లో, భవిష్యత్తు కోసం బంగారు కలలు కంటూ చదువుకున్నాను. అనేక చిత్రహింసలకు గురి అయ్యాను. నాకూ చాలామంది బంధువులు వున్నారు. యేం లాభం. వాళ్లు మనిషికన్నా డబ్బు విలువ యెక్కు వని భావించేవారు. మగవాడిని, వోర్చుకోగలిగిన గుణం కలవాడిని కాబట్టి భరించాను.

విధాత నా జీవితంలో గుడ్డి వెలుతురు చూపిం చాడు. ఎస్సెల్సీ ప్యాసవగానే వుద్యోగం దొరికింది. నాకు వుద్యోగంచేయాలని వుండేదికాదు. మావూళ్లో గవర్నమెంటు హాస్పటలు వుండేది. అందులో డాక్టర్లు తెల్లనిబట్టల్తో, మల్లెపూవు లాంటి చిరునవ్వుల్తో, స్టెతస్కోపుతో పరీక్ష చేసి రోగుల రోగాలు నివారణ చేసేవారు. పాలరాతి గచ్చు మీద లయబద్ధమైన బూట్ల చప్పుడుతో గుమ్మాలు దిగి కారు స్వంతంగా డ్రైవు చేసుకుంటూ వెళ్లిపోయేవారు. నాకూ, డాక్టరవాలని వుండేది. విశాఖపట్నంలో కొట్టుకు ఒక అణా చొప్పున చందా వేసుకున్నా చదువుకోగలననే ధైర్యం వుండేది. కానీ చదువుకోలేకపోయినాను. వాటికి బలమైన కారణాలు లేవు. అప్పట్లో ముందు జాయినవడానికి తగినంత ఆర్థిక సహాయం లభించ లేదు.

వుద్యోగంలో జాయినయ్యాను. ముక్కుకు సూటిగా, నిప్పులాంటి నిజం, ఆయుధంగా పెట్టు కుని వుద్యోగం చేస్తున్నాను. నాలో వక్కటే బల హీనత. భరించలేని కోపం. పరమ శత్రువుకయినా సహాయం చేద్దామన్న కోరిక. పగను పగతోనే జయించ మంటాడు శ్రీకాంత్. పగ మనిషిలో ప్రజ్వరిల్లే అహంకారం, ప్రాణంపోతే పిడికెడు బుగ్గి కన్నా యెక్కువకాదు. వుద్యోగ రీత్యా యెన్నో ప్రదేశాలు తిరిగాను. 'యేంవోయ్ యింకా పెళ్లి చేసుకోవా' అని స్నేహితులు అడిగితే, తల వంచుకుని సన్నగా సిగ్గుతో నవ్వేవాడిని. బుగ్గ మీద ఆగంటు లేకపోతే నువ్వు అచ్చంగా 'సునీల్‌దత్తువే నోయ్' అనేవారు. నిజమే వారాల వాళ్లింట్లో అమ్మాయ్ భానుకు బాదం కాయలు కోస్తూ, కొమ్మ విరిగి క్రిందపడ్డ ఫలిత మది.

'గడ్డం మీది కత్తిగాటు లాంటి మచ్చ. విశాల మైన పాలభాగం, యెప్పుడూ ఆలోచించే మీ కళ్లూ నాకెంతో యిష్టం' అనేది అమ్మాళ్, నానుదుర్ని ముద్దు పెట్టుకుంటూ, పౌర్ణమి వెన్నెలలో, సన్న జాజుల మత్తు నన్నావరిస్తుండగానే ఆమె స్నేహం లోనే, జీవితమంటే యేమిటో తెలిసింది. వాళ్లింట్లో అద్దెకుండేవాడిని. ఆమె ఆయనకు రెండో భార్య.

యనెప్పుడూ వ్యాపారం మీదనే తిరుగుతూ వుంటారు. వాళ్లది మన భాషకాదు. ఆమెకు వచ్చీరాని తెలుగుభాష. నాలో యేం మంచితనం కన్పించిందో, ఆయన నాకు యిల్లు అద్దెకు యిచ్చారు. ఆమెకు వొక్కర్తే కూతురు. పేరు ప్రియ. యెపుడూ వాళ్లింటి తలుపులు వేసి వుండేవి. సాయంకాలం మాత్రం తెరిచి వుండేవి. సాయంకాలం నేను అలసటతో ఆఫీసు నుండి వచ్చేవాడ్ని. తెల్లగా బొద్దుగా అందంగా వుండే 'ప్రియ' నా రూమ్‌లోకి వచ్చేది. కాస్సేపు ఆడుకుండేవాడ్ని ప్రియతో. యింతలో నౌఖరు వచ్చి యింట్లోకి తీసికెళ్లేవాడు. ఒకనాడు ప్రియకు బిస్కట్లు ప్యాకెట్టు కొన్నాను. ప్రియకు యిచ్చాను. కాస్సే పాడుకున్న తరువాత నౌఖరు తీసికెళ్లిపోయాడు. నేను భోజనానికి బయలుదేరాను. రూమ్‌కి తాళం వేస్తున్నపుడు, ఆమె వచ్చి 'యెందుకండీ పాపాయికి బిస్కట్లు కొన్నారు. వారు తెచ్చినవే చాలా వున్నాయి. అది తినదు' అన్నారామె కోకిల కంఠంతో. వచ్చీరానీ ఆమె తెలుగు నాకు నవ్వు పుట్టించింది. 'ఫర్వాలేదు లెండి. ప్రియ నా స్నేహితురాలుగా. తేవాలనిపించింది తెచ్చాను. మీకు లేవని కాదు' అన్నాను, బయటకు నడుస్తూ. యిలా పరిచయమైంది మా స్నేహం. అపుడపుడూ ఆదివారాలలో, ఆయనతో కలసి భోజనం చేసేవాడిని. వారి మధ్య కాలం యెంతో కులాసాగా గడిచిపోయేది. మా స్నేహం సన్నిహితం కాజొచ్చింది. ఒకనాడు కరుగుతున్న సాయంసంధ్యలో నా జీవితం ఆమెకు చెప్పాను. చివర్లో పడిన కష్టాలు నెమరు వేసుకుంటూ 'నాకేమో బ్రతకాలని లేదు. బ్రతికి యేం సాధించాలని' అన్నాను రుద్ధమైన కంఠంతో. కన్నీళ్లు గూడా వచ్చాయి.

ఆమె తటాలున నా వద్దకు వచ్చి, పైట చెంగుతో నా కన్నీరు తుడిచింది. 'ఛా తప్పు. అలాగన కండి. చచ్చి యేం సాధిస్తారు. బ్రతుకు నూరేళ్ల పంట. భగవంతుడిచ్చిన బ్రతుకు వొక వరం. మీకేం మగవారు, యెంతో ధైర్యంతో వుండాలి. మీ జీవితంలో చీకటి యెంత కాలం వుంటుంది. తప్పకుండా వెలుగు వస్తుంది. మీరు గొప్పవారవుతారు. పళనిస్వామి మిమ్మల్ని అదృష్టంలో ఓలలాడిస్తాడు. వొట్టు' అందామె నా చేతిలో చెయి వేస్తూ. అంతే!

నైతికంగా నేను పతనమయినానేమో ననిపించింది. నమ్మకద్రోహం చేస్తున్నానేమోననిపించింది, నాకు చాలాసార్లు. ఆమె యౌవన సౌందర్యపు వెలుగు, ఆత్మీయత చూపించిన ప్రేమ అభిమానం నాకెంతో వుత్సాహాన్ని, ధైర్యాన్ని, మనోవికాసాన్ని కలిగించేవి. పూర్వంలా ఆయన యెదుట ధైర్యంగా మాట్లాడలేకపోయేవాడిని. ఒకనాటి రాత్రి తీరని కాంక్షలా వెలుగుతున్న ట్రాన్సుఫార్మరు బల్బు కాంతిలో, కెంపు రంగు పట్టుచీరె, అదే రంగు రవిక వేసుకుని, జ్యోతిలా కళ్లలో కాంతిని నింపుకుంటూ "మీరిలా సామాన్యుడిగా వుండటం నా కిష్టంలేదు." అందామె తన ఒడిలో వున్న నా నుదుర్ని ముద్దు పెట్టుకుంటూ.

'అంటే అసామాన్యుడ్నిగా వుండాలన్నమాట' అన్నాను.

'అబ్బ మీ తెలుగు మాటలు నాకు సమంగా అర్థం కావు. నే చెప్పేది వినండి 'అందామె చిరుకోపం ప్రదర్శిస్తూ.

'చిత్తం దేవిగారికి ఆగ్రహం వచ్చినట్లు వుంది. సెలవివ్వండి' అన్నాను.

'మీరు రోజూ వేసుకునే బట్టలు బాగులేవు. సమాజంలో యెంతో హుందాగా వుండాలి. వ్యక్తిగతంగా యెంత విలువ వున్నా, మంచిబట్టలు వేసుకుంటేనేగానీ రాణించరు. మీ ఉన్నతిని నేను చూడాలి." అంటూ బీరువా దగ్గరికెళ్లి, రెండు కొత్త పదిరూపాయల నోట్ల కట్టలు, నా వొళ్లో వేస్తూ, చిన్నపెట్టెలో కొత్త కెంపు వుంగరం నా చేతికి తొడుగుతూ 'యీ రెండు వేలతో మీరు మంచి బట్టలు కొనుక్కోండి. మీ డబ్బూ,నా డబ్బూ అనే భేదంలేదు. కాదనకండి' అందామె ప్రాధేయపడుతూ. నేను చివాల్న లేచాను. సౌందర్యపు మత్తు వదలిపోయింది. డబ్బు గొప్పది. కాదనలేను. కానీ నాకు దాని మీద సదభిప్రాయం లేదు. అందులోనూ స్త్రీ ధనం. యిప్పటికే చాలా దిగజారిపోయాను. డబ్బు కన్నా మనుష్యుల మంచితనం మీదనే నా జీవితం పోవాలని కోరిక. వుంగరాన్ని తీస్తూ, మృదువుగా ఆమెకిస్తూ 'జీవితంలో నేను యెంతో అదృష్టవంతుడ్ని. యెవ్వరికీ లభించని, అపూర్వమయిన ప్రేమ నాకు లభించింది. నా కింకేం కావాలని లేదు. ఈ క్షణం నీ ఒడిలో ప్రాణాలు వొదిలితే బాగుంటుందనిపిస్తోంది. యిలా వెళ్లిపోనీ, నా జీవితం దేవి' అన్నాను. ఆమెకు కోపం వచ్చింది.

"అంతేనా" అందామె. నేను తలవూపాను.

'అయితే నాతో మాట్లాడకండి' అంది చిన్నపిల్లలా.

'అలాగే' అని రూమ్‌కు వచ్చేశాను. వారంరోజుల వరకూ మరి మాట్లాడలేదు. నాకూ అలాగే, ఆఫీసు యినస్పెక్షను తొందర్లో తీరిక లేకపోయింది. పెద్దాఫీసరు నేను చేసిన ఆఫీసుపనిని ప్రశంసించారని ఆయన వెళ్లిన మర్నాడే నన్ను హెడ్డాఫీసుకు ట్రాన్సుఫరు చేసినట్లు వైరు.

మర్నాడాదివారం. వారింట్లో భోజనం చేస్తూ ఆయనతో చెప్పాను బదిలీ సంగతి. ఆయన ఆశ్చర్యపోయారు. "మీరు వెళ్లిపోతే యెలాగండీ. మీరున్నారనే గొప్ప ధైర్యంగా వుండేది. కాన్సెలు చేయించుకోలేరూ" అన్నారు. నిజమే ఆర్డర్లు కాన్సిలు చేయించుకోవచ్చు. కానీ నాకు మాత్రం చేయించుకోవాలనిపించలేదు "ప్రియకు వారివద్ద చాలా చేరిక" అందామె. నూతిలో నుండి కంఠం విన్పించినట్లుగా వుంది. 'అంతేనా' అన్నట్లు ఆమె వైపు చూశాను. ఆమె నా వైపు చూస్తూ కోపంగా తల తిప్పేసుకుంది. నేను నవ్వుకున్నాను.

యిది జరిగిన మూడోరోజున, ఆయన మళ్లీ తిరువయ్యూరు వెళ్లిపోయారు. ఆ రాత్రి వొంటి గంట తరువాత ఆమె నా రూమ్‌కు వచ్చింది. "నిజంగా వెళ్లిపోతారా?" కన్నీళ్లు చక్రాల్లా తిరుగుతూ వుండగానే అడిగింది. పాల నురగ లాంటి తెల్లనిచీరతో ఆమె దేవతలా మిలమిల మెరిసిపోతున్నది. వారం పదిరోజులుగా యీ సౌందర్యరాశికి యెందుకు దూరమయినానా అన్న భావం నాలో స్ఫురించింది. నాకామె ప్రశ్నకు సమాధానం చెప్పాలని తోచలేదు.

"ఆగండి... ముందు నా ప్రశ్నకు సమాధానం చెప్పండి" అందామె దూరం జరుగుతూ. నేను తప్పదని చెప్పాను. నా భుజమంతా ఆమె కన్నీటితో తడిసింది. "యేమైనా మీ మగవారింత కఠినహృదయు లనుకోలేదు" అందామె. మరింకామె మాట్లాడలేకపోయింది. జీవితంలో లభ్యమయిన అదృష్టదేవతను కావాలనే వొదులుకుంటున్నానేమో ననిపించింది.

కాలం, వయస్సు మనకోసం ఆగదు. ఆ రోజు రానే వచ్చింది. ఆఫీసులో ఘనంగా టీపార్టీయిచ్చారు. బజారు కెళ్లి బుద్ధుని దంతపు బొమ్మ, వెండి కుంకుమ భరణి, ప్రియకు ఫ్రాకులు కొన్నాను. యింటికి వచ్చాను. పెట్లో యెపుడో మా గోపాలం పంపిన తాజమహల్ ఒరిజనల్ ఫోటోవుంది. వాడు అపుడొక రైల్వే వుద్యోగి. వాడు ఫోటో పంపిస్తూ రాసిన వుత్తరం దొరికింది. చరిత్ర కందని సత్యాల మధ్య తాజమహల్ ప్రతిభ యినుమడించి పోతున్నది. తాజమహల్ చూసిన తరువాత నా కేమనిపించిందంటే మనిషి పతనానికీ వున్నతికీ 'ప్రేమే' కారణమనిపిస్తోంది. శలవుపెట్టి కొన్నాళ్లు వుందువుగాని రా అని రాశాడు. వాడొక భగ్నప్రేమికుడు. దాన్ని తట్టుకోలేక, విధిని యెదిరించలేక దూరంగా ఉత్తర్ ప్రదేశ్‌లో వుంటున్నాడు.

మర్నాడు తెల్లవారు జామున ప్రయాణం. ఆరాత్రే నేను తెచ్చినవన్నీ ఆమెకిచ్చాను. ఆమె ఏడుస్తోంది. ఆమెను వోదార్చాను.

'మీకు తెలియదు. నేను మీతో వచ్చేస్తాను స్వేచ్ఛగా జీవిద్దాం. మనకేలోటూ వుండదు.' అంటూ సూట్‌కేస్ తెరచింది. దాన్నిండా నోట్ల కట్టలు బంగారం, ఒక తరం రాజులాగ జీవితం గడుపవచ్చు వాటితో.

అప్రతిభుడనయ్యాను. అభిమానం ప్రేమ, అనేవి సాంఘిక బంధాల కలీతమైనవా అని భయపడ్డాను. యేం సమాధానం చెప్పను. కన్నీరు సెలయేరులా పారుతున్న ఆ కలకంఠికి. ఆమె నన్ను విడిచి వుండలేదేమోననిపిస్తోంది. వెన్నెల్లో సన్నజాజులు నన్ను వెక్కిరిస్తున్నాయి. "యేంటి నీ నిర్ణయం. నీకంటూ ఒక జీవితంవుంది. పాపాయి వుంది. సహృదయుడైన భర్త వున్నాడు. ఒక పరిధిలో స్థిరపడిపోయిన నీ జీవితం బలవంతంగా యెందుకు నాశనం కావాలని కోరుకుంటావు. సమాజము హర్షించదు......" కాస్సేపు ఆగాను. ఆమె నా కళ్లలోకి చూస్తున్నది.

'అదిగో అలాగే చూడకు. నీ సౌందర్యపు వెలుగును భరించలేను. మన మిప్పటికే నైతికంగా దిగజారిపోయాం. కానీ పతన మవలేదు. యిది యే జన్మజన్మాల రుణానుభంధమో. నన్ను క్షమించు. నేను పిరికివాణ్ణి కాకపోయినా నీ సాహసం, సహించే సమర్థత నాలోలేదు. నన్ను మన్నించు. కలకాలం నీ పసుపు కుంకుమ వర్ధిల్లి పండువంటి జీవితం గడపాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నాను". నాకూ కన్నీరు వచ్చింది. చీకటి భరించాల్సిన క్షణాలు వస్తాయి.

ఆ క్షణంలో ఆమె నాతో లీనమైపోయింది. రాగరంజితమైన, ఆమె పెదవుల్లో, వదనంలో, కాటుక కండ్లలో నా ప్రతిరూపం కన్పించింది. ఆరాత్రి రాత్రిలా వుండిపోతే బావుండునేమో ననిపించింది. తెల్లవారు జామువరకూ అలాగే చైతన్యరహితులమై యేం మాట్లాడుకోవాలో తెలియని స్థితిలో వుండిపోయాం. "నన్ను మర్చిపోతారా" అందామె రుద్ధకంఠంతో. 'లేదు. యెలా మర్చి

కిరణ్మయి

పోతాను. నా హృదయంలో దాచుకుంటాను' అన్నాను దగ్గరికి తీసుకుంటూ. 'కాదనకండి' అంటూ కెంపు వుంగరం వేలికి తొడిగింది. కెంపుమీద ఆమె కన్నీటి బొట్టు క్షణం నిలిచి జారిపోయింది. అంతే!

కొత్తపట్నం వచ్చాను. కొత్త పరిసరాలు. రోజూ ఆమె జ్ఞాపకం వచ్చేది. ఒక్కొక్కసారి వెళ్దామా అన్న భ్రాంతి కలిగేది. కానీ మనస్సును కట్టేశాను. కోర్కెల గుర్రాలను కదలనివ్వలేదు. జీవితంలో స్తబ్ధత యేర్పడింది కొంతకాలం. అలాంటి సమయంలో శ్రీకాంత్ స్నేహమయింది. కాఫీ హోటల్లో మా పరిచయం. నా వయస్సే వుంటుంది. హ్యూమరస్‌గా మాట్లాడుతాడు. కుశల ప్రశ్నల అనంతరం, మా యిద్దరిమధ్యా స్నేహం జాజిలతలా పెనవేసుకుపోయింది. రోజూ సాయంకాలం యిద్దరం కాఫీ తాగి, నదిఒడ్డుకో, పార్కుకో షికారు పోయేవాళ్లం.

"యెదటివారి సంతోషం పంచుకోవటంలో యెంత ఆనందంవుందో, అలాగే యెదటివారి కష్టాలను, తనవిగా భావించినప్పుడే, స్నేహంలో మానవత వికసిస్తుం"దంటాడు శ్రీకాంత్. మీరూ, మీరూ, అనుకున్నవాళ్లమల్లా యేక వచన ప్రయోగములోకి వచ్చాం. అతను కథలు రాస్తాడట. నాకు కథలు చదివే అలవాటులేదు.

"నువ్వు నామీద కథరాయి" అన్నాను, నది ఒడ్డున యిసికతీసుకుని గుప్పెట్లో పోస్తూ. నవ్వేశాడు.

'యేమిటి నీకథ' అన్నాడు. నేనూ నవ్వేశాను. కానీ, ఒకనాడు చెప్పాను. యిసికలో అతని కన్నీటి బొట్టు జారింది. "మనుష్యుల నెందర్నో చూశాను. యెంతోమంది స్నేహితులున్నారు. కానీ నాకు నీలాంటి వుత్తముడు తారసిల్లలేదు. నీలాంటి స్నేహితుడున్నందుకు, నాకు గర్వంగావుంది" అన్నాడు కౌగలించుకుంటూ.

తర్వాత వారం రోజులు శ్రీకాంత్ కన్పించలేదు. తను వూరు వెళ్తున్నానని, వారం రోజులవుతుందని చెప్పాడు. ఒకనాడు రాత్రి భోజనం చేసి వస్తూంటే పట్నానికి అరమైలు దూరంలో, యిల్లు కాలిపోతున్న మంటలు కనుపించాయి, పల్లెలో. నాకు అగ్ని అంటే యెక్కడాలేని సాహసం వచ్చేస్తుంది. ఉద్రేకం వస్తుంది. మా అమ్మ యింటి అగ్ని ప్రమాదంలో కాలి చనిపోయిందట. పల్లెకు పరిగెత్తుకుంటూ వెళ్లాను. అగ్ని దేవుడు నన్నాహ్వానిస్తున్నట్లుగా కరాళ నాలికలు చాస్తున్నాడు. రోదనలు, ఆక్రందనలు ప్రతిధ్వనిస్తున్నాయి. జనం బిందెల నీళ్లతో, అగ్నిదేవుణ్ని సంతృప్తి పరచాలని చూస్తున్నారు. యెవరో ఒక ముసలామె 'బాబూ నా బిడ్డల్ని రక్షించండి' అంటూ ఆక్రందన చేస్తున్నది. నేనాయింటిలోకి దూకాను. పదిహేడేళ్ల అమ్మాయి, వంటింట్లో, క్షణంలో తనను కౌగలించుకోబోతున్న అగ్నిదేవుణ్ని చూచి భయవిహ్వలయ్యి ఆక్రందన చేస్తోంది. ఆమెను తప్పించాను. ఆమె దీనంగా నావైపు చూస్తూ 'మా అక్క, పసిపాప' అంది యింకో గదిచూపిస్తూ. అక్కడికి వెళ్లాను. పూరిటి మంచం అంటుకుంటోంది. పసిగుడ్డు కేరుమని యేడుస్తోంది. తల్లికి వంటిమీద చైతన్యం లేదు. బిడ్డను తీసుకుని బయట కందించాను. చైతన్య రహితురాలైన ఆమెను, బయట కందించాను. వెంటనే నా తలమీద కాలుతున్న బరువైన రాట ముంగిట్లోనే పడింది. అంతే!

నాకు స్పృహ వచ్చేసరికి, హాస్పటలు మందు వాసన తగిలింది. మెత్తని పరుపు తగిలింది. నా కళ్లకు గంతలు కట్టబడి వున్నాయి. కళ్లకు గంతలు విప్పుకుంటూ 'డాక్టర్' అని పిలిచాను. యింతలో ఒక కోమల హస్తం నా ప్రయత్నాన్ని విరమింపజేసింది.

'ఆవేశపడకండి. డాక్టరు ఒక గంటలోవస్తారు.' అంది కోకిల కంఠం, గుర్తించాను. ఆమె నర్సు. నాకు హాస్పటల్లో వుండటం అదే మొదటిసారి. డాక్టరు వచ్చారు.

"మీరు గొప్ప సాహసంతో ముగ్గురి ప్రాణాలు కాపాడారు. అభినందిస్తున్నాను. మీకు నుదిటికి బలమైన గాయాలు తగిలాయి. కండ్లకు కూడా ఎఫెక్టు యిస్తుందేమోనని జాగ్రత్త తీసుకున్నాం. భయపడకండి. మీకు చూపువస్తుంది." అన్నారు మృదువుగా. నేను భయపడ్డాను. "అయితే డాక్టర్ నాకు చూపుపోయిందా" అన్నాను రోదిస్తున్న హృదయంతో. డాక్టరు తడబడ్డారు. "అంటే... అంటే... పోయిందని కాదు. పోతుందేమోనన్న భయంతో తగిన జాగ్రత్తలు తీసుకున్నాం." అన్నారు అనునయంగా. అప్పటికిగానీ నాకు జ్ఞాపకము రాలేదు. "నాకేమీ కన్పించటంలేదు" అని అరచి తెలివి తప్పిన సందర్భం. డాక్టరు వెళ్లిపోయారు. మళ్లీ కోకిలకంఠం.

'మీకేం కావాలన్నా నన్ను పిలవండి' అందామె.

'మీపేరు' అనడిగాను.

'కిరణ్మయి' అంది. పేరు యెంతో బాగుందనుకున్నాను. మధ్యాహ్నం పాలు రొట్టె తెచ్చిందామె. నాకు రొట్టె సరిపడదు. యీ మాట చెప్పాను. ఒంట్లో జ్వరం వుంది. యీ పూట తీసుకోమని బ్రతిమాలింది. తినిపించింది. "కిరణ్మయిగారూ, నాకు కళ్లు మళ్లీ వస్తాయంటారా!" అని పిచ్చిగా అడిగాను. పూర్తిగా పుట్టుగుడ్డినయినా యింత బాధనిపించదు కానీ, కొంత వెలుగు చూసిన రంగుల ప్రపంచం నుండి అనుభవం పెనవేసుకున్న జాతి జీవిత దృశ్యాలను చూసిన మనస్సు అంధకారంలోకి పోవడానికి మనస్కరించలేదు.

ఆ ఆలోచనతోనే దుఃఖం వచ్చేసింది.

'మీరు అధైర్య పడకండి. తప్పకుండా వస్తాయి. మీకు కళ్ళువచ్చే పూచీ బాధ్యతనాది.' అందామె నా చేతిని మృదువుగా నొక్కుతూ.

సాయంత్రం శ్రీకాంత్ వచ్చాడు. ఆప్యాయంగా శరీరాన్ని నిమురుతూ "గొప్ప ప్రమాదం జరిగిపోయింది. విన్నాను. భగవంతుడు త్వరలోనే నీకు స్వాస్థ్యత చేకూరుస్తాడు. నీకేం భయంలేదు. అన్నిటికీ నేను వున్నాను." అన్నాడు. "శ్రీకాంత్ నాకు నిజంగా కళ్లు వస్తాయనుకుంటావా" అని బావురుమన్నాను. "జీవితంలో చీకటి చూడటం తటస్థిస్తే, నా జీవితంగూడా చీకటిలోనే కరిగిపోతుంది" అన్నాను శ్రీకాంత్‌ని కౌగలించుకుంటూ. "మిస్టర్ రవీ మీరు విపరీతంగా ఆలోచించవద్దని, మానసి

...ంగా బాధపడవద్దని డాక్టరుగారు చెప్పారు. అలా బాధపడితే మెదడు నాళాలద్వారా కండ్లకు మరీ బాధ కలుగవచ్చు.'' అంది కిరణ్మయి, యింజక్షనిస్తూ. ''నిజమే. మానసికంగా ఆలోచనలు పెట్టుకోకు. వారి సలహాను పాటించు'' అన్నాడు శ్రీకాంత్. కాంత్‌ని కిరణ్మయికి పరిచయం చేశాను. కాస్సేపు పిచ్చాపాటీ మాట్లాడిన తరువాత, శ్రీకాంత్ వెళ్లిపోతూ, 'నువ్వేమీ అధైర్యపడకు నీకోసం ప్రాణం యిచ్చేస్తాను. నన్ను తమ్మునిగా బావించు యింటి నుండి భోజనం పంపిస్తాను'' అన్నాడు.

మా వార్డులో అప్పుడప్పుడూ రోగులు వచ్చి పోతూ వుండేవారు హాస్పటలు నాకో కొత్త ఫిలాసఫి నేర్పింది. వీటన్నిటికీ అతీతంగా, మనస్సును కిరణ్మయి దూరంగా తీసుకుపోయేది. వేడినీళ్లతో స్పంజింగ్ యిచ్చేది. శ్రద్ధగా నా అవసరాలు కనుక్కునేది. వేడి వేడి భోజనం కొసరి, కొసరి తినిపించేది. ఆ సమయంలో మా అమ్మ స్వరూపం టీవిగా కన్పించేది. వద్దన్నా పళ్లూ, అవీ తెచ్చి యిచ్చేది.

''మీకు చాలా రుణపడిపోతున్నాను కిరణ్మయీ'' అనేవాడిని. ''మీరు భలేవారే. యిది నా డ్యూటీ'' అనేది నవ్వుతూ. అయినా అంతరాంతరాల్లో నాకు కళ్లు రావనే అపనమ్మకం కలిగిపోయింది. మెల్లగా స్లీపింగు టాబ్లెట్లు సంపాదించాను, జీవితపు పరిహద్దుల్ని దాటిపోవాలని. శ్రీకాంత్ రోజూ సాయంకాలం వస్తూ వుండేవాడు. సరదాగా కాలం గడిచిపోయేది. కొన్ని రోజుల తరువాత నాకండ్ల కట్లు, చీకటి గదిలో విప్పారు. వెలుగును చూడ మన్నారు, నాకు కన్పించలేదు. ఏడుస్తూ డాక్టరు చేతులు పట్టుకున్నాను.

కిరణ్మయి

'అధైర్యం రోగాన్ని రెట్టింపు చేస్తుంది. మా ప్రయత్నాలు చేస్తున్నాం. ఏరో పది హేను రోజుల్లో కళ్లు తప్పకుండా వస్తాయి. మాతో కోపరేట్ చెయ్యండి'. అన్నారు డాక్టరు వోదారుస్తూ. అప్పటికే నేనొక నిర్ణయానికి వచ్చేశాను. శ్రీకాంత్‌ని కౌగలించుకుని ఆఖరిసారిగా యేడ్చేశాను.

ఆరాత్రి, అర్ధరాత్రి గుప్పెడు స్లీపింగు పిల్సు తీసుకోబోతున్న నా చేతిని, ఒక మృదుహస్తం బలంగా ఆటంకపరచింది.

''నేనింకా బ్రతికే వున్నాను. ఆత్మ హత్య మహా పాపం'' అంది కఠినంగా. ఆమెలో అలాంటి కాఠిన్యత వినడం అదే మొదటిసారి. సముద్రం చెలియలి కట్ట దాటి పోయినట్లయింది నాకు దుఃఖం.

''నా కెవ్వరూ లేరు. నేనెందుకు బ్రతకాలి. ఈ అంధకార ప్రపంచం నాకెందుకు. అందులోనూ, యిలాంటి పరిస్థితిలోనూ, యివాళ మీ రాపినా యెపుడో ఒకరోజు చచ్చిపోతాను.'' అన్నాను శోకిస్తూ.

''యెవ్వరూ లేకపోవట మేమిటి. నేను మీకేమీ కానా. మేమంతా మీకు వున్నాం.'' అందామె. ''అయినా జీవితంలో అంత పెసిమిజం పనికిరాదు'' అంది చివరిసారిగా.

''నైరాశ్యత కాకపోతే నాకు మిగిలిందేమిటి?''

''మీకు మిగలని దేమిటో చెప్పండి.'' యెదురు ప్రశ్న. యేం సమాధానం చెప్పను.

చాలా క్షణాలు మా యిద్దరి మధ్యా నిశ్శబ్దం రాజ్యంచేసింది. క్షణమాగి, అకస్మాత్తుగా, ''కిరణ్మయీ! నా జీవితంలో నీవు ప్రవేశించగలవా!'' అని అడిగాను, ఆవేశంగా... తర్వాత యెందుకు అడిగానా అని సిగ్గుపడ్డాను. కొన్ని క్షణాలసేపు ఆమె మాట్లాడలేదు. ఆమె ఆలోచిస్తున్నదను కుంటాను. చివరకు మెల్లగా నా చేయినొక్కుతూ, ''ఓ! తప్పకుండా. కానీ నేను మీ కులంకాదుకదా?'' అంది. ''నాకు అలాంటి చాదస్తాలు లేవు. మంచి గంధంలాంటి మంచి మనస్సు, మానవతే మనిషికి కులం వంటివి'' అన్నాను.

''కానీ ఒక్క షరతు. మీరు జీవితంలో నైరాశ్యత చంపుకోవాలి. యెలాంటి విషమ పరిస్థితుల లోనూ, ఆత్మహత్యకు ప్రయత్నించకూడదు. మీకు కళ్లు తప్పకుండా వస్తాయి'' అంది, ఒట్టు వేయించుకుంటూ.

నాలో వేయి యింద్ర ధనస్సులు వెల్లి విరిశాయి. నా జీవితానికి ఒక నిర్దిష్టమైన మార్గం యేర్పడుతుందని పొంగిపోయాను. పంచ పంచ ఉషఃకాలంలో మంచు బిందువులు విరిసిన మల్లె మొగ్గని తాకినట్లుగా నా హృదయం అనుభూతి పొందింది. ఒకనాటి సంధ్యారాగంలో ఆమె నాకు మందు తాగిస్తూ వుండగా 'కిరణ్మయీ, నువ్వెలావుంటావు' అని అడిగాను, అంధకారమైన, నా వూహాల వూయెలలో కిరణ్మయి స్వరూపం వూహించుకుంటూ.

''దేవతలా'' అంది కిలకిల నవ్వుతూ, మృదువుగా నా చేయిని విడిపించుకుంటూ.

''కిరణ్మయీ'' అని పిలిచాను. ఆమె పలికింది.

''నా గురించి నీకేమనిపిస్తోంది. చెప్పు'' అని అడిగాను.

''చెప్పనా'' అంది. నేను ఏరేనన్నాను.

''జీవిత పోరాటంలో, బాగా అలసిపోయి, ఎడారిలో పయనిస్తూ, చల్లని నీడవంటి హృదయం, చల్లని నీళ్లు కావాలనుకునే వ్యక్తి'' అంది ఆర్ద్రంగా.


నేనెపుడో కిరణ్మయితో జీవితం వూహించుకున్నాను. చక్కని యిల్లు, చుట్టూ ఫెన్సింగు, గార్డెను, పగలల్లా వుద్యోగం చేసి, సాయంకాలం అలసటను తప్పనిసరిగా తీసుకొచ్చే వదనారవిందాలు, మల్లెపూలు, సన్నజాజులు, చిలిపి కయ్యాలు. యివన్నీ ఆమెతో చెప్పాను. ఆమె శ్రద్ధగా వింది. క్షణంలో ఆమె కన్నీరు నా ముంజేతిమీద వేడిగా పడింది.

'కిరణ్మయీ యేడుస్తున్నావా' అనడిగాను. ఆమె తడబడుతూ ''లేదు. లేదు. యేదో అవ్యక్తానందంలో ఆనందభాష్పాలు'' అంది.

తర్వాత శ్రీకాంత్ వచ్చాడు. అతనితో యీ విషయం చెప్పాను. అతను చాలా సంతోషించాడు. 'కిరణ్మయి నా జీవితంలో వెలుగు నింపుతున్నాదోయ్' అన్నాను గర్వంగా. ''రేపు నీకు డాక్టరు కట్లు విప్పుతాడు'' అన్నాడు శ్రీకాంత్. నా గుండెల్లో రైళ్లు పరిగెట్టాయి.

ఆరాత్రి నాకు కిరణ్మయి భోజనం తినిపిస్తున్నది. చేతుల గాజులు గలగల శబ్దం, మంజులంగా విన్పించింది. ఆ ప్రదేశమంతా సెంటు వాసనలతో ఆహ్లాదంగా వుంది.

'కిరణ్మయీ! మస్లిలో వచ్చావా. పోలీసువాళ్ళు ఉపయోగించే సెంటు ...'' నవ్వుకుంటూ అడిగాను. ''... ... అయిపోయింది'' ... వెలుగు... ...



"కిరణ్మయీ, రేపు నాకట్లు విప్పుతారు. రేపు నీ ముఖమూ చూడను. ముందుగా, చిరునవ్వులు చిందులాడే, నీ మనోహర వదనారవిందాన్ని చూడాలి. నువ్వు నా దగ్గిరే వుండాలి, ఆ సమయమున" అన్నాను ఆమె చేయి పట్టుకుంటూ.

"ఓ. తప్పకుండా" అంది, తటాలున ఆమె నా నుదుటన్ని ముద్దు పెట్టుకుంటూ.

మర్నాడుదయం, నా మనస్సెంతో, ఆహ్లాదకరంగానూ, ఆందోళనకరంగానూ వుంది. డార్క్ రూమ్‌లోకి తీసికెళ్లారు. కట్లు విప్పారు. కాంతిని చూడమన్నారు. నాకేమో ముందు మసగ, మసగ్గా కన్పించింది. యెంతో ఆదుర్దాగా చూశాను. కొంత సేపటికి కాంతి కిరణాలు కన్పించాయి. బయటకు వచ్చాను. పచ్చని లాన్సులో వున్న క్రోటన్ మొక్కలు, చిరుగాలికి వూగుతూ, మళ్లీ కాంతివంతమైన రంగుల ప్రపంచంలోకి నన్నాహ్వానించాయి.

'హలో' అన్నాడు శ్రీకాంత్. ఫుల్‌సూట్‌లో వున్నాడు. 'విష్‌యూ గుడ్ హెల్త్ అండ్ హాపీ లైఫ్' అంటూ గులాబీ పూలతో తయారుచేసిన బొకే యిచ్చాడు. ఆనందంతో శ్రీకాంత్‌తో కరచాలనం చేశాను. నా మనస్సంతా కిరణ్మయినే చూడాలనివుంది. ఆమె వార్డులో యింఛార్జిగా వుంటుం దీపాటికి.

"పద. నా కిరణ్మయిని చూడాలనివుంది. యీ రోజునుండీ నా జీవితంలో నూతనాధ్యాయం ప్రారంభమవుతుంది. ఆమెకు కానుకగా, యీ గులాబీలివ్వాలి." అన్నాను అడుగు ముందుకువేస్తూ.

"సారీ" అన్నాడు శ్రీకాంత్. అంతే! వేసిన అడుగు ఆగిపోయింది.

'యేం' అన్నాను సందేహంగా అతని వంక చూస్తూ.

'ఆమెకు హైద్రాబాద్ ట్రాన్స్‌ఫరయిపోయింది. నిన్నరాత్రి జనతాకు వెళ్లిపోయింది' అన్నాడు.

నా కాళ్లకింద భూమి బద్దలైనట్లుగా భావించాను.

"నేను నమ్మిన, నన్ను నమ్మించిన కిరణ్మయి నాకు మోసం చేసిందా శ్రీ...." అన్నాను నీరసంగా.

యిద్దరం కలిసి మౌనంగా నడుస్తున్నాం. వేలినున్న కెంపు వుంగరం సూర్యకాంతికి మెరుస్తున్నది. "నీకో విషయం చెబుదామనుకుంటున్నాను. యేమనుకోవద్దు" అన్నాడు శ్రీకాంత్. అతని కళ్లలో నీళ్లు చక్రాల్లా తిరుగుతున్నాయి.

"ఆమె నిన్ను మోసం చేయలేదు. సెంటిమెంటల్‌గా బాధపడుతున్న నీకు, విపరీతమైన ఆలోచనలవల్ల, నీ మెదడులో కంటి సంబంధమైన రక్తనాళాలు దెబ్బతింటా యేమోనన్న భయంతో, నిన్ను రక్షించింది. నీకు చూపువచ్చేటట్లుగా చేసింది" అన్నాడు శ్రీకాంత్.

"అయితే మరి....." నా ప్రశ్న పూర్తికాలేదింకా.

"నేను యీవూరినుండి ఒకటి రెండు రోజులలో వెళ్లిపోతున్నాను రవీ! కిరణ్మయి నాభార్య" అన్నాడు శ్రీకాంత్ నన్ను కౌగలించుకుంటూ... ●

ఆర్టెక్‌లో నా అనుభవాలు



అనిలాఖన్నా

[ఢిల్లీకు చెందిన అనిలాఖన్నా పద్నాలుగేళ్ళ చిన్న వయస్సులో తను గీచిన 'పెయింటింగ్సు'కు ఒకే సంవత్సరంలో, జెకోస్లోవేకియా నుండి రష్యానుండి రెండు బహుమతుల నందుకుంది. సోవియట్‌లాండ్ నెహ్రూ అవార్డువారు ఒకనెలరోజులు రష్యాలో తిరిగిరావడానికి కావలసిన అన్ని సదుపాయాలు చేశారు. ఈ సందర్భంలో బహుమతుల నందుకొన్న మరికొంతమంది మిత్రులతో రష్యాలోని ఆర్టెక్‌లో గడిపి వచ్చిన అనిలా తన అనుభవాలను ఇంగ్లీషులో వ్రాసింది. 'సందేష్' అనే స్కూలు పత్రిక దీనిని ప్రచురించింది. క్రింది వ్యాసం రచయిత్రి అనుమతిపై ఇంగ్లీషు వ్యాసానికి తెలుగు అనువాదం...]

నల్లసముద్రతీరంపై మూడువైపులా పర్వతాలతో ఆవరింపబడిన ఆర్టెక్ క్రిమియాలో ఉంది. ఆర్టెక్‌ను సందర్శించగానే, అందులో ప్రత్యేకంగా పయొనీర్ క్యాంపులలో అడుగు పెట్టగానే అందాల స్వర్గంలో ఉన్నామా అనిపిస్తుంది.

క్రిమియాలో ఉన్న పయొనీర్ క్యాంపులలో కల్లా మార్క్స్‌కోయ్ క్యాంపు చాలా పూర్వానిదిన్నీ, ఆర్టెక్ క్యాంపు అన్నిటిలోను సముద్రానికి దగ్గరైన దీను. నేను నా నల్గురు భారతీయ స్నేహితులతోను మార్క్స్‌కోయ్ క్యాంపులో బస చేశాను. ఇందులో ఒక్కసారిగా అయిదువందల మంది పయొనీర్లు ఉండవచ్చు.

ఈ షిఫ్ట్‌కు ఈ క్యాంపులో ఉన్న విదేశీయ బృందం మాదొక్కటే. తమ తల్లితండ్రులతో సోవియట్ యూనియన్‌లో నివసిస్తున్న బ్రెజిల్, యుగోస్లావియా, ఆఫ్రికా, జర్మన్ డెమోక్రాటిక్ రిపబ్లిక్ పిల్లలు కూడా మాతోపాటు ఈ క్యాంపులో బస చేశారు. రష్యాలోని ఒక్కొక్క రిపబ్లిక్ నుండి వచ్చిన పయొనీర్స్ కూడా ఇందులో ఉన్నారు.

మొట్టమొదటి రోజునే రకరకాల దేశాల పిల్లలు ఒక్కసారిగా చుట్టుముట్టడం మాకెంతో వింత గొల్పింది. వాళ్ళంతా మమ్మల్ని గురించి తెలుసుకోవాలని మాకు వాళ్ళను గురించి తెలియచేయాలని ఎంత ఆతృతగా ఉన్నారో! కొంతమంది రష్యన్ పయొనీర్లకు కొద్దిగా హిందీ కూడా వచ్చు. వాళ్ళతో మాట్లాడడం ముచ్చటగా ఉండేది. ఒక్కొక్కప్పుడు ఒకళ్ళనొకళ్ళు సంజ్ఞలతో అర్థం చేసికొనే వాళ్ళం. కాని మాకు వచ్చీరాని పదాలతో మాట్లాడుకోవడమే ఎంతో సరదాగా వుండేది.

ఏదైనా చెప్పాలంటే వాళ్ళు ఒక పదం ఒకళ్ళు, రెండోవాళ్ళు ఇంకో పదం, మూడవది మరొకరు ఇలా చెబుతూ ఆఖరు కొకళ్ళు వాక్యాన్ని పూర్తి చేసే వాళ్ళు. ఇలా చెప్పేటప్పుడు నేను నేర్చుకొన్న కాస్త రష్యనుతో వాళ్ళకు సాయపడేదాన్ని. అలా మాట్లాడుకుంటూ మేమంతా ఎంతో సన్నిహితలమయ్యాం. ఒకళ్ళనొకళ్ళు అర్థం చేసుకుని ఎంతో సంతృప్తి పొందాం. నిజం చెప్పాలంటే ఇనుపగోడను బేధించుకొని మరీ అవతలున్న పిల్లలతో జత చేశామని, చెప్పొచ్చు.

వెళ్ళేటప్పుడు నాతోపాటు ఆ పిల్లల కోసం ఎన్నో రకరకాల బహుమతులు పట్టుకెళ్ళాను. రకరకాల గాజులు, ప్లాస్టిక్‌వి, గాజువి, రబ్బరువి, నెక్లెసులు, నత్తగుల్లలు, ఉంగరాలు, కురిస్క్రియ గడ్డితో చేసిన చాపలు, ఇండియాకు చెందిన,ముద్రలు పడినవి కొన్ని, ముద్రలు పడనవి కొన్ని స్టాంపులు, పిక్చరుపోస్టు కార్డులు, రకరకాల ఇండియన్ నాణాలు, ముఖ్యంగా నెహ్రూ నాణాలు తీసుకు వెళ్ళాను. మా స్నేహితులలో ఒకరు పాలరాతితో చేసిన తాజమహల్ తెచ్చారు. చక్కగా చెక్కిన గంధపు చెక్కబొమ్మలు కూడా మేం తీసుకెళ్ళాం. ఆ పిల్లల కవన్నీ ఎంతో అద్భుతాలుగా కన్పించాయి. గాజుతో చేసిన గాజులు వాళ్ళ కపురూపం అనిపించాయి. గలగలమనే ఆ గాజుల ధ్వని వాళ్ళ నెంతో ఆకర్షించింది. మేమవి వాళ్ళకు బహుమతి ఇవ్వగానే గంతులు వేసుకుంటూ అందరికి అవి చూపించుకొని మురిసిపోయారు. వాళ్ళూ, మేమూ, స్టాంపులు, నాణాలు

అనిలాఖన్నా

మార్చుకొన్నాం. వాళ్ళు మాకు రష్యన్ సావనీర్లు బహుమతిగా ఇచ్చారు.

క్యాంపు పాటలు మాకెంతో నచ్చాయి. పయొనీర్లు బస్సులో వెళ్ళినా, నడకన వెళ్ళినా, ఈ పాటలు పాడుతుండేవారు. మాకు వాటి కర్థం తెలియక పోయినా, మేంకూడా కలిసి పాడ ప్రయత్నించే వాళ్ళం. ఈ పాటలు ముఖ్యంగా ఆర్టెక్‌లో జరిగే స్నేహాలు, ఆర్టెక్‌ను గురించిన పొగడ్తలు, ఆర్టెక్ నానుకొని అందంగా కన్పడే నల్లసముద్రాన్ని వర్ణిస్తూ వుండేవి. ఆర్టెక్‌లోని ఆర్ట్ డైరెక్టరు, ఆర్టెక్ పాటలు రికార్డ్ చేసిన టేప్ ఒకటి నాకు బహూకరించారు. బదులుగా నేను, నా డాన్స్ ప్రోగ్రామ్‌కు రికార్డు చేయబడిన హిందీ పాటలు ఆర్కెస్ట్రా ఉన్న టేప్ ఆయన కిచ్చాను. వాళ్ళు పాటలు ఇండియాలో కూడా వినగలనని ఎంత సంతోషమయిందో నా కప్పుడు. నేనా టేప్‌ను పయొనీర్లందరి జ్ఞాపకార్థం ఎంతో భద్రంగా దాచుకున్నాను.

నల్లసముద్రతీరంపై బస చేసిన మాకు ఆ సముద్రం ఒక ప్రియమిత్రుడయ్యాడు. తీక్షణమైన ఎండకు వేడిపడ్డ నీరు మాకెంతో ప్రియంగా వుండేది. అటువంటి సమయంలో ఈత కొట్టడం ఎంతో ఆనందదాయకంగా వుండేది. మేము ఈత కొట్టిన చోట ఒకవైపు లేత నీలిరంగు మరొక వైపు ముదురు ఆకుపచ్చ రంగుతో ముచ్చటగా కన్పడేది సముద్రం. మేము తెడ్లు వేసుకొని సముద్రంపై 'బోటింగ్' చేసేవాళ్ళం. తీరంలోని రాళ్ళపై నడుస్తూ ఎండ్రకాయలను పట్టుకోవడానికి రెండు, మూడు కిలోమీటర్లు నడచి వెళ్లేవాళ్ళం. ఒకోరోజు అయిదు గంటలకే లేచి చేపలు పట్టడానికని వెళ్లే వాళ్ళం. మేము తినడానికని మేము పట్టిన చేపలు మాకే ఇచ్చేవాళ్ళు. సూర్యాస్తమయం తర్వాత గంటల తరబడి అలా సముద్రతీరంలో కూర్చుని కాలం గడిపేవాళ్ళం. పెద్దపెద్ద కెరటాలతో సముద్రం ఘోషిస్తూంటే చూడడానికెంతో బాగుండేది.

బిగ్‌బేర్ మౌంటెన్ సముద్రాన్నానుకొని ఎలుగుబంటి ఆకారంలో నీళ్ళు త్రాగుతున్నట్లు కన్పిస్తుంది. క్యాంప్ ఫైర్ ప్రోగ్రామ్‌లు ఈ పర్వతం దగ్గరలో సముద్రతీరంపై జరిగేవి. ఇవి మాకెంతో నచ్చాయి. ఇందులో పయొనీర్లు ఉపన్యాసా లిచ్చేవాళ్ళు. మేము కూడా మమ్మల్ని గురించి భారతదేశంలోని పట్టణాల్ని గురించి, మన ఆచారాలను గురించి, సాంప్రదాయాలను గురించి మాట్లాడాం. క్యాంప్ ఫైర్ రాత్రి పదిగంటల వరకు వెలిగింది.

నేనిక్కడ గడిపిన నెలరోజులు అద్భుతంగా గడిచింది. నెలరోజులు గిర్రున తిరిగిపోయాయి. క్రిమియాలో చాలా ప్రదేశాలు మేము సందర్శించాం. నేనక్కడ గడిపిన ప్రతిరోజూ నాకు జ్ఞాపకం వుంటుంది. ●

అనువాదం: ఉషారాణిభాటియా.



ఆర్టెక్‌లో తన స్నేహితులతో అనిలా—పైనుండి రెండు.

కర్మ - కాటకం

*ఈవారఫలాలున్నాయే—వాటి జోలికి పోనేకూడదు, పోయామో—ఒకవేళ ఏదేనా చెడు రాశాడా అంటే మనసుకి పట్టి మరి వదలదు.

నక్షత్రం లేకపోతే నామనక్షత్రం అన్నారు. కాని, అదేమంత కరెక్టుగా ఉండదని—ఒకతోసివేత. ఈతోసివేతలూ తీసివేతలూ ఎలాగున్నా ఈమాట మాత్రం నిజం.

'నీచుడితో కలహం' అని రాశాడు జోస్యుడు, నా నక్షత్రానికి.

ఎవడా నీచుడు?—ఏమా కలహం?—

మనోవేదనా ప్రారంభం.

* * *

ఉన్నపాటున వచ్చిపడ్డాడు, మా వారఫలాల శర్మ!

ఉగ్రుడై వున్నాడు, రుద్రుడై వున్నాడు. చేతిలో నలిగి నల్లనై వున్న పేపరు!—

పరిస్థితి పసికట్టా, కనిపెట్టా. సందర్భం అర్థంచేసుకున్నా, "బోయ్, కాఫీ!"—అన్నా. శర్మ అటెన్షన్ చెదరలేదు.

"ఏమండీ, మీ ఆఫీసులో అచ్చుతప్పులు దిద్దరా?" అని అడిగాడు.

"దిద్దకేం, పదిమంది ప్రూఫ్—రీడర్లున్నారు" అన్నా.

"అయితే, ఇదేమిటి?— అని వారఫలాల కింద పేరు చూపించాడు. 'శర్మ' పేరు 'కర్మ' అని పడింది.

కంపోజిటర్ మున్సామిని పిలిచా. అడిగా, మేటరు తీసుకొచ్చి చూపించాడు. స్క్రిప్టులో ఒహలా చూస్తే 'క'లాగే వుంది.

"పొరపాటు.."అన్నా, ఇద్దరికీ వర్తించేలా.

శర్మకి తృప్తి కలగలా.

"ఏదో, హడావిడిలో రాస్తే అంతేనుటండీ? కాస్త చూసుకో నక్కర్లా? ఎడిటర్లు మీరుండి ఏం చేస్తున్నారండీ?—ఆమాత్రం తెలీకుండా పత్రికేం నడుపుతున్నారండీ? పలుగురూ నన్నడుగుతున్నారు. మీకేం మీరు బాగానే వున్నారు." అంటూ నాలుగూ దులిపి దుళ్ళగొట్టాడు.

చనువుందిగా?—అదే ఫోర్సుతో కంపోజింగులోకి వెళ్ళాడు. వాళ్లకి తలాకాసినీ ఆశీర్వచనాలు...తగిలాయి.

వెంటనే ప్రూఫ్—రీడర్లుండే సెక్షనుకువెళ్ళాడు. అక్కడ ఒక్క చెవిటాయన తప్ప మరెవరూలేరు.

శర్మ ఎన్ననుకున్నా చెవిటాయన చలించలేదు. పోనీ, వినబడలేదని వూరుకున్నాడా?—"శర్మగారూ ఖులాసా?— మీ వారఫలాలు చూసుకున్నారా?— ఈవారం నాకేం బాగా రాయలేదు....." అంటూ పరామర్శ చేశాడు.

శర్మకి మరింత ఇదయింది.

మళ్లీ నాదగ్గరికి వచ్చాడు.

"శర్మగారూ. ముందు కాఫీ తీసుకోండి, చల్లారిపోతూంది!" అన్నా. ఒద్దన లేదు. ఉష్ణం ఉష్ణేన శీతలం అన్నట్టయింది.

"శర్మగారూ!—మీ రాశేమిటి?" అనడిగా.

"కర్కాటకమ్. ఏం? ఎందుకూ?"—అన్నాడు.

"ఈజిట్?—అలా చెప్పండి, నాదీ కర్కాటకమే. అందుకనే అనుకుం—ఈకలహం?"

కాస్సేపు కూర్చుని, శర్మశాంతించి వెళ్లిపోయాడు. ఆయన వెళ్ళాక మళ్లీ వారఫలాలు తీసిచూశా. 'నీచుడితో కలహం.'

కలహం—సరేసరి.

పోతే, మరి ఆ నీచుడెవరు?—

శర్మా? నేనా?— ●

సుప్రభాతం

(సీరియల్)

రంగధామ్

జరిగిన కథ

సత్యమూర్తి, ప్రకాశం చిన్ననాటి స్నేహితులు. చాలాకాలానికి అనుకోకుండా కలిశారు. సత్యమూర్తి ప్రకాశం సుగర్ ఫ్యాక్టరీలో అకౌంటెంటుగా చేరాడు. ఆ చుట్టుప్రక్కల ప్రకాశానికి ఎక్కువ పరపతి వున్నట్టు గ్రహించాడు సత్యమూర్తి. ప్రకాశం, రామదాసుకు సంబంధించిన జాడ తెలియని ఒక అమ్మాయికోసం వెదుకుతున్నాడు. ఆ అమ్మాయిని వశపరచుకుంటే కావలసినంత ఆస్తి దక్కుతుంది. అనంతరావుగారు దామోదరాన్ని భానుమతికి పరిచయంచేశాడు. అతను రామదాసు మరణవార్త భానుమతి చెవిన వేశాడు.

12

భానుమతి, బాబాయి గురించి దామోదరం చెప్పిన మాటలు విన్న దగ్గర్నుండీ ఒక కొత్త మనిషైంది. మునుపటి చురుకుతనం, తీవ్రాలోచనగా పరిణమించింది. పైవారికి ఆమెలో మునుపటి ఉత్సాహం నశించి ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లు తోచసాగింది. ఆమె చిన్నతనం నుండీ ఒక విధమైన ప్రపంచానికి చెందిన దానిననుకొని పెరిగింది. కాని ఇప్పుడు తన ప్రపంచమే వేరని తెలుసుకుంది. అంతేకాక, తన కర్తవ్యాలు కొన్ని తీవ్రతరమైనవి వున్నాయని గ్రహించింది. తన తలిదండ్రులం గురించి పూర్తి వివరాలు తెలుసుకోవాలనే కోరిక ప్రబలమవసాగింది. తనను ఇతరుల వద్ద పెంచడానికి కారణమేమిటి? పైగా ఏనాడూ బాబాయే తన అసలు తండ్రి అని తనను పెంచుతున్నవాళ్ళెందుకు చెప్పలేదు? బాబాయికి తనయందు గల అభిమానం తెలుస్తూనే వుంది. తనకే లోటూ జరగకుండా ఎప్పటికప్పుడు డబ్బు పంపించడంలో ఆయనకు గల ప్రేమ వ్యక్తమౌతోంది. ఆయన ప్రేమమూర్తిగా తన మనసులో చిరస్థాయిగా నిల్చిపోయారు. తానెరుగని తన తల్లికి కూడా ఆయనే ప్రతిస్వరూపం. ఆయన మరణ వార్త నిజం కాదేమోనని తనకు చాలాసార్లు అనిపిస్తుంది. ఏదో ఒక రోజున హఠాత్తుగా ఆయన వస్తారేమోననే ఆశ కలుగుతూండేది. మళ్ళీ దాని వెనకాలే గుండెలు బ్రద్దలయ్యే నిరాశ, ఆయన మరణాన్ని ధ్రువపరుస్తూ దామోదరం చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చి కలుగుతూండేది. అది కలుగగానే ఆమెకు పట్టలేని దుఃఖం వచ్చేది. కాని ఏడవడానికి కూడా అంతగా వీలులేదు. దాని వలన తనను పెంచుతున్న వాళ్ళ కనుమానం కలుగవచ్చు. వాళ్ళతో ఈ విషయాన్ని భానుమతి చర్చించదల్చుకోలేదు. వాళ్ళు తనకు మహోపకారం చేశారు. బాబాయి కష్ట దినాల్లో తన బాధ్యత వాళ్ళు స్వీకరించారు. తనకా విషయం తెలియనట్లుగా నటిస్తేనే వాళ్ళకు మనశ్శాంతి వుంటుంది. వాళ్ళ మనశ్శాంతిని భంగపరిచి నందువలన కలిగే లాభమేమీ లేదు. అందువల్ల ఆమె, రాత్రి వాళ్ళు నిద్రపోయాక ఈ విషయాన్ని తల్చుకుంటూ ఏడుస్తూండేది. జీవితంలో తను ఒంటరిననీ, తనను కన్నవారు గతించారనీ జ్ఞాపకం వచ్చినపుడల్లా ఆమెలో దుఃఖం పొంగి వస్తూండేది. ఒక పర్వత శిఖరాగ్రంపై నుల్చుని అటు విశాలాకాశాం, ఇటు అంతులేని అగాధం చూస్తూ భయంకరమైన ప్రకృతిలో వంటరిగా, నిస్సహాయగా, చిక్కుకున్న వ్యక్తిలా వుండేది ఆమె మనస్థితి. ఆ సమయంలో ఆమెను కాపాడినదల్లా, చిన్నప్పటి నుండీ తనను పెంచిన వారు నేర్పిన భగవద్భక్తే. భగవంతునిపై అచంచల విశ్వాసంతో ఆమె జీవితాన్నె దుర్కోదలచింది. ఒకవారంరోజులు ఆమె జీవితంలో మొదటిసారిగా, ఆమె పరధ్యానంలోనూ విచారంలోనూ గడిపాక, మెల్లిగా తనంత తనే మామూలు పరిస్థితికి రాసాగింది. ఉమ యొక్క సానుభూతీ ఓదార్పూ, ఆమె హృదయంలో కలిగిన గాయాన్ని మెల్లిగా మాన్పసాగాయి.

ఆమెలో అనేక ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. అన్నిటికన్నా ముఖ్యమైనది బాబాయి చనిపోయి మూడేళ్ళయితే ఇన్నాళ్ళూ మౌనంగా వుండి దామోదరం ఇప్పుడీ విషయం బయట పెట్టడానికి కారణమేమిటి? అసలు అతనే గనక నిజమైన మిత్రుడైతే, బాబాయి చనిపోయిన వెంటనే తనకు తెలియపరిచి వుండేవాడు, మూడేళ్ళు ఆలస్యం చెయ్యడానికి గల కారణమేమిటో ఆమెకు బోధపడలేదు. అంతేకాక, బాబాయి చనిపోతూ వెలిబుచ్చిన కోరిక రూపంతో తనను దామోదరం లొంగదీయడానికి కూడా ఏదో ఒక కారణం వుండి తీరుతుందని ఆమెకు తోచింది. అనంతరావుగారు చెప్పిన మాటల్ని బట్టి దామోదరం సామాన్యుడు కాడని తెలుసుకుంది. అతనితో వ్యవహరించేటప్పుడు ఎంతో జాగ్రత్తగా వుండాలని నిశ్చయించింది.

రెండవసారి దామోదరం ఆమెను కలుసుకున్నప్పుడు ఆమె మౌనంగా అతను చెప్పిన మాటలు వినసాగింది. ఆ రోజు ప్రొద్దున్నే దామోదరం తను విశాఖపట్నం వస్తున్నాననీ తనను కలుసుకోవడానికి హోటలు ఉటీలో 3 నెంబరు గదికి రమ్మని, రెండురోజుల ముందర ఆమెకు వుత్తరం రాశాడు. కాని దానికి జబాబుగా, ఆరోజు సాయంకాలం అనంతరావు గారింట్లోనే తాము కలుసుకోవడం తన కంగీకారమనీ, హోటలుకి తను రాలేనని జబాబు రాసింది. అందువలన దామోదరం సాయంకాలం ఆరుగంటలకి అనంతరావు గారింటికి వచ్చాడు. హాలులో భానుమతి ఒక్కర్తే కూచుంది, ఏదో చదువుకుంటూ. ఎప్పుడూ తెల్లనిబట్టలు ధరించే ఆమెలోని స్వచ్ఛత, పరిస్థితుల వలన కలిగిన గంభీరతతో మేళవించి, సౌందర్యం, నిశ్చలతా, అణచుకుంటున్న ఆవేదనా కలిపి శిల్పి రూపొందించిన విగ్రహంలా వుంది. దామోదరం వస్తూనే ఆమెను, ''అనంతరావుగారు లేరా?'' అని ప్రశ్నించాడు. ఆమె దామోదరం వైపు నిర్లిప్తంగా చూసి 'లేరు' అంది. ఆమె జవాబిచ్చిన విధానం దామోదరానికి ఆశ్చర్యం కలిగించింది. తన యందామె ఇంకా ఎక్కువ గౌరవం, శ్రద్ధా చూపిస్తుందని ఆశించాడు. కాని ఆమె వైఖరి చూస్తే తన రాకకు ఎంతమాత్రం సంతోషించినట్లు లేదు. కాని మనుష్యుల మనస్తత్వాలను కనిపెట్టి వారి కనుగుణంగా మాట్లాడడం అతనికి వెన్నతో అబ్బిన విద్య. ఆమె కెదురుగా సోఫా మీద కూర్చుంటూ ''చూడమ్మా! నేను నీకెంతో దగ్గరవాణ్ణి అయినా ఇంతకాలం దూరంగా వుండిపోవలసి వచ్చింది. నిన్ను వచ్చి కలియాలనీ, చూడాలనీ ఎన్నోసార్లు ఎంతో బాధపడ్డాను. కాని

నాకు తెలుసు నేను నిన్ను కలిసినప్పుడు మీ బాబాయి సంగతి చెప్పక తప్పదు. స్వచ్ఛమైన నీరులా వున్న నీ జీవితంలో రాయి విసిరి, విచారపు టలలను తీసుకురాక తప్పదు. అందుకే చాలాకాలంగా వాయిదా వేస్తూ వచ్చిన ఈ కలయిక తప్పనిసరిగా చివరకు జరగక తప్పలేదు. నీ మనస్సు ఎంతో విచారంలో మునిగి వుంటుంది. కాని నువ్వు వయసులోనూ అనుభవంలోనూ నా కన్నా ఎంతో చిన్నదానివి. నీకీ ప్రపంచపు తీరు తెలియదు. మీ బాబాయికి మిత్రులూ వున్నారు, శత్రువులూ వున్నారు. మిత్రులు ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా శత్రువులు విజృంభిస్తారు. అసలిపాటికే వాళ్ళు తమ దుర్మార్గాలను ప్రారంభించి వుంటారు. వారి నుండి నిన్ను కాపాడడం నా విద్యుక్త ధర్మం. అందుకే నేను ఈ చొరవ తీసుకోవలసి వచ్చింది.’’ అన్నాడు.

‘‘శత్రువులా?’’ అంది భానుమతి ఆశ్చర్యంగా.

‘‘అవునమ్మా. చాలా దుర్మార్గులు. చనిపోయిన అతని మీద వాళ్ళకు గల ద్వేషాన్ని పగనూ, నిన్ను హింసించి నీ మీద తీర్చుకోగలరు. అందుకే నా కిప్పుడహోరాత్రాలూ వారి నుండి నిన్నెలా కాపాడాలా? అన్న ఆలోచన పట్టుకుంది.’’

‘‘ఎవరు వాళ్ళు?’’

‘‘అదంతా ఒక పెద్దకథ. అదిప్పుడు చెప్పలేను. వాళ్ళు తమంత తామే నీకు పరిచయం కావచ్చు. కాని వారి వలలో చిక్కుకున్నామంటే ఏం జరుగుతుందో వూహించలేము. వారికి తగిన శాస్తి నేను చెయ్యగలను కాని దానికి నీ తోడ్పాటు చాలా అవసరం.’’ దామోదరం చెప్పే మాటల తీరులోని విశ్వాసం భానుమతిలో మార్పు తెచ్చింది. బహుశా దామోదరం తను అనుకున్నంత చెడ్డవాడు కాదేమో? పైగా ఒకొక్కప్పుడు ఎంతో చెడ్డవాళ్ళు కూడా కొన్ని విషయాలలో మంచిగా ప్రవర్తిస్తారు. అలాగే దామోదరం, తన బాబాయికి ఆప్త మిత్రుడు కావచ్చు. ఆ స్నేహబంధాన్ని గుర్తుంచుకుని, బాబాయి కోసం ఏ పనైనా చెయ్యడానికి సిద్ధమవుతున్నాడేమో? అతనికి తను తగిన తోడ్పాటు ఇవ్వడమే మంచిదేమోనని ఆలోచించి మెల్లిగా, ‘‘అయితే నన్నేం చెయ్యమంటారు?’’ అంది.

భానుమతి ముఖకవళికల్ని జాగ్రత్తగా కనిపెడుతున్న దామోదరం ఆమె ఆలోచనల్ని కూడా పసిగట్టాడు. ఆమె మెల్లిగా తన దారిలోకి వస్తోందని గ్రహించాడు. భానుమతి అమాయకురాలు కాదనీ, చాలా తెలివైనదని మొదట్లోనే గ్రహించాడు. ఆమెను



సరిగ్గా ఒప్పిస్తే తన గుప్పిట్లో పెట్టుకోవచ్చుననుకున్నాడు. ఇప్పుడు ఆమె తన మాటలకి ప్రాముఖ్యత ఇస్తోంది. మెల్లిగా ప్రారంభించాడు. ‘‘మొదటి విషయం, నీకు తెలిసిన ఈ రహస్యాన్ని మరెవరికీ తెలియనియ్యకు. ఎవరైనా వచ్చి మీ బాబాయి పేరు చెప్పి, ఆయన నీకు తెలుసునా? అని అడిగితే, ‘నాకు తెలియదు’ అని చెప్పు. ఇంత కాలం నాకు తెలిసిన విషయాన్ని నేనెంతో రహస్యంగా వుంచడానికి కారణం, ఈ సంగతి మీనాన్న యొక్క శత్రువర్గానికి తెలిస్తే వెంటనే నిన్ను ఏదైనా చెయ్యడానికి ప్రయత్నించవచ్చునని. వాళ్ళకు చాలామంది అనుచరులున్నారు. నేను నిన్ను కలుసుకుంటున్న విషయం కూడా వాళ్ళకు తెలుస్తుంది. మీ బాబాయికి ఒక కూతురుందని మాత్రమే వాళ్ళకు తెలుసుగాని, అది నువ్వేనని తెలియదు. అలా తెలియకుండా వుండడానికే

నేను ఇంతకాలం నిన్ను కలుసుకునేందుకు వేచిక పట్టాను.'' అని ఆగాడు.

ఆయన మాటలు వింటూంటే తను చాలా ప్రమాదభరితమైన పరిస్థితులలో వున్నట్లు తెలుస్తోంది. అసలు బాబాయే తన తండ్రి అని తెలుసుకున్నప్పుడే మాన సికంగా ఎంతో దెబ్బతింది. దానికి తోడు దామోదరం తన బాబాయికి ఎంతో మంది శత్రువులున్నారనీ వాళ్ళు తన కపకారం చేస్తారనీ చెప్తూంటే, పరిస్థితి క్రమంగా విషమిస్తున్నట్లు తోచింది. ఆమె తన ఆత్రుతను ఆపుకోలేక, ''అసలీ శత్రుత్వం ఎందు కేర్పడింది? ఆయన చనిపోవడంతో అంతం కావలసిన వైరం ఇంకా ఎందుకు కొనసాగుతుంది?'' అని అడిగింది.

''ఆ విషయాలన్నీ వివరంగా చెప్పాలంటే చాలాకాలం పడుతుంది. నేను చెప్పిన మాట ల్లోని సత్యం ఋజువు చేసే విషయాలు నీకు చాలా చూపించాలి. ముఖ్యమైన విష యం ఏమిటంటే మీ బాబాయి ఒక జమీం దారు కూతుర్ని ఎవరికీ తెలియకుండా లేవదీసుకుపోయి వివాహం చేసుకున్నాడు. ఆ పని వల్ల వాళ్ళ వంశానికే మచ్చ వచ్చిం దని ఆ కుటుంబంలో వారు భావించారు. అందుకు ప్రతీకారంగా మీ బాబాయిని అంతమొందించాలని చాలా ప్రయత్నించారు. కాని వాళ్ళ చర్యలను ఎప్పటికప్పుడు తెలుసు

సుప్రభాతం

కుంటూ, మీ బాబాయిని తగురీతిగా కాపాడు కుంటూ నేను ప్రవర్తించ బట్టి వాళ్ళ ఆటలేమీ సాగలేదు. అసలు మీ బాబాయి ఎక్కడున్నాడో కూడా, అతను చనిపోయే దాకా కూడా వాళ్ళకు తెలియకుండా తగిన జాగ్రత్త తీసుకున్నాను. కాని అతని మరణానంతరం వాళ్ళకా విషయం తెలిసింది. నీ విషయం కూడా చూచాయగా వాళ్ళకు తెలుసు. కానీ నువ్వేనన్న విషయం వాళ్ళకు తెలియదు. అది తెలియకుండా వుండాలనే నేను ప్రయత్నిస్తున్నాను. అసలు నువ్వీ ప్రాంతాలలో వుండడం, అవివాహితవై వుండడం అంత శ్రేయస్కరంకాదు. అందుకే నీ భవిష్యత్తును గురించి నేను అనేక ప్రయ త్నాలు చేస్తున్నాను.'' అని దామోదరం భానుమతి వైపు చూశాడు.

వ్యథాభరితమైనా, గంభీర ముద్ర ధరిం చిన ఆమె ముఖంలోని భావాల్ని అంతగా పసి కట్టలేకపోయినా, తన మాటలు ఆమెలో చాలా మార్పును తెస్తున్నాయని గ్రహిం చాడు. ఆమె నిశ్చలంగా అతని వైపు చూస్తూ, ''అసలీ సంఘటన ఏవూళ్ళో జరిగింది?'' అని అడిగింది.

''రామవరం అని ఇక్కడికి మమారు నూరుమైళ్ళుంటుంది.''

''రామవరమా? పేరు బాగా పరిచిత మైనదిగా వుంది.''

''అవును. ప్రతీనెలా నీకు మనియార్డరు అక్కణ్ణించే వస్తుంది కదూ!'' అని దామో దరం చిరునవ్వు నవ్వాడు.

భానుమతి, ''ఆ మనియార్డరు పంపు తున్నది మీరేనా?'' అని అడిగింది. ఆయన ముఖంలోకి చూస్తూ.

''అవును. ఆ ఏర్పాటు చేసింది నేనే'' అని ఆమె వైపు చూడకుండా చెప్పాడు దామో దరం. వెంటనే మళ్ళీ ఆమె వైపు చూస్తూ ''ఆ డబ్బు చాలుతోందా? కావాలంటే, ఇంకా ఎక్కువ పంపిస్తాను'' అన్నాడు.

అతని మాటలు చాలా పేడిగా ధ్వనిం చాయి భానుమతి చెవులో. నిజం చెప్తున్న ప్పుడున్న స్పష్టత వాటిలో లేదు. వెంటనే ఆమె ఆ విషయం పరీక్షకు పెట్టదల్చు కుంది. ''ఈనెల మనియార్డరు ఎప్పుడు పంపుతారు?'' అని అడిగింది దామోదరం వైపు నిశితంగా చూస్తూ.


ఆ ప్రశ్నకు తను వెంటనే జబాబివ్వాలని దామోదరానికి తెలుసు. ఏమాత్రం తాను తడుముకొన్నా ఆమెకు అనుమానం కలుగు తుంది. కాని సాధారణంగా ఆమెకు మని యార్డరు ఏ తారీఖులలో వస్తుందో అతనికి తెలియదు. అయినా, దాని గురించి తరువాత చూసుకోవచ్చునని, ''రేపే పంపిస్తాను.'' అన్నాడు. ఆమె సరేనన్నట్లు తలూపింది.

''ఈ డబ్బంతా మీరు నాకు అప్పుగా ఇస్తున్నదే కదూ?'' అని అడిగింది భాను మతి వెంటనే. ఎందుకంటే బాబాయి బ్రతికి వుండి తనయందు అభిమానంతో డబ్బు పంపిస్తే, ఆ విషయం వేరు. కాని ఆయన చనిపోయాక ఆయన స్నేహితు లెవరో తనకు సహాయం చెయ్యడం, దానిని తాను ఉచితంగా పొందడం తన కిష్టంలేదు.

''అప్పే. అలా ఎందుకవుతుందీ? మీబాబా యికి నువ్వు కూతురువి కాబట్టి ఆయన పంపేవాడు. నువ్వు నా కాబోయే కోడలువి కాబట్టి నేను పంపుతున్నాను. మనలో మనకు అప్పేమిటి?''

''అది అప్పుగానే నేను భావిస్తాను.'' అంది భానుమతి.

''అలా ఎప్పటికీ అనుకోవద్దు. నా సంపా దన చాలా కొంచెమే అయినా అది, మా అబ్బా యికీ నీకూ మాత్రమే చెందుతుంది.''



"ఒకవేళ వివాహం జరుగకపోతే?" అని అడ్డు సవాలు వేసింది భానుమతి. దామోదరం ఈ ప్రశ్నకి కొద్దిగా చలించాడు.

"ఎందుకు జరగదూ, తప్పకుండా జరుగుతుంది. మీ బాబాయి ఆత్మశాంతి కోసం నువ్వు తప్పకుండా ఆయన కోరికను నెరవేరుస్తావని నాకు నమ్మకం వుంది." అన్నాడు కొద్దిగా ఆత్రుతగా.

"వివాహం అనేది వధూవరుల ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా పెద్దలు నిర్ణయించడం నేను సహించను." అంది భానుమతి.

దామోదరం తనలో 'అబ్బో! వ్యవహారం చాలావరకూ వచ్చిందే' అనుకున్నాడు. తను చెప్పిన మాటలన్నీ విని వాటి ప్రకారం ఆచరిస్తుందనుకున్న ఈ పిల్ల మొదటికే మోసం తెచ్చేట్టుంది. కాని అంతమాత్రాన తనూ వదిలిపెట్ట కూడదు. "అందుకనే నేను ఇన్నాళ్ళూ ఓపిక పట్టాను. ఇప్పుడు నువ్వు పరిపూర్ణ వివేకవంతురాలివై నీ మంచి చెడులను ఇతరుల మీద ఆధారపడకుండా నీకు నీవే నిర్ణయించుకోగలవని, నీ వద్దకు వచ్చాను. నువ్వేవిధంగా నిర్ణయించినా, నీ నిర్ణయానికి నేనుపూర్తిగా సహకరిస్తాను" అన్నాడు.

ఆ మాటకు భానుమతి జవాబు చెప్పలేదు. అదే సమయంలో, అనంతరావుగారూ, ఉమా, బైట కారు దిగి లోపలికి వచ్చారు. దామోదరాన్నీ, భానుమతినీ పలకరించి వారితో మాట్లాడుతూ హాలులోనే కూర్చున్నారు. అనంతరావుగారు, "మీరు వస్తారని భానుమతి చెప్పింది. మీరు ఇక్కడికే వచ్చెయ్యలేకపోయారా? వేరే హోటలులో మకాం ఎందుకు?" అని అడిగారు.


"అబ్బే. నేనెప్పుడీ వూరు వచ్చినా అక్కడే దిగుతాను. అక్కడ సదుపాయంగానే వుంటుంది. అక్కడ సదుపాయంగా లేకపోతే మీరు కోరినట్లు వస్తాను." అన్నాడు దామోదరం నవ్వుతూ.

తరువాత ఆ పూటకి దామోదరాన్ని అక్కడే భోజనం చెయ్యవలసిందిగా కోరారు అనంతరావుగారు. దామోదరం అంగీకరించాడు. వారిద్దరి మధ్య సంభాషణ ప్రకాశం గురించీ, సుగర్ ఫ్యాక్టరీ గురించీ జరిగింది.

దామోదరం వెళ్ళిపోయే ముందర భానుమతితో, "మళ్ళీ వారంరోజుల్లో ఈవూరు వస్తాను. కలుద్దాం" అని చెప్పి వెళ్ళిపోయాడు. భానుమతి, చాలా రాత్రవడం మూలాన ఇంటికి వెళ్ళిపోయింది.

మరునాడు భానుమతికి ఆనందం కలిగించే విషయం ఒకటి జరిగింది. అదేమిటంటే ప్రతినెలా వస్తున్నట్లుగానే మనియార్డరు వచ్చేసింది. ఇన్నాళ్ళ నుండీ బాబాయి పంపిస్తున్నాడని విశ్వసించిన మనియార్డరు, మూడేళ్ళ నుండీ అతని వద్ద నుండి రావటం లేదనీ మరొకరు పంపుతున్నారనీ దామోదరం ద్వారా తెలిసింది. ఆ పంపుతున్నది, దామోదరం, తనేనని చెప్పినప్పుడు భానుమతికి ఎంతో కష్టం కలిగింది. ఎందుకంటే దామోదరం ఎటువంటి వ్యక్తో తెలుస్తూనే వుంది. అటువంటి వానివల్ల సహాయం పొందడం, తన కెంతమాత్రం ఇష్టంలేదు. కాని తనకు తెలియకుండా జరిగిపోతున్న దానికి తనేమి చెయ్యగలదు? నిజంగా దామోదరమే పంపేటట్లయితే అది అప్పుడే భావించదల్చుకుంది. దామోదరం తను రామవరం వెళ్ళి డబ్బు పంపిస్తానన్నాడు. అంటే అతను వెంటనే పంపినా, మనియార్డరు రావడానికి ఇంకొక రోజు వ్యవధి వుంది. కాని ఆరోజే మనియార్డరు రావడం వలన అది దామోదరం పంపినది కాదని తెలుస్తోంది.

డబ్బు దామోదరం పంపలేదనీ, అది మరొకరు పంపుతున్నారనీ తోచేసరికి భానుమతి మనసులో ఎంతో బరువు తీరినట్లయింది. ఆ విషయం నిర్ధారణ కావడానికి మరొక్క పని జరగాలనికుంది. అదేమిటంటే భానుమతి పేర దామోదరం వద్ద నుండి మరొక మనియార్డరు రావడమేనూ. అది వచ్చినవాడు చాలావరకూ విషయం తేలిపోతుంది. దామోదరం మాటలలో నిజం వున్నట్లు ఆమె కెంతమాత్రం తోచటం లేదు. కాని అవి అబద్ధాలని ఋజువయ్యే వరకూ వాటిని నమ్మక వేరే గత్యంతరంలేదు.



ఆమె ఆశించినట్లుగానే మరునాడు భానుమతి పేర దామోదరం వద్ద నుండి **ఒక** మనియార్డరు వచ్చింది. దానిని భానుమతి కొద్దిసేపు పరిశీలించి, వెంటనే తిప్పి పంపేసింది. అది తిరిగి వెళ్ళగానే దామోదరం, భానుమతి తన మాటల్ని నమ్మటం లేదని తెలుసుకుంటాడనుకొంది. అంతేకాక తను ఊహించినట్లు, నెలనెలా మనియార్డరులు పంపుతున్నది దామోదరం కాక మరొక వ్యక్తేనందుకు, భగవంతుడికి ఎన్నో ధన్యవాదాలర్పించుకుంది. ఇంతతో దామోదరం తనని వదిలిపెట్టే చాలనుకుంది.

ఆ రోజు సాయంత్రమే ఈ విషయం ఉమతో చెప్పింది. అంతవరకూ ఉమ, ఈ విషయాలు వింటూ వూరుకున్నదల్లా, దామోదరం అబద్ధమాడి మోసం చేస్తున్నట్లు తెలుసుకోగానే పరిస్థితులు క్లిష్టతరమవుతున్నాయని తెలుసుకుని భానుమతిని పూర్తి వివరాలడిగింది.

"అసలు ఈ దామోదరానికి నీతో ఏం పనో గ్రహించావా?"

"ఏమో. అది తెలియటంలేదు. ఇంతవరకూ అతను బయటపెట్టిన విషయమేమంటే నన్ను ఆయన కొడుక్కి వివాహం చేసుకుంటాడట. అదే అసలు విషయంలా తోస్తోంది."

"దానికి కూడా ఒక కారణముండాలి కదా. ఉత్తినే అంత త్యాగం చెయ్యవలసిన అవసరం ఏముంది?"

"దానికి కారణం బాబాయికీ తనకీ గల స్నేహం అట. ఆయన చనిపోతూ నన్ను తన కొడుక్కి వివాహం చేసుకోమన్నారట.

"నాకో పెద్ద సందేహం కలుగుతోంది. మీ బాబాయి చనిపోయి మూడేళ్ళయి ఇప్పుడీ విషయాలు బయటికి రావడానికి కారణం ఏమిటి? అప్పుడే వీళ్ళు వచ్చి ఎందుకు చెప్పలేదు?

"నన్ను బాధిస్తున్న సందేహమూ అదే. పైగ ఈ మూడేళ్ళూ నాకీ విషయం ఎంతమాత్రమూ తెలియనియ్యక పోవడం వలన వీళ్ళు సాధించినదేముంది? నాకు మరింత బాధ తప్ప."

"ఈ విషయాలు మనం నాన్నగారితో చర్చించాలి. దామోదరం నిన్ను కలుసుకుంటున్నాడంటే ఆయన ఎంతో భయ

వచ్చు న్నారు. నువ్వు మునియార్డరు తిప్పి పంపిన విషయం ఆయనకు తెలియబర్చాలి.'' అని ఉమ అనేసరికి భానుమతి అందు కంగీకరించింది. అంతవరకూ ఈ వివరాలేమీ భానుమతి ఆయనతో చెప్పలేదు. అనంతరావు గారికి చూచాయగా ఉమ ఈ సంగతులు చెప్పింది. కాని వివరాలు ఆరోజు సాయంకాలమే భానుమతి మొదటిసారిగా చెప్పింది. అన్నీ విని ఆయన, ''మీ బాబాయి గురించిన వివరాలేమైనా చెప్పగలవా?'' అని అడిగారు.

''ఆయన పేరు రామదాసుగారు. ఆయనను నేను చూసి సుమారు మూడేళ్లకు పైగా అయింది. మనిషి గంభీరంగా వుంటారు. ఎప్పుడూ ఖద్దరు లుంగీ, లాల్చీ వేసేవారు.

''ఆయన తాలూకు ఫోటో ఏదైనా వుందా?''

''నాకు తెలిసినంతవరకూ ఏదీలేదు. అయినా కనుక్కుంటాను.''

''దామోదరం మాటల్లో నిజాలేవో అబద్ధాలేవో తెలుసుకోవడం చాలా అవసరం. ఆయన చనిపోవడం నిజమే కావచ్చు. తక్కిన విషయాలన్నీ చిలవలూ పలవలూ పేర్చి కల్పిస్తున్నారని నా కనుమానంగా వుంది. ఏది ఏమైనా, దామోదరం నిన్ను కలుసుకోవడానికి ప్రయత్నిస్తే ప్రస్తుతంలో ఏమీ అవకాశం ఇవ్వకు. అతను చాలా తెలివైన వాడు. అతను ఎంతో అవసరం వుంటేనేగాని ఇటువంటి వ్యవహారాలకి రాడు. ఆ సంగతేమిటో పూర్తిగా తెలిసేదాకా మనం మన జాగ్రత్తలో వుండాలి.''

అనంతరావుగారికి భానుమతి మీద వుండే అవ్యాజాభిమానం ఆమెకు ఎన్నో జాగ్రత్తలు బోధించేటట్లు చెయ్యడమేకాక, వెంటనే తన

సుప్రభాతం

ఆంతరంగిక మిత్రులిద్దరితో ఈ విషయం సంప్రదించేటట్లు చేసింది. అందులో ఒకతను వాగభూషణం అని మంచిపేరు మోసిన వకీలు. వారిద్దరి స్నేహం చాలాకాలం నాటిది అందువల్ల ఇరువురి మధ్యా ఎటువంటి స్వవిషయాలనైనా చర్చించుకుంటారు. వాగభూషణం, అనంతరావుగారి ద్వారా ఈ సంగతంతా విని ఒకే ఒక సలహా నిచ్చాడు. అదేమిటంటే మరికొద్ది కాలం ఓపిక పట్టే నిజానిజాలు వాటంతట అవే తేలుతాయనీ, దామోదరం చెప్పిన మాటలు నిజమైతే ఇంక ఏమీ జరుగకుండా వ్యవహారం ఇంతతో ఆగిపోతుందనీ, నిజం కాకపోతే దామోదరం ఎలా తనంతట తను పరిచయం చేసుకుంటూవచ్చి ఈ విషయాలు చెప్పాడో, అలాగే మరికొందరు వ్యక్తులు వస్తారనీ అప్పుడు వీళ్లందరి మాటల బట్టి అసలు విషయమేదో తేలుతుందనీ. అది విని అనంతరావుగారు అనుకున్నారు.

ఆయన రెండవ మిత్రుడు సర్కిల్ ఇన్‌స్పెక్టరు రజాక్. అతను అనంతరావుగారి వద్ద చాలాకాలం క్రిందట చదువుకున్నాడు. ఆయనంటే చాలా భక్తి. అనంతరావుగారు ఎందుకైనా మంచిదని అతనితో భానుమతి విషయం మాట్లాడి, దామోదరం సంగతి చెప్పారు, రజాక్ ఒకనాడు ఆయన వద్దకు వస్తే.

''ఇందులో భయపడదగిన విషయమేమీ లేదు గాని నీ చెవిని వేస్తే మంచిదని చెప్తున్నాను. దామోదరం సామాన్యుడు కాకపోవడం వలన అసలు ఈ కథంతా నిజమేనా? అన్న సందేహం కలగడమే కాకుండా భానుమతి కేమి అపాయం కలుగుతుందోనని భయంగా వుంది.'' అన్నారు.


ఇన్‌స్పెక్టరు రజాక్ వయస్సు ముప్ఫై అయిదు సంవత్సరాలుంటాయి. పొడుగాటి బలమైన వ్యక్తి. ఉంగరాల జుట్టూ, ఎర్రని ఆకారయుక్తమైన మొహమూతనిది. కళ్లు చిన్నవి. కాని నిశితంగా ఎదుటివారిని పరిశీలిస్తున్నప్పుడు అవి చాలా ప్రకాశవంతంగా కన్పిస్తాయి.

''నిజమే మాష్టారూ, వీళ్లని ఎంత మాత్రం నమ్మలేము. చాలా కేసుల్లో వీళ్ల జోక్యం వున్నట్లు మాకు తెలిసి కూడా మేమేమీ చెయ్యలేకుండా వున్నాము. అంత తెలివిగా ప్రవర్తిస్తున్నారు. ఇదంతా ఏదో పెద్ద పనికి నాంది కావచ్చు. ఆ అమ్మాయిని తన జాగ్రత్తలో వుండమనండి. నేను అసలీ విషయంలోని అంతరార్థం ఏదో కనుక్కోడానికి ప్రయత్నిస్తాంటాను. దామోదరం స్వయంగా కలుగజేసుకున్నాడంటే చాలా ముఖ్యమైన విషయం అన్నమాటే. రెండు రోజుల్లో మళ్లీ మీకు కన్పించి, ఏమైనా విశేషాలుంటే చెప్తాను.'' అని చెప్పి రజాక్ అనంతరావుగారి వద్ద సెలవు తీసుకున్నాడు.

తన ముఖ్య మిత్రులిద్దరూ తనతో బాటు ఈ విషయంలో శ్రద్ధ చూపిస్తారని నమ్మకం పొందాక అనంతరావుగారు భానుమతి విషయంలో నిశ్చింత పొందారు. కాని ఆమె స్థితి తల్చుకున్నప్పుడు ఎంతో బాధపడేవారు. అకస్మాత్తుగా తన తండ్రిపరో తెలుసుకోవడమే కాకుండా, అతని మరణవార్త వినడం, దామోదరం లాటి దుర్మార్గుడామెను వెన్నాడడం చాలా ప్రమాద పరిస్థితిలో ఆమె చిక్కుకున్నట్లు తెలుస్తోంది.

ఆమె లాటి అందమైన పిల్ల ఆపదలలో చిక్కుకోవడంలో విచిత్రమేమీలేదు. కాని అటువంటి అమూల్య రత్నాన్ని, దుర్మార్గుల చేతుల్లో పడకుండా, కాపాడాలి. వీలైతే ఒక చక్కని యువకుడితో కలిసేటట్లు చెయ్యాలనుకున్నారు అనంతరావుగారు. అంతే కాకుండా రామదాసు ఎలా చనిపోయాడో, ఎందుకు చనిపోయాడో తెలుసుకోవాలని కూడా నిశ్చయించారు. అందుకు రజాక్ సహాయం అర్థించారు.

(సశేషం)



సీరియల్

రామ్‌శాస్త్రి

వి.ఎస్.సుఖ్తాంకర్

౩

(జరిగిన కథ: గొప్పపండితుని కొడుకయిన రామ్‌శాస్త్రి ఆయన పోయిన తర్వాత పేదరికంవల్ల చదువు లేక, నిజాయితీ వల్ల స్వగ్రామంలో ఉండలేక చిన్న పిల్లవాడప్పుడే సతారాలో షాగిర్ద్ (నౌకరు) ఉద్యోగంలో చేరుతాడు. పదేళ్ల ఉద్యోగం తర్వాత ఒకరోజు యజమాని అతని నిరక్షరాస్యాన్ని గురించి తేలికగా మాట్లాడంతో అభిమానం దెబ్బతిని, పని వదులుకుని చదువుకొనటానికి కాశీ వెళ్లిపోయాడు. అక్కడ అతని దీన పరిస్థితిని చూసిన కొందరు బ్రాహ్మణ బాలకులు రామ్‌శాస్త్రిని తమ పాఠశాలకి తీసుకు వెడతారు.)

బ్రాహ్మణ బాలకులు రామ్‌శాస్త్రిని గురించి తమకి తెలిసినదంతా తమ గురువుగారికి చెప్పారు. చదువు మీద ఈ పిల్లవాడు ఆసక్తితో అంతదూరం నడిచి వచ్చాడని విని ఆయన చాలా ఆనందించాడు. రామ్‌శాస్త్రి ముఖంలోకి పరిశీలనగా చూశాడు. అతని ముఖంలో కనిపించిన తేజస్సూ, నిజాయితీ ఆయనని ఆకర్షించాయి.

"అబ్బాయి, ఇంతకుముందు నువ్వే పాఠశాలలో చదువుకున్నావు? ఎంత దాకా చదువుకున్నావు?" అని అడిగాడు సాదరంగా.

రామ్ మొహం చిన్నపోయింది. నోటమాట రాలేదు. "కౌముది చదువుకున్నావా?" అని ప్రశ్నించాడు.

రామ్ తల అడ్డంగా ఆడించాడు.

"ఇదేమిటి కౌముది పూర్తి కాకుండా కాశీలో పాఠశాలలో చేరుదామని వచ్చావా?" పాఠశాల గురువుగారు ఆశ్చర్యం వెలిబుచ్చాడు. "పోనీ కనీసం కావ్యాలన్నా కంఠస్థం చేశావా?"

"లేదండీ!" రామ్ గొంతుకలో నిరాశ, నిస్పృహ ప్రతిధ్వనించాయి.

"ఏమిటీ! కావ్యాలు కూడా చదవలేదూ!" గురువుకి చిరాకువేసింది. "ఒహో! ఏదో కాస్త సంస్కృతం నేర్చుకుని రూపావళీ, సమాసచక్రమూ చదువుకుని ఉంటావు! ఇక్కడికి వచ్చేశావన్నమాట! ఈ మిడిమిడి జ్ఞానంతో నా పాఠశాలలో చేరుదామనుకొనటం ఎంత సాహసమో తెలుసా?"

"అయ్యా, నేను ఈ రూపావళీ, సమాసచక్రాలు కూడా చదువుకోలేదు." అన్నాడు రామ్‌శాస్త్రి బెరుకుగా.

గురువు గారి ఆశ్చర్యానికి అంతులేదు. తన శిష్యుల వైపు తిరిగి వాళ్లని కేకలు వేశాడు. "మీ కసలు [illegible] నా దగ్గర కెవడు తీసుకు రమ్మన్నాడు? ఇరవయ్యేళ్లు నెత్తిమీద కొస్తున్నాయి. రూపావళీ, సమాసచక్రాలంటే ఏమిటో తెలియదంటాడు! ఈ పాఠశాల కట్టెలు కొట్టేవాళ్లకీ, నీళ్లు చేదే వాళ్లకీ ఆశ్రయమనుకున్నారా?"

పిల్లవాళ్లు హడిలిపోయి, మాట్లాడకుండా రామ్‌శాస్త్రిని అక్కడనుంచి తీసుకు వెళ్లటానికి ప్రయత్నించారు.

రామ్‌శాస్త్రి తన నిరాశనీ, ఆవేశాన్ని అణుచుకోలేక గురువు కాళ్ల మీద పడ్డాడు.

"అయ్యా. క్షమించండి! నా మీద దయ ఉంచండి! నన్ను పంపించేశారంటే బ్రతకలేను! నే చెప్పేది వినండి—నా బ్రతుకు ఎంత చెడ్డదో చెప్పనివ్వండి" అంటూ తన కథనంతా ఏకరువు పెట్టాడు. "గురుదేవా! నేను మిమ్మల్ని అడిగేది విద్యాభిక్ష కోసమే! నా ఆహార నివాసాల విషయంలో మీకే బాధ్యతా ఉండదు. అవన్నీ నేను చూసుకుంటాను! పళ్లు ఎంచి పని చెయ్యటం నాకు బాగా అలవాటే—అసలు మిమ్మల్ని తిండి గుడ్డలు అడిగే అర్హత కూడా నాకు లేదు. నా క్షోభని గుర్తించి సరస్వతిని పూజించే అవకాశం ఇప్పించండి!"

గురువుగారిది జాలి గుండె. రామ్ ఆక్రోశం ఆయనని కదల్చివేసింది. అతన్ని లేవదీసి, మృదువుగా వీపు మీద తడుతూ, "బాబూ, నీ దీక్ష నిజంగా మెచ్చుకోతగ్గది. నీకు అసలే చదువు రాకపోయినా వీళ్లందరితో బాటే ఒక శిష్యుడిగా చేర్చుకొనటానికి నిశ్చయించుకున్నాను. ఆహార నివాసాలని గురించి బాధపడకు, నీకన్నీ దొరుకుతాయి! నీ దృఢసంకల్పం నెరవేరాలని ఆశీర్వదిస్తున్నాను, ఆ సరస్వతీదేవి [illegible] తప్పకుండా కటాక్షిస్తుంది" అన్నాడు.

ఆ గురువుగారు నిజంగా సార్థక నామధేయుడు. ఆయన ఆశీస్సులు ఫలించాయి. రామ్‌లో అణగారిపోయి ఉన్న ఉత్సాహం చిగిరించే అవకాశం ఇన్నాళ్లకి కలిగింది. పదిసంవత్సరాల తర్వాత అతని విషయం, బుద్ధి మేలుకునే అవకాశం కలిగింది...

రామ్ ఆదర్శ విద్యార్థి అయిపోయాడు. అసలు వారణాసిలో అంత దీక్ష, శ్రద్ధ కలవాడు లేడనిపించుకున్నాడు. ఎందరో పండితుల ప్రశంసలని అందుకున్నాడు. ఎన్నో పండిత సభలలో తన అర్హతలని నిరూపించుకున్నాడు. న్యాయశాస్త్రంలో ప్రత్యేక కృషి చేశాడు.

చివరికి రామ్‌ని అయిదుగురు పండితులు కలిసి పరీక్ష చేసే రోజు సమీపించింది. పరీక్షలో కృతార్థుడయితే కుర్రవాడు రామ్ నిజంగా రామ్‌'శాస్త్రి' అవుతాడు!

సభ ఏర్పాటు చేశారు. రామ్ పాండిత్య పరీక్ష ప్రారంభం అయింది. సభకి విచ్చేసిన పండితులు అతనిని ఎన్నోవిధాల పరీక్షించారు. వారి ప్రశ్నలన్నిటికీ రామ్ సరయిన సమాధానాలు చెప్పాడు. విద్వాంసు లందరికీ రామ్ పాండిత్యం ప్రగాఢమయినదని తెలిసింది. అయినా, చివరి పరీక్షగా న్యాయశాస్త్రం మీద ఉపన్యసించమన్నారు.

రామ్ తనగురువుగారికి నమస్కరించి స్వచ్ఛమైన సంస్కృతంలో ఉపన్యాసం ప్రారంభించాడు. తన పాండిత్యపు లోతులతో సభికులని విస్మయులని కావించాడు. ఎన్నో ప్రాచీన ప్రమాణ గ్రంథాలలోని ఉదాహరణలు అతని నోటి నుండి ధారాళంగా వెలువడి న్యాయశాస్త్రం రామ్‌'శాస్త్రి'కి కరతలామలకమని నిరూపించాయి! సభ "సాధు! సాధు!!" అన్న నినాదాలతో ప్రతిధ్వనించింది. రామ్‌శాస్త్రిని పరీక్షించటానికివచ్చిన పండితులలో ముఖ్యుడు లేచి ఈ యువ పండితుడి ప్రసంగాన్ని ప్రశంసించారు. అతని మెడలో హారంవేసి 'శాస్త్రి' బిరుదు ఇచ్చాడు. ఆ తర్వాత అతనికి 'మహావస్త్రం'– బంగారు నగిషీచేసిన శాలువ—కప్పాడు. కాశీలో పండితలోక ప్రవేశానికి అర్హత సంపాదించుకున్న 'షాగిర్ద్' రామ్, 'రామ్‌శాస్త్రి' అయిపోయాడు! సభ కరతాళ ధ్వనులతో ముగిసింది.

రామ్‌శాస్త్రి కన్నీరు ధారాళంగా ప్రవహిస్తూ ఉండగా 'మహావస్త్రాన్ని' అతివినయంగా తన గురువుగారి పాదాలవద్ద ఉంచాడు. తర్వాత ఆయనకి సాష్టాంగ నమస్కారం చేశాడు. గురువుగారి ఆనందం వెల్లివిరిసింది. శిష్యుడిని ఆప్యాయంగా లేవదీసి, "శతాయుష్మాన్ భవ!" అని దీవించాడు.

* *

మర్నాడు రామ్‌శాస్త్రి చేతులుకట్టుకుని గురువు ముందర నుంచున్నాడు.

"అయ్యా, మా తల్లిని చూసి పది సంవత్సరాలకి పైగా అయింది. తమరు నా మీద చూపిన దయ ఇంతా అంతా కాదు. తమని వదిలి వెళ్లాలంటే నాకెంత కష్టంగా ఉందో చెప్పలేను. కాని ఆవిడని చూడాలి కదా.." అని మనవి చేసుకున్నాడు. గురువుగారు సమాధానం చెప్పే లోపలే మళ్లీ ఇలా అన్నాడు: "నా బ్రతుకంతా పేదరికంలోనే గడిచిపోయింది. అయినా, నేడు ఆ పేదరికం నన్ను బాధించినంతగా మరేదీ బాధించటంలేదు. మీ వద్ద ఇంత మేలు పొంది మీకు 'గురుదక్షిణ' సమర్పించుకునే భాగ్యం నాకు లేకపోయింది!"

రామ్‌శాస్త్రి విశ్వాసాభిమానాలు అతని గురువుగారి కన్నీళ్లు చెమర్చేట్లు చేశాయి. "బాబూ, ఇటువంటి వాటిని తలుచుకుని బాధపడకు! నీ జీవితమంతా ఒక గొప్పసత్యాన్ని ఎప్పుడూ గుర్తు ఉంచుకో "సావిద్యాయా విముక్తయే!" అన్నారు మన ఋషులు. ఈ విద్యని ఎప్పుడూ దుర్వినియోగం చెయ్యకు! ఇది భగవత్ ప్రసాదితమయిన వరంగా భావించు! నువ్వెక్కడేమయినా నేర్చుకున్నావంటే దానిని ఆత్మశుద్ధితో, పరోపకారార్థమై, న్యాయంగా వినియోగించు! ఇదే నీ వద్ద నేను కోరే గురుదక్షిణ"

అని ఉపదేశించాడు.

* * *

రామ్‌శాస్త్రి గృహోన్ముఖుడయ్యాడు. కొన్నివారా లలో 'మహులీ' గ్రామానికి ఎదురుగా, కృష్ణానది అవతలి గట్టుమీద ఉన్న పల్లెని చేరుకున్నాడు. వెంటనే నది దాటి తన తల్లిని చూడాలని ఆరాట పడ్డాడు. కాని నది పొంగుతో ఉంది. పడవ వాళ్ళెవరూ ఆ ప్రవాహంలోకి వెళ్ళటానికి సాహసించటంలేదు.

రామ్‌శాస్త్రికి ఏమిచెయ్యాలో తోచలేదు. కొంచెం సేపు అటూ ఇటూ తిరిగాడు. ప్రవాహం హోరు, ఉరకలు వేస్తూ నురుగులు కక్కే అలలు ఎంత సాహసం కలవాడినయినా వెనుకాడేట్లు చేస్తున్నాయి. కాని తల్లిని చూడాలనే ఆదుర్దా క్షణక్షణం ఎదురవు తోంది. చుట్టుప్రక్కల మంచుని ఉన్నవారు నది పొంగు ఎప్పుడూ ఇంత తీవ్రంగా ఉండగా చూడ లేదనుకుంటున్నారు. ఇంతలో ఒక సుపరిచిత స్వరూ పం రామ్‌ని సమీపించింది. పరధ్యాన్నంలో ఈవ్యక్తి ఎవరో రామ్ సరిగ్గా గమనించలేదు. కాని, అతనే రామ్ ముఖంలోకి తేరిపార చూసి, "ఎవరూ! రామ్ నువ్వేనా?" అన్నాడు సంతోషంలో సందేహం కూడా కలవగా.

రామ్ ఉలిక్కిపడి అటు తిరిగాడు. "జాన్‌బా!" అన్నాడు బిగ్గరగా. ఇద్దరూ కొన్నిక్షణాలు ఒకరినొకరు సంభ్రమాశ్చర్యాలతో చూసుకుంటూ మాట లేకుండా నిలబడిపోయారు. రామ్ పేరు వినగానే మరికొందరు కూడా అక్కడ మూగారు. అతని పూర్వచరిత్ర కొంత తెలిసినవారు ప్రశ్నల వర్షం కురిపించారు. రామ్‌శాస్త్రి వారికి సమాధానం చెప్పే స్థితిలో లేడు.

"జాన్‌బా! మా అమ్మగారెలా ఉన్నారు?" అని ప్రశ్నించాడు. ప్రశ్న వేస్తూ ఉండగానే అతని కంఠం రుద్ధమయిపోయింది.

జాన్‌బా జవాబు చెప్పలేదు. రామ్‌శాస్త్రి కలవర పాటు అధికం అయింది.

"ఏం, మాట్లాడరు! మా అమ్మగారెలాఉన్నారు!" అన్నాడు మళ్ళీ. జాన్‌బా కళ్ళు చెమర్చాయి.

జాన్‌బా బదులు పక్కన ఉన్న మనిషి ఒకతను సమాధానం ఇచ్చాడు. రాధాబాయికి కొంతకాలంగా అనారోగ్యంగా ఉంది. రెండుమూడు రోజులుగా ఆమె పరిస్థితి మరీ దిగజారిపోయింది. వైద్యుడి దగ్గర మందు తీసుకొనటానికని జాన్‌బా నది ఇతవలకి వచ్చాడు. అపసరంగా మహులీ వెడదామనే అను కున్నాడు కాని ఈ అడ్డం వచ్చింది. రాధాబాయి ఆరోగ్య పరిస్థితిని గురించి జాన్‌బా ఆలోచించని వేళ లేదు. తన అసహాయ పరిస్థితికి జాన్‌బా ఎంత బాధ పడుతున్నాడో చెప్పలేము!

రామ్‌శాస్త్రి మౌనంగా జాన్‌బా చేతిలోని మందు పొట్లాన్ని తీసుకున్నాడు. ఇదికాక పండిత సభలో తను సంపాదించిన 'మహావస్త్రాన్ని' తల్లి కోసం కాశీ నుంచి తెచ్చిన గంగాజలాన్ని మాత్రం తీసుకుని తన మూటని అక్కడే పడవేశాడు.

జాన్‌బాకి ఒకసారి నమస్కరించి నదిలోకి దూకాడు. ఇదంతా చూసేవారికి అతన్ని వారించేం దుకు కూడా వ్యవధి లేకపోయింది. పోటమాట పెగలక అతను అతికష్టంమీద అవతల తీరం చేరు కొనటం చూశారు. తడిగుడ్డలతో, అలిసిపోయిన రామ్‌శాస్త్రి ఆ వడ్డు మీద లేచి నుంచొనగానే వారి కంఠాలలో 'హా,హా' కారాలు ధ్వనించాయి. అవతల గట్టుమీద నుంచి ఈ దృశ్యం చూస్తున్న మరికొందరు రామ్‌శాస్త్రి వద్దకి పరిగెత్తి అతని చుట్టూ మూగి తమకి తోచిన సహాయం చెయ్య టానికి ప్రయత్నించారు.

"నీ కోసం ఈ గంగాజలం కూడా తెచ్చానమ్మా!" అన్నాడు రామ్‌శాస్త్రి ఆమె గుండెల్లో తన తల దాచుకుంటూ.

"బాబూ నావంటి అదృష్టవంతురాలు ఉండదు! నీవంటి రత్నం నా కొడుకవ్వటం నా పూర్వజన్మ ఫలమే! నీ తండ్రి లాగే నువ్వూ నీ పాండిత్య ప్రతి భతో మహావస్త్రాన్ని సంపాదించుకున్నావు! నా ఆఖరి



రామ్‌శాస్త్రి ఇదేమీ పట్టించుకోని వాడివలె తడిగుడ్డలతోనే ఇంటికి పరిగెత్తాడు.

రాధాబాయి కొన ఊపిరితో ఉంది. ఆమె కొడుకు ఒక్క ఉదుటున వెళ్ళి ఆమె కాళ్ళ మీద పడ్డాడు. అతని రాకతో ఆమెకి కొత్త ప్రాణం పోసినట్లయింది. హీనస్వరంతో అతన్ని దీవించింది. రామ్‌శాస్త్రి ఆమెకి తన కథ అంతా చెప్పాడు. మహావస్త్రం సంపా దించుకున్న వృత్తాంతం విన్న ఆమె సంతోషానికి అవధి లేదు.

క్షణాల్లో గంగాతీర్థం ఇప్పిస్తున్నావు! ఈ గడియ కోసం వెయ్యికళ్ళతో కాచుకుని ఉన్న నా మీద భగ వంతుడు దయదలిచాడు! 'శాస్త్రి' బిరుదు సంపా దించుకున్న నా కన్న కొడుకుని దీవిస్తూ, పవిత్ర గంగాజలాన్ని సేవిస్తూ ఈ లోకాన్ని విడుస్తున్నాను! ఇంతకన్నా నాకేం కావాలి?.." అంటూ తన ఆఖరి శ్వాస వదిలింది రాధాబాయి.

(సశేషం)

వారఫలం

20-1-1967 శుక్రవారం మొదలు 26-1-1967 గురువారం వరకు.

మేషం : ఆదాయం మాట యెలాగవున్నా అన్ని వ్యవహారాలు అనుకొన్నట్లుగా నెరవేరుతాయి. ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా వుంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు కొంతవరకు లాభిస్తాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. పోటి వారిలో గౌరవం బాగా వుంటుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. బంధు మిత్రులను కల్సుకొంటారు.

వృషభం : ఇప్పుడు మీరు జరిపే వ్యవహారాల వల్ల కేవలం తాత్కాలికమైన లాభమేకాకుండా మున్ముందు కూడా ఉపయోగం వుంటుంది. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగానే నెరవేరుతాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. కుటుంబ సంతోషం లభిస్తుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మిథునం : వారం ప్రారంభంలోనే వృత్తి వ్యాపారాల్లో చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో జోక్యం చేసికోవడం తగదు. ఉద్యోగంలో మెప్పుకు రాని కార్యభారాన్ని వహిస్తారు. సాంఘిక కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ప్రయాణాలు శ్రమమీద ఫలిస్తాయి.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు.

కర్కాటకం : ఈవారం శుభాశుభ మిశ్రమంగా వుంటుంది. వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ప్రారంభంలో బాగానే ఉంటాయి కాని వారాంతంలో చికాకులు యేర్పడతాయి. సమయానికి యేదో ఒక విధంగా డబ్బు చేతికి వస్తుంది. మీ తాలూకు వస్తువులు పోవచ్చును. అధిక వ్యయం జరుగుతుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది. శుభకార్యాల విషయంలో అనుకూలమైన సంఘటనలు జరుగుతాయి.

సింహం : వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ఒడుదుడుకులు లేకుండా నెరవేరుతాయి. వ్యాపారం భారీయెత్తున చేయడంవలన ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది. ఉద్యోగంలో గౌరవ ప్రాబల్యాలు బాగా ఉంటాయి. స్థిరాస్థి వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది. పోటివారిలో గౌరవం బాగా ఉంటుంది.

కన్య . ఇదివరకు మీకు ఆందోళన కలిగించిన వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. నూతన వ్యాపారాలు లాభదాయకంగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. ఉద్యోగంలో అధికారుల ఆదరాభిమానాలను పొందగలరు. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధువుల వ్యవహారాల్లో మీ కృషి శ్రమ మీద ఫలిస్తుంది.

తుల : కొన్ని వ్యవహారాల్లో మీరు యెంత మంచిగా ప్రవర్తించినా అది యితరులకు చెడుగానే కన్పిస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలు భాగస్వాముల నిర్ణయానికి వదలి వేయడం మంచిది. ఉద్యోగంలో స్వల్ప భేదాభిప్రాయాలు రావచ్చును. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాల సంచలనం పెరుగుతుంది. ఆందోళన కలుగుతుంది.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. దైవకార్యాలు నెరవేరుతాయి.

వృశ్చికం : వారం ప్రారంభంలో అన్ని వ్యవహారాలు బాగా ఉంటాయి. వారాంతంలో చికాకులు కలుగుతాయి. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి! అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉండదు. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

ధనస్సు : వృత్తి వ్యాపారాల్లో మీరు అనుకొనేది ఒకటి జరిగేది మరొకటి కావచ్చును. రావలసిన డబ్బుమీద ఆధారపడి యితరులకు వాగ్దానాలు చేయడం తగదు. వృత్తిలో పోటివారితో పోటీ పెరుగుతుంది. ఉద్యోగంలో యెవరితోను వాద ప్రతివాదాలకు దిగడం మంచిదికాదు.

స్త్రీలకు:— కుటుంబ కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరతాయి. బంధు మిత్రులను కల్సుకొంటారు.

మకరం : వృత్తి వ్యాపారాల్లో కొంచెం శ్రమ కలిగినా, దానికి తగిన ప్రతిఫలం లభించగలదు. వ్యాపారంలో ప్రయోజనంగల వ్యక్తులను కల్సుకొంటారు. ఉద్యోగంలో అధికారుల ఆదరాభిమానాలను పొందగలరు. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణించగలదు. మిత్రుల సహాయం లభిస్తుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కుంభం : సామాన్యమైన పనులకు కూడా విశేషమైన ప్రయత్నం చేయవలసి వస్తుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలకు లొంగిపోవడం తగదు. వారాంతంలో సాహసముతోకూడిన వ్యవహారాలు లాభిస్తాయి. రాజకీయ వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది. ప్రయాణాలు లాభదాయకంగా ఉంటాయి.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా వుంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

మీనం : వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాల్లో నూతనావకాశాలు లభిస్తాయి. ఉద్యోగంలో మిత్రులకు ఉపకారం చేయగలరు. కొన్ని వ్యవహారాల్లో మీ మంచితనమే మీకు యిబ్బందిని కలిగిస్తుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధువులకు సహాయం చేస్తారు.


మహేష్ ●



(క). మా ఊళ్ళో ఒక పండు ముసలాయన, ఉన్నారు. మీకెన్నేళ్ళండీ అని ఖర్మ చాలక ఎవరైనా అడిగితే, సోదివర్లిస్తాడు.

"నా జీవితంలో ఆరోవంతు బాల్యంలోనే గడిచి పోయింది. పన్నెండో వంతు కావ్య పఠనానికి సరి పోయింది. అప్పుడు ఇంట్లో చెప్పకుండా కాశీకి పారిపోయి, తర్క వ్యాకరణాలకి ఏడోవంతు జీవితం ఖర్చు పెట్టేశాను. అప్పుడు నన్ను ఇంటికి రప్పించి పెళ్ళి చేశారు. మరో ఐదేళ్ళకి పుట్టేడు మావాడు. కులదీపకుడవుతా డనుకున్నాను. నాలుగేళ్ళ కిందట జారిపోయాడు. వాడు అనుభవించిం దేముందీ? నా జీవితంలో సగకాలం బ్రతకడం ఓబతకడమా?" ఆ పైన కళ్ళనీళ్ళ పెట్టుకుంటాడు. ఇంక నోట మాట రాదు. అడిగిన వాళ్ళకే జాలి వేస్తుంది. ఇంతకీ ఆయనకి ఎన్ని ఏళ్ళో, మీకేమైనా తెలిసిందా?

(చ). భర్త వయస్సుని తిరుగవేస్తే భార్య వయసు వస్తుంది. ఇద్దరి వయస్సుల మొత్తము వారి వయస్సుల భేదానికి పదకొండు రెట్లు. వారి వయస్సులు ఎంతెంత?



(ట). అన్న కన్న తమ్ముడు 10 ఏళ్ళ చిన్న. వారి వయస్సుల మొత్తం 11. వారి వయస్సు లెంతెంత?

(త). మరో మూడేళ్ల తరువాత నా వయస్సుని మూడు రెట్లు చేసి, మూడేళ్ళ కిందటి నా వయస్సుకి మూడు రెట్లు తీసేస్తే నా ప్రస్తుత వయస్సు వస్తుంది. నా కెన్ని ఏళ్ళ?

(ప). రాముడు, భీముడు అని ఇద్దరు తోడు దొంగలు. భీముడికి ఇప్పుడున్న వయస్సులో రాము డున్న రోజులలో వాళ్ళిద్దరికీ స్నేహం కలిసింది. జాయింటుగా దొంగతనాలు చేయ నారంభించేరు. అప్పట్లో భీముడి వయస్సుకి ప్రస్తుతపు రాముడి వయస్సు రెట్టింపు. భీముడి వయస్సు ప్రస్తుతపు రాముడి వయస్సుకి సమానమైనప్పుడు ఇద్దరి వయస్సుల మొత్తమూ 90 అవుతుంది. వారిద్దరి వయస్సులూ ఎంతెంత?

(గ). "నా కొక కొడుకు, కూతురూనూ, మా అబ్బాయి వయస్సుని ఘనంచేసి, దానికి మా అమ్మాయి వయస్సు యొక్క వర్గం కలిపితే నేను పుట్టిన సంవత్సరం వస్తుంది." అన్నాడొక నడివయస్సు లెక్కల మేష్టారు. ప్రస్తుతం జరుగుతున్నది 1966వ సంవత్సరం అనుకుంటే ఆ ముగ్గురూ పుట్టిన సంవత్సరాలు చెప్పగలరా?—ఈ లెక్కలో అవసర మైన సమాచారం అంతా ఇచ్చినట్లు కనబడక, లెక్క అసాధ్యం అనిపిస్తుంది మొదటిసారి విన్నప్పుడు. కాని అసాధ్యం ఏమీ లేదు. ప్రయత్నించి చూడండి.

(జ). వయస్సులకు సంబంధించిన మరో చిత్ర మైన లెక్క ఉంది. "మా తండ్రి వయస్సుని తిరుగ వేస్తే నా కుమారుడి వయస్సు వస్తుంది. వారిద్దరి వయస్సుల లబ్ధమూ మా అబ్బాయి పెళ్ళి చేసుకున్న సంవత్సరానికి సమానం." అన్నాడొక వయస్సు మళ్ళిన గుమాస్తా. ఇంతకీ అతడు పెళ్ళి చేసుకున్నది ఏ సంవత్సరం?

ఇక్కడ వ్రాసిన ఏడు సమస్యలలోనూ మొదటి ఐదూ సరిగ్గా సాధించిన వారికి బీజగణితం బాగా వచ్చుననీ, చివరి రెండూ సాధించిన వారికి మంచి తర్కశక్తి ఉందనీ తెలుస్తుంది. ప్రయత్నించండి మరి.

జ వా బు లు

(క). 84 సంవత్సరాలు.

(చ). భర్త వయస్సు 54, భార్య వయస్సు 45.

(ట). అన్నకు $10\frac{1}{2}$ సంవత్సరాలు. తమ్ముడు ఆరు నెలలవాడు.

(త). 18 సంవత్సరాలు.

(ప). రాముడి వయస్సు 40, భీముడి వయస్సు 30.

(గ). ఈ సమస్యను సమీకరణాలు వ్రాసి సాధించాలనుకుంటే కుదరదు.

కొడుకు వయస్సు 13 సంవత్సరాలకు లోపే అయి ఉండాలి. ఏమంటే 13 యొక్క ఘనం (అంటే $13 \times 13 \times 13$ అన్నమాట) 2197. మనం నివసిస్తున్నది ఇంకా 20 వ శతాబ్దమే కదా! ఆ పిల్లవాడి వయస్సు 11 గాని అంతకు తక్కువగాని అవడానికి కూడా వీలులేదు. ఏమంటే 11 యొక్క ఘనం 1331. దీనికి కూతురి వయస్సు యొక్క వర్గం కలిపితే అతడు పుట్టిన సంవత్సరం రావాలి కదా? ఈ షరతుకి ఒడబడే వయస్సు ఏదీ దొరకదు. (కావాలంటే ప్రయత్నించండి). కనుక కొడుకు వయస్సు 12 సంవత్సరాలు మాత్రమే అయిఉండాలి. 12 యొక్క ఘనం 1728. ఇంక కూతురి వయసు 15 గాని అంతకు ఎక్కువగాని అవడానికి వీలులేదు. ఏమంటే $15 \times 15 = 225$. $1728 + 225$, 1953.


1953 లో పుట్టిన తండ్రికి 15 ఏళ్ళ కూతురు ఉండడం సాధ్యంకాదు (ప్రస్తుతం నడుస్తున్నది 1966 వ సంవత్సరం కదా!)

కూతురి వయసు, 13 గాని అంత తక్కువగాని అవడానికి కూడా వీలులేదు. ఏమంటే 13×13 169, $1728 + 169 = 1897$. అతడు పుట్టినది 1897 లో అయితే ఇప్పుడు ఆయనకి 69 ఏళ్ళ ఉండాలి. నడివయస్సు వాడని చెప్పేరు కనుక 69 ఏళ్ళ వాడు అయి ఉండడానికి వీలులేదు.

ఇకపోతే కూతురి వయస్సు 14 సంవత్సరాలు అయితే, $14 \times 14 = 196$, $1728 + 196 = 1924$. అతడు 1924 లో పుట్టి ఉంటే, అతడి కిప్పుడు 42 ఏళ్ళ ఉంటాయి. కూతురికి 14 ఏళ్ళ, కొడుక్కి 12 ఏళ్ళానూ. ఆ పిల్ల 1952 లోనూ, ఆ అబ్బాయి 1954 లోనూ పుట్టేరు.

(జ). ఈ సమస్యను కూడా సమీకరణాలు వేసి సాధిద్దామంటే కుదరదు.

కొడుకు స్వయంగా పెళ్ళి చేసుకునే వయస్సులో ఉన్నాడంటే అతడి వయస్సు 20—30 మధ్య ఉండవచ్చు. తాత వయస్సు 60—70 మధ్య ఉండవచ్చు. వాళ్ళ వయస్సులు 26, 62 కావచ్చు. $26 \times 62 = 1612$. కాని ప్రస్తుతం నడుస్తున్నది 20 వ శతాబ్దం కనుక 1612 లో పెళ్ళి అవడం కుదరదు. పోనీ తాత వయస్సు 70—80 మధ్య ఉందేమో చూద్దాం. వారి వయస్సులు 27, 72 కావచ్చు. $27 \times 72 = 1944$. కనుక ఇవే వారి సరియైన వయస్సులు. అతడు పెళ్ళి చేసుకున్నది 1944 లో.





బాదరాయణ సమ్మంధం—వయ్యంవయ్యం

రచన: పంతుల విశ్వనాధరావు

"ఏదమ్మడూ, ఒక్కరూపాయి వుంటే ఇమ్మీ" అందట ఓరోజు. వాళ్ల తమ్ముడిగారి వూరినుంచి వచ్చి రిక్షా దిగుతూనే, కామాక్షమ్మగారు వీధి గుమ్మంలో నిలబడ్డ మా ఆవిడని ఉద్దేశించి,

కామాక్షమ్మగారంటే మాఇంటి ప్రక్కవాటాలో కాపురముంటున్న 'రిటైర్డు రైల్వే స్టేషన్‌మాస్టారి భార్య. పిల్లా జెల్లా, చీకు చింత లేకపోవడంవల్ల చేతికి నోటికి దారి సాఫీగా జరుగుబాటు కావడంవల్ల ఆమెకు ఏభై ఏళ్లు వయస్సు ఉన్నా, ముదర యవ్వనంలోని మనిషిలా కనిపిస్తుంది. నిండుగా బొద్దుగా వుండే విగ్రహ పుష్టి, నెరిసీనెరియని జుత్తు, పచ్చగా పసుపు రాసుకున్న నుదుటి మీద ముద్దబంతి పువ్వంత ఎర్రని కుంకం బొట్టు—కళగా వుండే ముఖం ఆవిడది. ఎప్పుడూ నవ్వుతూ కలకల మాట్లాడుతూ ఉండే ఆవిడని పేటలోని వారంతా 'అందరికి తలలో నాలిక' అంటూ వుండేవారు.

ఆవిడ అడిగిందే తడువు— మహాభాగ్యమనుకొని మా ఆవిడ ఆ నెలాఖరు రోజులలో తన దగ్గర దాచుకున్న ఒక్కరూపాయి పదిలంగా పట్టుకెళ్ళి ఇచ్చిందట...అంతే!

ఇది జరిగిన ఆరునెలల వరకు ఆ యిద్దరూ కలుస్తూనే ఉండేవారు. సరదాగా మాట్లాడుకునేవారు. ఎన్నో కబుర్లు చెప్పుకునేవారు. అయితే, కామాక్షమ్మగారు తను బదులు పుచ్చుకున్న ఆ ఒక్క రూపాయి సంగతి మినహాయించి మిగతా ఇహపరలోక వ్యవహారాలు మాత్రమే ముచ్చటిస్తూ ఉండేవారు. మా ఆవిడే ఎన్నోసార్లు పరోక్షంగా ఆ రూపాయి గురించి అడగాలని ప్రయత్నించి, గంగాజల ధారాపాతంగా సాగే కామాక్షమ్మగారి వాగ్ధోరణితో సాంతం విఫలురాలైంది. ప్రత్యక్షంగా అసలే అడగలేకపోయింది...

ఒకనాటి మధ్యాహ్నం వీధి సావిట్లో విశ్రాంతిగా కూర్చుని 'చెల్లమ్మ'గారి దగ్గర అప్పుగా తీసుకున్న పావులా బదులు తీర్చనందుకు 'పుల్లమ్మ'గారికి తగువు చెప్తోంది కామాక్షమ్మగారు.

"చెత్త పావులా—పావులా డబ్బులు అప్పు చెయ్యనే కూడదు. చేస్తే వెంటనే తీర్చెయ్యాలి.." అంటూ చీవాట్లు పెడుతోంది. ఇదే అదునుగా మా ఆవిడ తన కోపం కూడా తీర్చుకుందామని గబగబా పరుగెత్తిందిపక్కవాటాలోకి. అయితే అప్పటికే టక్కున ప్లేటు ఫిరాయించింది కామాక్షమ్మగారు. "పోనీ చెల్లమ్మ వదినా! నువ్వు పుల్లమ్మకి పావులా డబ్బులు ఇచ్చేవనే అనుకో. అంతమాత్రాన ఇంతగా పీడించాలా ఆమెని. ఏదో మరిచిపోయి వుంటుంది. మరోకారణం అయి వుంటుంది. పేటలో నలుగురం నాలుగణాలు పారేస్తే నీ బోడి పావులా నీ ముఖాన్ని తగుల్తుంది. దానికోసం ఇంత తగువూ ఇన్ని రభసలూనా? ఛీ, పిదప కాలం పిన్నమనసులూను" అని నాలుగు దులిపింది మా ఆవిడని క్రీగంట చూస్తూ... ముఖాన కత్తి వేటుకి నెత్తురులేదు మా శ్రీమతిగారికి. పోయిన రూపాయి పోగా, ఈ చీవాట్లు ఎవరు భరిస్తారని 'కిం' మనకుండా వెనక్కివచ్చింది. ఆ తరువాత ఒకటిరెండు సార్లు తను గదిలో వంటరిగా వున్నప్పుడు కళ్ళు వత్తుకోడం, ముక్కు ఎగజీర్చడం కూడా జరిగింది.

"పోనీలేవే. ఒక్కరూపాయి కోసం ఎందుకేడవడం? నేను ఇచ్చుకుంటాగాలే నీకు" అన్నాను ఓరోజు ఓదారుస్తూ. అంతే. నా మీద మండ్రుమంది మా ఆవిడ "మీ రెప్పుడూ యింతే. నాదివేరు, మీది వేరు అని మనలో మనకే తన పరభేదం. అందుకే నాబ్రతుకు ఇరుగమ్మకి పొరుగమ్మకి అలుసైపోయింది." అని నాలుగంటించింది నాకు. 'కిమ్ము' పెట్టేను నేను.

"ఆవిడకి బదులిచ్చిన రూపాయి 'మీది' 'నాది' కాదండీ 'మనది' ఆ రూపాయి 'మనది' అంది మా ఆవిడ 'మనది' అనే మాట గట్టిగానొక్కి పలుకుతూ.

నిజమే. ఆ రూపాయి తిరిగి వచ్చేవరకు పడవలసిన బాధ కూడా మా ఇద్దరిదీ కలిసే ననిపించింది నాకు.

దానురాను కామాక్షమ్మగారు మాఆవిడ పట్టుదలలు, తామషాలు పెంచుకొని పరస్పరం మాటలు కూడా మానుకున్నారు. పేటలోని—మంచినీళ్ల పంపు దగ్గర ఆఖరుకి 'పసుపుకుంకాల' దగ్గర కూడా రెండు పార్టీలు తయారైనయి. కొందరు ఈవిడ పార్టీ, కొందరు ఆవిడ పార్టీ, మిగతావారు 'పులుసులో ముక్కలు.'

ఈ దెబ్బలాట తగ్గించకపోతే పర్యవసానం ఘోరముగా కనుపించింది నాకు. ఓరోజు ధైర్యం చేసి, మా ఆవిడ ప్రొద్దున్నే పెరట్లో స్నానం చేస్తూ వుండగా, వీధి గుమ్మంలోంచి ప్రక్కవాటాలోకి వెళ్లి "పిన్నిగారూ" అని పిలిచేను. కామాక్షమ్మగారిని నేను అలాగే పిలిచేవాడిని. అసలు ఈ తగువంతటికీ కారణం నేను ఆవిడని ఆవరస పెట్టి పిలవడమేమో ననిపిస్తుంది నాకు. నాకు 'పిన్నిగారు' కాబట్టి ఆవిడ మా శ్రీమతిని కాపురాని కొచ్చిన కొత్తరోజుల్లో

"కోడలు పిల్లా" అని ముద్దుగా పిలిచేవారు. మా ఆవిడ కూడా ఆవిడను "అత్తగారు" అని సాదరంగా మన్నించేది. దెబ్బలాట ఎక్కువైనాక మాత్రం కామాక్షమ్మగారిని "మా పినత్తగారు" అనేది తన పార్టీ వారితో! పనే... "ఎవరూ..?" అంటూ వచ్చిందావిడ కాసీ గ్లాసు తులసిమొక్క వారపెట్టి రుద్రాక్షమాల చేతిలో పట్టుకొని "నేనండీ...నే—చూడండి పిన్నిగారూ మీరు పెద్దవారు. ఆ రాక్షసి, మా ఆవిడ నా మాట వినకుండా వుంది. పోనీ, మీరైనా...ఇదిగో నేనిచ్చుకుంటాను. ఈ రూపాయి దాని ముఖాన విసిరేదురూ... నాకు బాధ తప్పుతుంది" అన్నాను బెక్కుతూనే! అంతే. ఇంతలోకే వెయ్యి తుపాకీలు పేలినట్లయింది. మిన్ను విరిగి మీద పడినట్లయింది 'ఖస్సు'మందావిడ నా మీద. "సిగ్గులేదూ? చేసుకున్న పెళ్ళాన్ని లొంగ తీసుకోలేక నన్ను అబద్ధాలాడమంటావా? దాన్ని వెళ్ళి నేను క్షమార్పణ కోరుకోవాలా? అందుకు నువ్వు నాకు రూపాయి లంచం ఇస్తావా? నేను పెద్దదాన్ని అయితే అక్కడికి నువ్వు, మీ ఆవిడ ఉగ్గుపాలు తాగుతున్న చంటిబిడ్డలా?... హూం?" అంటూ హుంకరించిందావిడ. ఆవిడ 'విసుర్ల' సారాంశం ఏమిటంటే ఆవిడ నిజంగా 'అప్పు'గా గనక పుచ్చుకొని వుంటే ఇలాంటి రూపాయిలు వంద అయినా విసిరి పారెయ్యగలదట. ఇప్పటికైనా మా ఆవిడ తనకు తానై 'అత్తగారూ ఓ పది రూపాయిలు కావాలి. ఇవ్వండి' అని అడుక్కుంటే 'ముష్టి పదిరూపాయిలు దాని ముఖాన వేసి' కొట్టగలదట. అంతేగాని "హవ్వ ఒక్కరూపాయి కోసం నన్ను ఇలా నడిరోడ్డు కెక్కిస్తుందా?" అంటుం దావిడ.

పరుగెత్తి వెళ్ళి మా గదిలో రేడియో పెద్ద స్వరంలోకి తిప్పి అక్కడికీ ఆ మాటలు మా ఆవిడకి ఎక్కడ వినిపించిపోతాయోనని నేను కూడా 'సుప్రభాతం' శ్లోకాలు పెద్ద గొంతుకతో చదవడం ఆరంభించేను. ఆవేళకి మా ఆవిడ దగ్గర నా పరువు దక్కించినందుకు ఆ తరువాత తీరుబాటుగా మా రేడియోకి శ్రీ వెంకటేశ్వరస్వామికి దండం పెట్టుకున్నాను కూడా!

అటుపైని రోజులు గడుస్తున్నకొద్దీ మా ఆవిడకి కామాక్షమ్మగారికి తగువు ముదురుతూ వచ్చింది. కాని తగ్గు ముఖం పట్టలేదు. నిజానికి అప్పట్లో మమ్మల్ని చూడ్డానికి హైదరాబాదు నుంచి మా చెల్లి జానకి రాకపోతే మా తగువు మరి తీరేదేకాదేమో?

రైలు స్టేషన్ నుంచి ఇంటికి వస్తున్న దారిలోనే అంతా చెప్పేను వివరంగా మా చెల్లికి.

"చూడమ్మా జానకీ, ఈ తగువు తీరనన్నా తీరాలి. లేకుంటే నాకీ ఊరి నుంచి బదిలీ అయినా కావాలి. అందుకే ప్రయత్నిస్తున్నాను నేను" అన్నాను నేను.

"ఫరవాలేదన్నయ్యా. నే చూస్తానే" అంది మా జానకి.

"ఏమోనమ్మా. నువ్వు ఎవరి పార్టీలో చేరతావోనని వారంరోజుల నుంచి ఎత్తులు పైఎత్తులు ఆలోచిస్తున్నారు మీ వదిన, ఆ కామాక్షమ్మగారూను" అన్నాను నేను.

"అలాగే చూద్దాంలే అన్నయ్యా" అంది అప్పటికే ఆలోచనలో మునిగి తేలుతున్న మా చెల్లి.

ఇంట్లోకి అడుగు పెట్టిన అరగంటలోనే వీధి గుమ్మంలోంచి "ఏం పిన్నీ బాగున్నావా?" అని అడుగుతూ ప్రక్కవాటాలో ప్రవేశించింది మా చెల్లి.

"రామ్మా. రా! ఎప్పుడు రావడం? అంతా కులాసానా?" అని లాంఛనంగా పలకరించేరు. అంత వరకు తలుపు సందులోంచి అన్నీ చూస్తున్న కామాక్షమ్మగారు,

"ఏదో పిన్నీ. నీ దయవల్ల ఇలాగున్నాను. అన్నయ్యను చూడాలని పేరేగాని నిన్ను చూడాలనే వచ్చేను పిన్నీ. అటుచూస్తే అత్తగారు కాల్చుకు తింటూంది. ఇటుచూస్తే అమ్మ నన్నే కేకలేస్తోంది. ఇంక నాకెవ్వరున్నారు పిన్నీ. నువ్వు తప్ప?" అని బిక్కమొహం పెట్టింది మా చెల్లి. "అయ్యో అదేమిటే సోద్యం క్రిందటిసారి వచ్చినపుడు 'మా అత్తగారు దేవత—దయ్యము' అని ఏమిటేమిటో వాగేవు ఇప్పుడిలా ఏడుస్తున్నావు." అని ఊరడించింది కామాక్షమ్మగారు.

"అంతే పిన్నీ. తెల్లనివన్నీ పాలు—నల్లనివన్నీ నీళ్ళు' అని అమాయకంగా నమ్మే రకం నేను. అంతా నీ పోలికే. అందుకే అందరి చేత ఇలా మాటలు పడుతున్నాను."

చివరికి కామాక్షమ్మగారి చేత పదిసార్లు ప్రతిమాలించుకొని మా జానకి చెప్పిన కథ యిది: ఓసారి తను సినిమాకి బయల్దేరిందట. 'నేనూ వస్తా'నని అత్తగారు వెంట పడిందట. 'పోనీ భర్తనో, కొడుకునో అడిగి ఓ రూపాయి డబ్బులు తెచ్చుకోకూడదూ?' తీరా సినిమాహాలు వరకు వచ్చి దిక్కులు చూస్తూ నిల్చుందట. 'పోనీలే' అని అప్పటి కప్పుడు మా చెల్లి ఓ రూపాయి అప్పుగా సర్ది మాట దక్కించిందట. అయితే ఆతరువాత "నా రూపాయి నాకు తిరిగి యివ్వాలా? వద్దా?" అని ప్రశ్నించింది జానకి. సంభాషణ ఎటు దారి తీస్తుందో పూర్తిగా అర్థంకాక తాళంచెవి మార్కు ముఖం పెట్టింది కామాక్షమ్మగారు. ఆవిడకు జబాబియ్యడానికి కూడా సావకాశం లేకుండా చెప్పుకుపోతోంది మా చెల్లి. "ఇంతకీ మరోలా అడిగితే ఓ పదిరూపాయిలు ఆవిడ ముఖాన పారేసినా నా కంత కష్టం అనిపించేదికాదు పిన్నీ. కాని ఇది అప్పుగా తీసుకున్న రూపాయి అప్పు తీర్చకపోతే ఋణానుబంధం ఏడు జన్మలదాకా వుంటుందంటారు అవునా?" అని మళ్ళీ అడిగింది మా చెల్లి.

పచ్చి వెలక్కాయ పడింది కామాక్షమ్మగారి గొంతుకలో.

"పోనీ. ఆవిడ పోరు తప్పుతుందని ఇక్కడికి వస్తే. "అయినా, ఒక్కరూపాయి కోసం ఆ పెద్దావిడని అంతగా సాధించకపోతే నువ్వే సరిపెట్టుకుంటే పోలా?" అని పెద్ద ఆరిందాలాగ నాకే నీతిపాఠాలు చెప్తోంది మా వదినగారు. ఈ విడకే నా కాస్త బుద్ధి చెప్పు పిన్నీ" అని మరో చురక తగిలించింది మా జానకి ఏమీ ఎరగనట్లు. కత్తివేటుకి నెత్తురు చుక్కలేదు కామాక్షమ్మగారి ముఖంలో. ఎదురు దెబ్బతీసే అవకాశంలేదు. వలలో పడిపోయింది తను. తన మెదడు మొద్దుబారి పోయిందోయేమో?.. గడగడ చెంబుడు మంచినీళ్ళు త్రాగి "గోవిందా" అని తేల్చింది ఆవిడ.

"వస్తా పిన్నీ. మళ్ళీ కలుస్తాను" అని చటుక్కున లేచి వచ్చేసింది మా చెల్లి.

"ఏమమ్మా. వచ్చిన దగ్గరనుంచి పెద్దరికాలకి బయల్దేరేవు నాతో మాటలైనా ఆడకుండా" అంది మా శ్రీమతి మెల్లిగా. జానకి ప్రక్కవాటాలోంచి రావడం చూసి.

"అవునులే వదినా! మీరంతా ఒక్కటే! పోనీ నా ఒక్కరూపాయి నాకిచ్చేయమని ఆ పెద్దావిడతోనే చెప్పరాదూ? ఏం? ఆవిడకు లేదా? పోదా? కాకపోతే నా ఒక్కరూపాయి కోసం ఋణం మూటకట్టుకు పోతుందా? పున్నామనరకానికి. అప్పు ఎగవేసినందుకు ఆరేళ్ళు, అబద్ధం చెప్పినందుకు ఇంకో ఆరేళ్ళు మొత్తం పుష్కరకాలం పుష్కలంగా పీడించి వదుల్తాడా యమధర్మరాజు. ఏదో అత్తగారు అయినవారు అని ఇంతగా చెప్తున్నాను కాని ఇదే ఏ ఇంగువమ్మో, పోరుగమ్మో అయి వుంటే ఏనాడో ఓ నువ్వుగింజ కూడాపారేసి వుందును. ఆ" అంది గట్టిగా మా చెల్లి.

ఆ మాటలు మా ఆవిడని ఉద్దేశించి అందో ప్రక్కవాటాలోవున్న కామాక్షమ్మగారి కోసం అందో ఆ గొంతుకే చెప్పింది. అయినా మా చెల్లి అదేమీ పట్టించుకోకుండా "పదన్నయ్యా కాస్త మామయ్య గారింటి వరకూ పోయొద్దాం" అని లేచింది అర్థాంతరంగా.

ఈ సంగతి ఏదీ అర్థంకాక ఈసారి క్వశ్చన్ మార్కు ముఖం పెట్టడం మా శ్రీమతి వంతు అయింది. ఆరాత్రి చాలాసేపటి వరకు కామాక్షమ్మగారింట్లో ఏవో సామానులు సర్దుతున్నట్లు అలికిడి అయింది. సాధారణంగా ఇలాటి విషయాలలో కలగచేసుకొని ఆ ముసలాయన—రిటైర్డు రైల్వే స్టేషన్ మాస్టారు—ఏదో సణుగుతున్నట్లు మాటలు వినిపిస్తునే వున్నై. అసలు సంగతి మాత్రం అర్థం కాలేదు.........

"కాస్త మోతాదు ఎక్కువైనట్లుంది చెల్లీ" అన్నాను నేను.

"అతిగా వాగేనేనని నాకూ భయంగానే వుందన్నయ్యా" అంది జానకి.

మర్నాడు ఉదయం నిద్ర లేచేసరికి వీధి తలుపు సందులోంచి ఓ తెల్లని కవరు పడివుంది. అందులో ఉత్తరంతోపాటు ఒకరూపాయి నోటు కూడా వుంది. ఆ ఉత్తరంలోని వివరాలు యివి:

"చి. సౌ. జానకిమ్మను పిన్ని ఆశీర్వదించి, జరుగురుగా రమ్మని అర్జంటు కవరు రావడం వల్ల రాత్రి బండిలోనే బయల్దేరి మా తమ్ముడుగారి వూరు వెళ్తున్నాను. నేను తిరిగి వచ్చేసరికి వారం పదిరోజులు పట్టవచ్చును. రేపో, ఎల్లుండో మీ అత్తగారు కూడా ఈ వూరు రావచ్చునని విన్నాను. ఆవిడను మరీ మరీ అడిగేనని చెప్పు. ఇందులో వుంచిన రూపాయి నాకు బదులు మీ అత్తగారు ఇచ్చిందని భావించు. ఇకపైని నువ్వు, మీ అత్తగారు యీ రూపాయి సంగతి విస్మరించి కలిసిమెలిసి సుఖంగా ఉండగలరని ఆశిస్తున్నాను. ఈ రూపాయి నా దగ్గర పుచ్చుకోవడం నీకు ఇష్టం లేకపోయినా లేక ఈలోగా మీ అత్తగారే స్వయంగా మనసు మార్చుకొని నీ రూపాయి నీకు అప్పు తీర్చినా, ఈ రూపాయి చి. సౌ. మీ వదినకు ఇచ్చివేయవలెను. చి. మీ అన్నయ్యకు చి. సౌ. మీ వదినకు నా ఆశీర్వచనములు. కామాక్షమ్మ వ్రాలు" అంతా విని "పాపం. మామయ్యగారిని మనింటికే భోజనానికి పిలవండి. ఆవిడ వచ్చేవరకు ఎంత ఇబ్బంది పడతారో యేమో!" అంది మా ఆవిడ.

"ఆసి నీ ఇష్టకం బంగారంకాను. ఈ రూపాయి మాత్రం నీకు ఇవ్వను సుమా వదినా" అంది మా చెల్లి బుంగమూతి పెట్టి.

"వద్దులే అమ్మా. నీ అత్తగారికే మరోసారి సినిమా చూపించుకో" అంది మా ఆవిడ..... ●

కొత్త నటి కనకదుర్గ



'రొమాంటిక్ రోల్సు అంటే ఎంతో ఇష్టం'



అందమూ–అమాయకత్వమూ

పండితుల యింట పుట్టిన వాళ్లంతా పండితులే అవుతారా అంటే చెప్పటం కష్టం. అలాగే కళాకారుల కుటుంబంలో జన్మించిన వాళ్లంతా కళాకారులు కాక పోవచ్చును. కాని అయ్యే అవకాశాలు ఉన్నవి. అలాంటివి అరుదుగా జరుగుతూ ఉంటవి.

కనకదుర్గ విషయంలో యీ సత్యం రుజూ అయినదని చెప్పటానికి ఆమె కళాకారుల కుటుంబంలో జన్మించడమే! "ఇంత లేతవయసులో మీకు సినిమాల్లో నటించాలనే కుతూహలం ఎలా కలిగింది?" అని అడిగిన నా ప్రశ్నకు యీ అమ్మాయి ఇచ్చిన సమాధానం గమనించదగ్గది. "మాపెద్దమ్మ పేరుమోసిన నటి. మా అక్క నటి. ఆర్టిస్టుల కుటుంబంలో పుట్టిన నాకు ఆర్టిస్టును కావాలనే కోరిక కలగడంలో ఆశ్చర్యం యేమున్నదండీ!"

నిజమే! అలాంటి వాంఛితం ఏర్పడడంతో ఆశ్చర్యపడవలసింది ఏమీ లేదుగాని అది కార్యరూపం దాల్చినపుడే ఆశ్చర్యమూ ఆనందమూ... పెద్దమ్మ అంటే జి. వరలక్ష్మి అక్క అంటే సుందరమ్మగారి అమ్మాయి రత్న. ఈమె వరలక్ష్మిగారి చెల్లెలి కుమార్తె అన్నమాట.

కనకదుర్గ తండ్రి శ్రీ కె. వెంకటేశ్వర రావు వ్యవసాయదారుడు. ఇక్కడకు సమీపాన గల కేశంబాకంలో వారికి పొలాలు ఉన్నవి. అక్కడే స్వంత భవంతి ఉంది. తల్లి శ్రీమతి వెంకటరత్నమ్మ. కుమారి కనకదుర్గ 1950అక్టోబరు 9న విజయవాడలో జన్మించింది. పుట్టడం అయితే అక్కడగాని పెరుగుదల అంతా మద్రాసులోనే. స్థానిక మైలాపూర్‌లో గల "ఆంధ్రమహిళ" లో మెట్రిక్ వరకూ చదువుకున్నది ఓరి

యుంటుంది, భరతనాట్యంలోనుంచి నేటి ఆధునిక పాశ్చాత్య నాట్యాల దాకా అన్నింటిని చక్కగా చేస్తుంది.

ప్రణయ రసాత్మక పాత్రలు పోషించడం అంటే కనకదుర్గకు మక్కువ ఎక్కువ. ఒకసారి హైదరాబాద్‌లో శ్రీ అక్కినేని నాగేశ్వరరావు గారింటికి వెళ్ళినపుడు సినిమాలలో నటించాలనే తనకున్న కుతూహలాన్ని ఆయన ముందు వెల్లడించింది. ''ఏ తరహా వేషాలు వేస్తావేమిటి?'' అంటూ అడిగారాయన. అందుకీ అమ్మాయి తడుముకోకుండా చప్పున ''రొమాంటిక్ రోల్స్ అంటే నాకెక్కువ ఇష్టమండీ!'' అన్నది. నాగేశ్వరరావుగారు ''ఊ!'' అంటూ నవ్వారు.

డి. బి. యస్. ఫిలిమ్స్‌వారి ''ప్రయివేటు మాస్టారు'' చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు తొలిసారిగా పరిచయం కాబోతున్నది కుమారి కనకదుర్గ. ఇందులో ఆమె శోభన్‌బాబు అర్ధాంగిగా నటిస్తున్నది. అందమూ లావణ్యమూ, నైర్మల్యమూ కనకదుర్గ వదనంలో ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. సహజంగానే అందమైనది గనుక, కృత్రిమ సౌందర్య సాధనాలను ఉపయోగించకుండా నిరాడంబరంగా ఉండటం అంటే ఎక్కువ ఇష్టం.

మొక్కలకు నీళ్ళు పోసి తోట పెంచడం, కోళ్ళ పెంపకం, మంచి చిత్రాలు చూడడం కనకదుర్గ సరదాలు. తెలుగు, తమిళ, కన్నడ, ఇంగ్లీ, హిందీ భాషలు ఆమెకు రాయనూ, చదువనూ, మాట్లాడనూ వచ్చును. చక్కని గొంతుతో సంభాషణ చెప్పే తీరు ఎంతో బాగుంటుంది.

బహుముఖ ప్రజ్ఞావంతురాలయిన నటిగా రాణించాలన్నది కుమారి కనకదుర్గ వాంఛితం. ఉత్సాహమూ, తపనా ఉన్న యీ చిరంజీవికి కూడ మంచి అవకాశాలు కల్పించి, ప్రోత్సహించవలసిన అవసరం పరిశ్రమలోని వారికి ఉన్నది. ఈ వ్యాసం ముగిస్తున్న సమయానికి రేఖా అండ్ మురళీ ప్రొడక్షన్స్‌వారి ''శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న'' చిత్రంలో కూడ నటిస్తున్నదన్న విషయం తెలియవచ్చింది.

—మోహన్‌కుమార్



నా విదేశయాత్ర

జమునారమణరావు



(గత సంచిక తరువాయి)

సాయంత్రం నాలుగుగంటలకు మాస్కో చేరుతూ వుంది మా ప్లేన్. ప్లేన్ దిగుతూ వుండగా క్రిందికి చూశాను. పరిచిన దూది మధ్యకు మా ప్లేన్ దిగుతోందనిపించింది. పొలాల్లోనూ, రోడ్ కిరువైపులా, చెట్ల మీద అంతా మంచుమయమే! మైక్‌లో ''వెదర్ మైనస్-5'' అని ఎనౌన్స్ చేశారు. ఇక మా గ్రూప్‌లో అందరూ నన్నుల్లరిపెట్ట సాగారు. ''జమునగారూ మీరు కాలు బైటపెట్టగానే చలికికట్టె ఐపోతార''ని ఒకరూ, ''మీరు ఏమీ (వేడి కలిగించే మత్తు పదార్థాలు) తీసుకోకుండా భీష్మించుకు కూర్చుంటే అన్యాయంగా చచ్చిపోతార''ని మరొకరూ ప రీ బెదరగొట్టసాగారు. పైకి ''నాకేమీ భయంలేద'ని దబాయించినా మనసులో మాత్రం బిక్కుబిక్కుమంటూనే వుంది, నిజంగా ఇక్కడ చలి అంత ఘోరమా అని.

''ధైర్యేసాహసేలక్ష్మీ'' అని తొడుక్కో వలసిన ''గంతా, బొంతా'' తొడుక్కుని, అందరితోపాటు నేనూ బయటికి అడుగు పెట్టాను. ఆహ్వానసూచకంగా చలిగాలి రివ్వున వీచింది. ''అబ్బా ఈ చలిని 15 రోజులపాటు ఎలా భరించగలను?'' అనిపించింది.

నాలుగు అడుగులువేసిన తరువాత తగు జాగ్రత్తతో ఈ చలిని తట్టుకోగలనని పించింది. మరి నాలు అడుగుల్ని వేసేసరికి ''కినిమాటోగ్రఫీ''కి చెందిన (అంటే చలన చిత్రపరిశ్రమను అక్కడి వాళ్ళు కినిమాటోగ్రఫీ అంటారు) ప్రభుత్వాధికారులు పూలగుత్తులతో మాకు స్వాగతం చెప్పారు. వారితో కస్టమ్స్‌లోకి వెళ్ళి ఫార్మాలిటీస్ ముగించుకుంటుండగా, బిల బిల మంటూ మన తెలుగు స్టూడెంట్స్ 10 మంది పూలగుత్తులతోసహా మమ్మల్ని చుట్టు ముట్టారు. మామూలుగా కస్టమ్స్ ఆవరణ లోనికి ఎవరినీ రానివ్వరు. వీళ్ళింతమంది ఎలా రాగలిగారా అని ఆశ్చర్యపడి వాళ్ళనే అడిగేశాం. మొదట్లో వాళ్ళని అభ్యంతరపెట్టారుట. ''మా తెలుగువాళ్ళు వస్తున్నారు. మా వాళ్ళకు మేం స్వాగతంచెప్పాలి. వాళ్ళు బయటకు వచ్చేవరకు ఆలశ్యాన్ని భరించలేం'' అంటూ రష్యన్ భాషలో అందర్నీ దబాయించి, లోపలికి వచ్చేశారుట. అంతేకాకుండా ''భారతీయుల్ని, భారతీయ విద్యార్థుల్ని చాలా లైక్ చేయ్యడమే కాకుండా బాగా గౌరవిస్తారని'' చెప్పి అందువల్లే మేం రాగలిగామన్నారు మన ఆంధ్రదేశపు విద్యార్థులు. మాకు ఇది వినగానే చాల సంతోషం, గర్వం కూడా కలిగాయి. ఇంత దూరదేశంలో కూడ మన తెలుగు విద్యార్థులు వుండటం, మమ్మల్ని ఎంతో ఆదరంగా ఆహ్వానించడం చూస్తే మేమందరం భారతదేశంలోనే వున్నట్లు అనుభూతి, కలిగింది. అప్పటికి మన చిత్రాలు ఏమేం చూపించారు అని అడగ్గా, ''చెమ్మీన్, షహీద్‌లు చూపించారనీ, మన ''పదండిముందుకు'' చిత్రానికి పబ్లిసిటీ అంతగా లేదనిన్నీ, అంతేకాకుండా ఎప్పుడు చూపబడేదీ తెలియలేదనీ అన్నారు. కారణం ఇంగ్లీషు స్క్రిప్టు సమయానికి రాలేదట.

ఆ స్క్రిప్ట్‌లోని ప్రతి సంభాషణను రష్యన్ భాషలోనికి అనువదించి ప్రదర్శన సమయంలో కామెంటరీ మైక్‌లో చెప్తూ వుంటారు. మా సంభాషణలు కూడా కొద్ది వాల్యూమ్‌లో వినిపిస్తూనే వుంటాయి. సంభాషణలను రష్యన్‌లోనికి అనువదించడం కొంచెం టైము పట్టవచ్చు. అందువల్ల ఆలశ్యంగా ప్రదర్శింపబడుతోందని తెలియ వచ్చింది. లేకుంటే మా చిత్రమే ప్రారంభోత్సవంనాడు ప్రదర్శింప బడేది. మా చిత్రానికి రష్యన్ పేరు ''పెరియోత్'', అర్థం- ''పదండి ముందుకు''

మన విద్యార్థులతో ముచ్చటిస్తూ ''లాంజ్'' లోకి వచ్చి మాతోవచ్చిన బృందం వారికి తెలుగు విద్యార్థుల్ని పరిచయం చేశాం. ఈలోగా మా లగేజి కార్లలో పెట్టబడింది. అందరం 5, 6, కార్లలో సర్దుకుని బయలుదేరాం. అప్పటికి 5 గంటల అయింది. పొగమంచు దట్టంగా వుంది. కనుచూపుమేర ఏమీ కనుపించడం లేదు. రోడ్డు కిరుప్రక్కలా చెట్లమీద మంచు గడ్డకట్టుకుని వుంది. రోడ్డంతా బురద బురదగావుంది. ఈ దేశంలోకూడా రోడ్లు మట్టిగావుండటం ఆశ్చర్యం కలిగించింది నాకు. ఆ విషయమే మాతో వచ్చిన ''లేడీ ఇంటర్‌ప్రెటర్''ను అడిగాను. ఈ సీజన్‌లో మంచు రోడ్డుమీద పడి కరిగి నీరు అవుతున్నందున అలాగేవుంటుం

దని, నవంబర్‌లో చాలా బావుంటుందని చెప్పింది. ఇక్కడ రష్యన్ వనితలగురించి రాయవలసి వస్తుంది మాతో వచ్చిన అమ్మాయి 5½ ఎత్తులో బంగారు ఛాయలో కొన తేలిన ముక్కుతో, ఆమె వచ్చని ఆకర్షణీయమైన కనులతో ఎంతో అందంగా వుంది నాకు రష్యన్ వనితలు స్థూలకాయులుగా వుంటారని చెప్పారు. ఆ మాట ఆ దేశంలో అడుగు పెట్టాక నిజమని అనిపించింది కాని 20 సంవత్సరాల వరకు ఆ దేశపు వనితలు అందంగావుండటం మేం గమనించాం పెళ్ళి అయి 25 ఏళ్ళు దాటగానే చాలా మోటుగా, లావుగా, అయిపోతారని తెలుసుకున్నాం. కారణం వారు చేసే మొరటు పనులు మగవారు నడపవలసిన కార్లు, బస్సులు, ట్రాక్టర్లు నడపడం వారు తీసుకునే ఆహారం కూడా అటువంటిదే! అందువల్ల అలా వుంటారని తెలిసింది

ఎయిర్‌పోర్టు నుంచి వూరికి దాదాపు 15 మైళ్ళు వుండవచ్చు. నగరంలో ప్రవేశించగానే 6 అంతస్తులుగల దీర్ఘ చతురస్రాకారపు భవనాలు ఎక్కువగా కనపించాయి అవన్నీ చక్కగా మోడరన్‌గా ఉన్నాయి అక్కడక్కడ పాతకాలపు భవంతులు కూడా కనిపించాయి దారి పొడుగునా ట్రక్కులు, ట్రాక్టర్లు, క్రేన్లు ఎక్కువగా వున్నాయి. కార్లు చాలా తక్కువ అవి కూడా పాతమోడలు పెద్ద కార్లు అందమైన లగ్జరియస్ కార్లు అంతగా కనుపించవు ఎక్కడ చూచినా ఇళ్ళుకట్టే క్రేన్లు కనపడ్డాయి అక్కడి భవనాలు మన దేశంలో లాగా ఇటుకల తోనూ వందలకొద్దీ కూలీలతో కట్టరు. ముందుగా పెద్ద సిమెంటు స్లాబ్స్(గోడలు) లారీల్లో అక్కడికి చేరవేస్తారు బిల్డింగు ఫౌండేషన్, స్ట్రక్చరు ఐరన్ పిల్లర్స్‌తో పెట్టి ఈ సిమెంటు గోడలను క్రేన్‌తో ఒక్కొక్కటే పైకి తీసుకువెళ్ళి అట్టముక్కలను పేర్చినట్లుగా గోడల్ని నిలబెట్టి, జాయింటు కార్నర్లలో ఇనపతీగలతో వెల్డ్ చేసేస్తారు ఆ గోడలకు సిమెంటు ప్లాస్టరింగ్ చేసి డెకరేట్ చేస్తారు. ఫ్లోరింగ్ వుడ్‌తో చేస్తారు. 6 అంతస్తులు దాదాపు 100— అపార్ట్మెంట్స్ వుండేభవనం ఒక నెల రోజుల్లో కట్టేస్తారు.

ఇలాంటి కబుర్లు చెప్పుకుంటూ మాస్కోలో అతి పెద్దది, పేరు పొందినదీ, ఐన "ఉక్రేన్" హోటల్ చేరాము ఆ హోటల్లో దిగేవారంతా విదేశీయులే! చాలా మంది ప్రభుత్వపు అతిధులే

ఈ హోటల్ మోడల్ మాస్కో యూనివర్సిటీలా వుంటుంది 15 అంతస్తులతో "ఓల్డు ఆర్కిటెక్చర్"తో వుంది అందరము దిగి లోపల అడుగుపెట్టగానే వెచ్చని గాలి తగిలింది. విశాలమైన హాల్లో ఎంతో పెద్దవైన షాండిలర్స్ వున్నాయి. చాలా

"ఇదేదో డిటెక్టివ్ కథలోవుండే గదిలాగ వుందేమిటని?" నాకు భయం వేస్తోం దన్నాను. వాళ్ళు—"భయంలేదు. రేడియో స్పీకర్ వుంది పాటలు పెట్టుకోండి, ఫోన్‌లో మాట్లాడండి" అంటూ అక్కడ ఫోన్ చేసే పద్ధతులు తెలియచేసి వెళ్ళిపోయారు. గుమ్మడిగారి గదికి అంతసేపూ గలగలలాడుతూన్న గది యధాప్రకారం నిశ్శబ్దాన్ని వరించింది. ఆ నిశ్శబ్దాన్ని భరించలేక రేడియో స్పీకర్ గొంతు పెద్దదిచేశా ఆ దేశపు "ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్" రాసాగింది అప్పటికి 6 గంట లయింది. 6½ కు ఇండియన్ ఎంబసీలో మీటింగ్



మాస్ ఫిల్మ్ స్టూడియో ప్లాస్టిక్ మేకప్ డిపార్ట్మెంటును దర్శిస్తున్న దృశ్యం

మంది విదేశీయులు కూర్చొని నెమ్మదిగా మాట్లాడుకుంటున్నారు ఆ హాల్లోని స్థంభాలు మన పౌరాణిక చిత్రాల్లోని వాటిలా వున్నాయి అందరికీ వేరే వేరే రూమ్స్ 'ఎలాట్' చేశరు. మా ముగ్గుర్నీ ఒక్కొక్కర్ని ఒక్కొక్క ఫ్లోర్‌లో వేశారు ఎవరి గదికి వాళ్ళు వెళ్ళాం. నా గదిలో అడుగు పెట్టగానే భయంవేసింది, ఎక్కడో కార్నర్‌లో డిమ్‌గా వెలిగేలైట్, పాత మోడల్ ఫర్నిచర్, పెద్ద కిటికీ భరించలేనంత నిశ్శబ్దత గూడుకట్టుకొనివుంది నన్ను రూమ్‌లో వదలడానికి వచ్చిన గుమ్మడిగార్ని, తెలుగు మిత్రుల్ని అడిగా

వుంది అరగంటలో టాయిలెట్ అయి అందరం రిసెప్షన్ హాల్లోకి చేరాము. ఎంబసీ వారి కార్లలో అందరం ఇండియన్ ఎంబసీకి చేరాం అక్కడ ఇండియన్ అంబాసిడర్ శ్రీ కేవల్‌సింగ్‌ని, చాలామంది తెలుగు, తమిళ, హిందీ ప్రముఖ వ్యక్తుల్ని కలుసుకున్నాం. ఒకరికొకరు పరిచయం చేయబడ్డాం ½ గంట అక్కడ గడిపి 7 గంటలకు ప్రఖ్యాతిగాంచిన రష్యన్ బాలే "లైలా—మజ్నూ" చూడ్డానికి వెళ్ళాం నాకు మద్రాస్‌లోనే రష్యన్ ఎంబసీలో లైలా— మజ్నూ బాలే డాన్సు చిత్రం చూచే అవకాశం కలిగింది స్టేజిపైన— తెరపైన వుండే

నా విదేశయాత్ర

వ్యత్యాసాన్ని చూడగలిగాను. నాకు పర్సనల్‌గా సినిమా కంటే స్టేజిపైనే ఈ నృత్యకథ బాగుంది అనిపించింది. స్టేజిపై నృత్య భంగిమలకంటే భావప్రదర్శనకే ప్రాధాన్యత నిచ్చారు. ఒకేసారి ఆ స్టేజిపై 200 మంది ఆర్టిస్టులు నటించగలరు. ఆ థియేటర్ చాలా ఆధునిక పద్ధతుల్లో నిర్మించబడింది. ఆ లైటింగ్స్ అరేంజిమెంట్స్, మైక్ అరేంజ్‌మెంట్స్ అద్భుతంగా వున్నాయి. మైక్స్ ఎక్కడవున్నవో అసలు కనిపించనేలేదు. డాన్సు పూర్తి అయ్యేసరికి 10 గంటలు అయింది. హోటలుకి వచ్చి, డిన్నర్ తీసుకుని, రూమ్‌కు చేరేసరికి 12 అయింది. ఆ దేశంలో శాకాహారులకి ఇబ్బందే! శాకాహారం కావాలంటే బన్, బ్రెడ్, బట్టర్, పచ్చికూరగాయలు ఇస్తారు. దీనితోకూడా "బ్లించకీ" అనే పదార్థం ఇస్తారు. అది మన సేమ్యాస్ ఆకారంలో వుండే స్వీట్. ఫ్రూట్స్ ఆపిల్స్, ఆరెంజి ఇస్తారు. ఆ పూట అవి బాగానే వున్నట్టనిపించింది. ఆహారం విషయంలో నాకు సమస్యలేదు అనుకొన్నాను. కాని 15 రోజులపాటు ఎక్కడికి వెళ్ళినా ఈ "బ్లించకీ" దర్శనంతో మొహం మొత్తింది. ఎలాగో రోజులు గడిచాయనుకోండి.


చలి కాలంలో 9 గంటలకు గాని వెలుతురు అసలురాదు. గుమ్మడిగారు 8½ కు నాకు రింగ్ చేశారు నిద్రలేపడానికి. ప్రొద్దున్నే నాకు కాఫీ అలవాటు. కాఫీ కోసం వెయిటరును పిలిచాను. వెయిటర్స్ అంతా ఆడవాళ్ళే. ఒకామెను పిలిచి ప్రొద్దున్నే నాకు కాఫీ కావాలని చెప్పాను. ఆమెకు ఇంగ్లీష్ అర్థంకాదు, నాకు రష్యన్ అర్థంకాదు. ఇలా అవస్థపడుతుండగా తెలుగు మిత్రులు వచ్చారు సమయానికి. వారితో నాకు కాఫీ కావాలని ఆమెకు చెప్పమని అడిగాను. వాళ్ళు చెప్పారు. ఆ రోజు నుండి ప్రతిరోజూ ప్రొద్దున్నే కాఫీ వచ్చేది. 9 గంటలకు బ్రేక్‌ఫాస్ట్ ముగించుకుని సైట్‌సీయింగ్‌కు బయలుదేరాం.

(ఇంకా వుంది)

రంగులరాట్నం

నిన్నటి, నేటి, రేపటి తారాగణంతో నిర్మించిన రంగులరాట్నం, నిన్నటి చిత్రాల్ని మరపించి, నేటి చిత్రాల్ని మురిపించి, రేపు మంచి భవిష్యత్తును కురిపించుకోగల చిత్రం.

'చదువుతో సంస్కారం అబ్బదు. సంస్కారం అని చెప్పుకోబడేది నాగరికతకాదు. నాగరికత అనేది పాశ్చాత్యుల్ని అనుకరించటంలో లేదు' ఇది అందరికీ తెలిసిననిజం. నిజంలో 'యిజా'న్ని బయటికి తీసి రకరకాల పాత్రల్లో యిమిడించి నాటికి రంగులు పూసి రాట్నంలో ఇరికించి దానిని గిర్రున తిప్పినపుడు ఉద్భవించిందే రంగులరాట్నం. వెలుగు చీకట్ల కాలచక్ర పరిభ్రమణంలో రంగులరాట్నం తిరుగుతున్నప్పుడు, పొల్లుబడిన మానవజీవితాల



"రంగులరాట్నం" లో విజయనిర్మల (పే-జ)

రంగులు బయటపడుతూ వుంటాయి. రాట్నం తిరిగే కొద్దీ రంగుధార్ల భంగిమలన్నీ అంతర్లీనమైపోతాయి. కంటికి కనిపించకుండా మటుమాయమైపోతాయి. సంఘంలో సంఘర్షణల్ని రేకొత్తే చీడపురుగులు మలమలా మాడిపోతాయి. కుళ్ళు పటాపంచలైపోతుంది. అవినీతి ఆమడదూరం విసిరి వేయబడుతుంది. స్వార్థాన్ని రంగరించుకున్న దుర్మార్గాలన్నీ ఒక్కటొక్కటిగారూపుమాసిపోతాయి. మిగిలేది ఒక్కటే ఒక్కటి అదే స్వచ్ఛమైన నిరాడంబరమైన కాంతి పుంజం! అందులోనే దైవత్వముంది మానవత్వముంది. మనుగడను మహిమాన్వితం చేయగల అనురాగ రాగరంజితమదే. ప్రేమ, దయ, దాక్షిణ్యం ఆదిగాగల ఉత్తమ గుణసాంప్రదాయాలకు ప్రతిరూపం. రంగుల పరిశోధనలో శాస్త్రకారులు ఈపరమ సత్యాన్ని ఒప్పుకున్నారు. రంగులరాట్నం పరిశీలనలో ప్రేక్షకులు మెచ్చుకుంటారు.

చలన చిత్రాలు కేవలం జనుల్ని అలరించడానికి కాకుండా నీతి ప్రబోధకంగా వున్నప్పుడు దాని విలువ ఎప్పుడూ మిన్నగానే వుంటుంది. 'అబ్బే రొమాన్సు లేకుండా చిత్రమేమిటోయ్ డబ్బు దండగ' అనే పద్ధతి వ్యాపారదృష్ట్యా నిజమైందే. ఈవిధానాన్ని జయించుదామనే ప్రయత్నం రంగులరాట్నం చిత్ర నిర్మాణంలో జరిగింది.

సుందరరామయ్య పూలమ్మినచోట కట్టెలమ్మలేక భార్యసీతమ్మను, కూతురు జయను, పెద్దకొడుకు సూర్యంను, చిన్నకొడుకు వాసును తీసుకుని పట్నంవస్తాడు. సత్యకాలపు మనిషికి మంచిరోజులు తక్కువ. అతను కన్నుమూశాడు. సీతమ్మ బ్రతుకు కటికి చీకటైపోయింది. ఆచీకట్లో ఒక నక్షత్రం వెలిగింది. అదిసూర్యం. సూర్యాన్ని పెద్ద లాయరు చేయాలని భర్త ఆశయం. ఆమెకా ధైర్యం వున్నా స్థోమత అడ్డునిలిచింది. పైల్వాన్ శంకర్రావు ఆదుకున్నాడు. అన్నను లాయరు చేయడానికి వాసు స్వార్థత్యాగం చేశాడు. శంకర్రావుదగ్గర ఉద్యోగం చేశాడు. సీతమ్మ చాకిరీలు చేసింది. ఎలాగైతేనేం భర్తకోరికను తీర్చ గలిగింది. ఇక్కడ వరకు రంగులరాట్నాన్ని ఆయత్తం చేయడం జరిగింది. ఇక తిరగడం మొదలు పెడుతుంది. మిడిమేలపు సిరితో మిడిసిపడుతున్న చైర్మన్ అప్పలస్వామి కూతురు వనజను పెళ్ళాడుతాడు సూర్యం. దానివల్ల తల్లికి తమ్ముడికీ, చెల్లెలికీ కొన్ని కష్టనష్టాలు తారసిల్లాయి. ఇక్కడ సూర్యం ఆదర్శం దెబ్బతింది. బహుశావాసు పాత్రను ప్రతిభావంతంచేయడాని కయి వుంటుంది. ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగ పరచుకున్నాడు. వాసుగా నటించిన కొత్తనటుడు చంద్రమోహన్ చకచకా నటించి తారాగణంలో చంద్రుడయిపోయాడు. అంజలీదేవి నటనకు సీతమ్మ పాత్ర గీటురాయి అయింది. ఈతరహా పాత్రలకు ఆమె ఒక్కరే నిండు జీవం పోయగలుగుతారు. చైర్మన్‌ను బాబాయని పిలిచే సుబ్బారాయుడుగా కాకరాల నటన ఎంతో ఉత్సాహంగాను సహజంగాను

వుంది. మరో ఆకర్షణ నీరజ నటన. పేరులో కొత్తదనమెలా అయితేవుందో నటనలోనూ వన్నె చిన్నెలున్నాయి. ఛైర్మన్ అప్పలస్వామి కుటుంబం గురించి చెప్పాలంటే ఒక తెగ మనుష్యులమీద వ్యంగ్యచిత్రీకరణ కనిపిస్తుంది. అప్పలస్వామిగా రమణారెడ్డి చక్కగా నటించారు. నీరజగా సుకన్య పాత్ర అవధులమేరకు పరవాలేదు. రామమోహన్ మెచ్చుకో దగిన నటననే కనబర్చారు. మిసెస్ ఛైర్మన్‌గా వున్నవల్లి పాత్రోచిత నటన బాగుంది. నాగరాజారావు అవకాశం ఇస్తే సామర్థ్యం చూపించగల నటుడు. వీరందరి ప్రమేయంతోను కథ కళకళ లాడింది. అన్నదమ్ముల మధ్య ఎప్పుడైతే మనస్పర్థలు లేచాయో అప్పుడు వాసు శంకర్రావు పంచన చేరాడు. పురపాలకసంఘం ఎన్నికలు దగ్గరకొచ్చి అప్పలస్వామిని తొందర చేశాయి. అతనికి ఊళ్లో పరువులేదని తెలుసు. అందుకు అల్లుడు సూర్యాన్ని నిలబెట్టాడు. అంతకుముందే వాసు ఎన్నికల అభ్యర్థిత్వానికి దాఖలుచేయడం అయిపోయింది. అన్నదమ్ములమధ్య తీవ్రమైన అశాంతి ఏర్పడింది. కావలసినంత ఎన్నికల హడావిడీ (ఈ హడావుడి రాబోయే సాధారణ ఎన్నికలకు కావలసినంత సరంజామా కూర్చి పెడుతుంది) అంతరాలెరిగిన శంకర్రావు వాసును విరమించేట్టుచేస్తాడు. సూర్యం ఛైర్మన్ అయాడు. శంకర్రావు తనకూతుర్ని వాసు కిచ్చి పెళ్లిచేసే సమయం అది. అతను నడిపే పార్కుకు జప్తువారంటు వచ్చింది కారణం ఛైర్మన్. అన్నగార్ని అర్థించాడు వాసు. ఫలితం లేకపోయింది. వచ్చిన రోషంతో అన్నగారిమీద వురికాడు. హోరాహోరీ పోరాటం సాగింది. సీతమ్మ ప్రమేయంతో ఇద్దరూ కళ్లు తెరిచారు. దుష్టశక్తులు తలలు వాల్చేశాయి. నీతిదాయకమైన సుఖాంతం. ప్రేక్షకులు మరచి పోలేని సీతమ్మ మమత చంద్రమోహన్ నటనాను.

అంత చలాకీ సంభాషణల్లోను అక్కడక్కడ నాటకీయత కన్పించింది. అయినా, కథాగమనం కప్పి వుచ్చేస్తుంది. సంభాషణల్లోను హాస్యంలోను కొత్తదనముంది. జానకి, బి గోపాలం పాడిన కొసరాజు గారి పాట 'వెన్నెలరేయి చందమామ' వినసొంపుగా వుంది. తక్కిన పాటల్లో భావగరిమ గడుసుగావుంది. పిల్లల్ని పెద్దలుగా చేసేముందు, వాళ్లను భవిష్యత్తుకు తగ్గవాళ్లుగా మలచడంలో దర్శకుని ప్రతిభ వ్యక్తమవుతుంది. చిత్రీకరణ సహజంగా వుంది. ఫైల్మాన్ శంకర్రావు దగ్గరవుంటూ అపర ఫైల్మాన్‌గా పేరు తెచ్చుకున్న వాసు, అన్నగారితో అంతగా ఎలా దెబ్బలు తినగల్గాడు? అని ప్రేక్షకులు గొణుక్కుంటారు. సాధారణంగా ఇంటికి పెద్దవాడు ఉపకారి బుద్ధితోను, రెండవవాడు ఆకతాయిగాను వుంటుంటారు. ఇక్కడ కొంచెం కొత్తదనం చూపించబడింది. పిల్లలుగా వున్నప్పుడు అన్నగారే చిన్నవాడుగా కన్పిస్తాడు. లోపమనుకోక పోతేకాదు. రాట్నం తిరుగుతున్నప్పుడు ఇటువంటి వయినాలు మాయమైపోయి రంగులీనే రంగులరాట్నం మిగులుతుంది.

మిగతా తారాగణంలో వున్నవారు వాణిశ్రీ, రాధాకుమారి, విజయశ్రీ, బేబిరేఖ, ప్రమీలారాణి, పద్మ, ఆదిలక్ష్మి, శివరాం, త్యాగరాజు, నాగరాజారావు, పి జె శర్మ, మాస్టర్ ఆచారి, మాస్టరు రామకృష్ణ, మాస్టర్ సంజీవి

కథ పాలగుమ్మి పద్మరాజు,

స్క్రీన్‌ప్లే బి ఎన్ రెడ్డి, మాటలు డి. వి నరసరాజు, పాటలు దాశరథి, నారాయణరెడ్డి, కొసరాజు, భుజంగరాయ శర్మ, సంగీతం రాజేశ్వరరావు, గోపాలం, కళ ఎ కె శేఖర్ కూర్పు ఎం ఎస్ మణి, కె సత్యం, ఛాయాగ్రహణం యు రాజ్‌గోపాల్ శబ్దగ్రహణం వి శివరాం, జి వి రమణన్ నృత్యం వెంపటి చినసత్యం, వేణుగోపాల్

వాహినీ స్టూడియోలో నిర్మించిన ఈ చిత్ర నిర్మాత, దర్శకుడు శ్రీ బి యన్ రెడ్డి.


—సి. కనకాంబరరాజు

ఉన్న దయానదన్ చిల్డ్రన్స్ టౌన్ అనాధ బాలల సహాయార్థం ఏర్పాటుచేసిన ప్రీమియర్‌తో ప్రారంభమైంది

'మేడ్ ఫర్ ఈచ్ అదర్'' ఎన్నికలో న్యాయ నిర్ణేతలుగా కుమారి రాణి మీనా ముత్తయ్యా, శ్రీమతి పద్మినీ రామచంద్రన్, శ్రీ జె ఎ రాబ్సన్, మేజర్ జనరల్ ఎస్ జె సోఢీ, డాక్టర్ వి ఎస్. సుబ్రహ్మణ్యం వ్యవహరించారు. మద్రాసు, ఢిల్లీ, కలకత్తా, బొంబాయిలలో ఎన్నికైన నలుగురు దంపతుల్ని మరల బొంబాయిలో జరిగే తుది ఎన్నికలో అత్యుత్తమ దంపతులుగా ఎన్నికచేసి వారిద్దర్నీ ఒక వారం రోజులు రోమ్‌లో గడిపేందుకు పంపిస్తారు

ఈ ఛారిటీ ప్రీమియర్ లో వసూలైన రు 6,000పై చిలుకు ధనాన్ని దయానదన్ వారికి అందించడం జరిగింది.

—ఎం.]



శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్నలో సుశీలతో కలసి కొత్త గాయకుడు యస్. పి. బాలసుబ్రహ్మణ్యం ఒక పాట పాడినప్పటిచిత్రం. సంగీతదర్శకుడు కోదండపాణి, పద్మనాభంలను కూడ ఈ చిత్రంలో చూడవచ్చును.

లేడీ ఎల్

* రొమెయిన్ గ్రే నవల ఆధారంగా పీటర్ ఉస్తినోవ్ దర్శకత్వంలో, కార్లో పాంటీ నిర్మించిన చిత్రం ''లేడీ ఎల్'' చక్కని వినోదాన్ని, సున్నితమైన హాస్యాన్ని అందించేలావుంది

చిత్రంలో లేడీ ఎల్‌గా సోఫియాలోరెన్ ప్రదర్శించిన నటన అత్యంత ప్రతిభావంతంగా వుంది. పాల్‌న్యూమన్, డేవిడ్ నివాన్‌లు చక్కగా నటించారు. దర్శకత్వం, ఛాయాగ్రహణం ప్రతిభావంతంగా ఉన్నాయి.

ఈ చిత్రం మద్రాసులోని ఆనంద్ థియేటర్‌లో జనవరి 4 వ తేదీ రాత్రి ఇంపీరియల్ టొబాకో కంపెనీవారు విల్స్‌ఫిల్టర్ సిగరెట్ ప్రకటనార్థం ఉద్దేశించబడిన 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' ఎన్నిక సందర్భంలో మద్రాసుకు 7 మైళ్లలో

అవీ - ఇవీ...

నవంబరు 27, 28 తేదీలలో మ్యాక్సీ, దక్షిణ భారత నటీనట సమాఖ్యవారు శ్రీ రావి కొండలరావు రచించిన ''పట్టాలు తప్పిన బండి'' నాటకాన్ని ప్రదర్శించారు. ఇందులో శ్రీ కె వి. ఆర్ మూర్తి, ఎన్ ఎ ఎల్ నరసింహం, శ్రీ సి వి శర్మ, శ్రీ ఎం. ఎస్. ప్రసాదరావు, శ్రీ జీ వి. సుబ్రహ్మణ్యం, డా ఎస్ కె. రావు, శ్రీ ఎం రావుస్వామి, కుమారి దేశిరాజు అరుణ నటించారు. శ్రీ జి వి సుబ్రహ్మణ్యం దర్శకత్వం వహించారు.

హాస్యరస ప్రధానమైన ఈ నాటకాన్ని రెండురోజులు తిలకించి ప్రేక్షకులు నటీనటుల చాకచక్యాన్ని సమాఖ్యకృషినీ మెచ్చుకున్నారు.

ఓ. వి.

చిత్రలహరి

కొత్త సంవత్సరంలో రెండో రోజున వీనస్ స్టూడియో ఆవరణలోకి అడుగు పెడుతూండగా—గేటుకీ, ఆఫీసు బిల్డింగ్స్‌కీ మధ్యగా రోడ్ పక్క మైదానంలో శ్రీకాంత్ ప్రొడక్షన్స్ "పిన్ని అంతా" యూనిట్ కూచుని ఉన్నారు. ఎవరూ మాట్లాడడం లేదు. దర్శకుడు బి. ఏ. సుబ్బారావు, విజయనిర్మల, రమణారెడ్డి ఒకచోట కూచున్నారు. రోడ్ మీద గల కార్లో శోభన్‌బాబు, చలం, రాజబాబు ఉన్నారు. మరో పక్క కెమెరామన్ ఎల్లప్ప, సహాయదర్శకుడు ప్రకాశరావు, మేకప్ అసిస్టెంట్లూ, నలుగురయిదుగురు వేషగాళ్లూ ఉన్నారు. వీళ్లంతా ఎవరి కోసమో నిరీక్షిస్తున్నట్లున్నారు.

నేను బి. ఏ. సుబ్బారావుగారి దగ్గరకు వచ్చి "ఎవరి కోసం?" అని అడిగాను, మౌనాన్ని ఛేదిస్తూ. కార్లోంచి దిగివస్తూ "సూర్యభగవానుడి కోసం!" అన్నాడు శోభన్ బాబు. "ఇక్కడ అవుట్‌డోరా?" మళ్లీ ప్రశ్నించాను "అవును పాసింగ్ షాట్స్ ఉన్నాయి కొన్ని, తియ్యాలి" అంటూ, చెప్పారు బి. ఏ. యస్.


* * *

ఆకాశం మేఘావృతమయి ఉంది "తుఫానా ఏమిటి?" అన్నది విజయనిర్మల, గగనంలోని మేఘాలకేసి చూస్తూ "అవును ఇక్కడ కాదు, నాగపట్నానికి అరవై మైళ్ల అవతల .. నగరంలో చెదురుమదురుగా జల్లులు పడే సూచనలున్నాయని వాతావరణ కేంద్రం వారి రిపోర్టు." రమణారెడ్డి సమాధానం. "ఐతే రమణారెడ్డిగారూ! మీరు మరీ సన్నబడిపోతున్నారు గదా మందేదేనా తీసుకోకూడదూ లావెక్కడానికి?" అన్నాడు రాజ్‌బాబు. "మందు తీసుకొనేనోయ్ సన్నబడి పోతి!" అంటూ చమత్కరించారు రమణారెడ్డి. విజయనిర్మల నవ్వింది. నిర్మాత సౌందప్ప చెట్టియార్ అటుకేసి వస్తూ "జనరేటర్స్ యింకా రాలా?" అని అడిగారు అరవంలో. ఉత్సాహంలేకో, ఓపికలేకో—ఎవరూ ఆ ప్రశ్నకు సమాధానం చెప్ప లేదు.

"బ్రేక్!" అరిచారెవరో. "అనుకున్నాను" అంటూ లేచి నించుంది విజయనిర్మల. మేకప్ రూమ్‌ల కేసి వెళ్లబోతూ, వెన్కకి



"గోపాలుడు—భూపాలుడు" లో రాజశ్రీ



గౌతమీ పిక్చర్స్ తొలిచిత్రంలో సావిత్రి

తిరిగి "విహారా ఉండండి, మాతో భోజనానికి!" అంది "నో, థాంక్స్' చేసే వచ్చాను" అంటూ చెప్పి, అక్కణ్ణించి యివతలికి వచ్చాను.

*　　*　　*

టైగర్ ప్రొడక్షన్స్ వారు నిర్మించనున్న మూడవ చిత్రానికి శ్రీ వి రామచంద్రరావు బి. ఏ ఆనర్స్ దర్శకుడుగా నియమించబడినారని జనవరి 6 వ తేదీ సంచికలో తెలియజేశాను. వి రామచంద్రరావు అంటే పాఠకులకు కొత్తగాని పరిశ్రమకు కొత్తగాదు. పరిశ్రమలో ప్రసిద్ధి చెందిన ప్రతి దర్శకుని వద్దా ఆయన దాదాపు పనిచేశారు. దర్శకత్వపు శాఖలో వివిధ విషయాలను మననం చేసుకుని విశేషమయిన అనుభవం గడించిన యువకుడు రాజలక్ష్మి సంస్థలో చిరకాలంగా ఉంటూ శ్రీ డూండీగారి పర్యవేక్షణలో ఎన్నో మెలువులూ మెలుకువలూ తెలుసుకొని పరిణతి చెందారు కొత్త సంవత్సరంలో యీ కొత్త యువదర్శకునికి చక్కటి స్వాగతం లభిస్తుందని ఆశించవచ్చును

*　　*　　*

పాత సంవత్సరంలో చివరిరోజున, కొత్త



"గోపాలుడు—భూపాలుడు" లో జయలలిత

సంవత్సరంలో నాలుగోరోజున ఏ. వి యం రికార్డింగ్ థియేటర్‌లో నాలుగుపాటలు రికార్డు చేయబడినవి అవి హైదరాబాద్‌కు చెందిన ఉదయశ్రీ పిక్చర్స్‌వారి "అమాయకుడు" చిత్రానికి సంబంధించినవి రెండు ఒకరోజునా మిగిలిన రెండూ మరొకరోజునా రికార్డు చేశారు ఈ నాలుగు గీతాల్నూ మూడు డాక్టర్ సి నారాయణరెడ్డి రచనలు

*　　*　　*

శ్రీ సి నారాయణరెడ్డి యిదివరకు రాసిన పాటలన్నీ ఒక యెత్తూ, ఇపుడీ పాటలు మరొక యెత్తూ అనిపించింది, అవి వింటున్నపుడు. ఆయన సాహిత్యం కొత్త చిగుళ్లు తొడుక్కొని, వింత పరిమళాలు వెదజల్లుతూ అపూర్వంగా భాసిస్తున్నది. తొలిరోజున రికార్డు చేసిన రెండు గీతాలూ పి. సుశీల పాడింది మొదటి పాటలో ఆమెతో పాటు మరో పదిమంది అమ్మాయిలు పాడారు. మలిరోజున చేసిన యుగళగీతం సుశీల, ఘంటసాల పాడారు ఒక్కోపాటకు నలభై వాయిద్యాలకు తక్కువ లేకుండా ఉపయోగించారు నాలుగవది దేవులపల్లి కృష్ణశాస్త్రి రచన "మనిషైతే, మనసుంటే కనులు కరగాలిరా! కరిగి కరుణ కురియాలిరా కురిసి జగతి నిండాలిరా!" అనేది. చాలా కాలం తర్వాత రాసినా శాస్త్రిగారు ఒక మంచిపాట రాశారు. ఈ పాటలో పదసంభవ పోకడ మెచ్చుకోదగ్గట్టుగా ఉంది ఘంటసాల పాడారు. ఈ పాటకు ప్రత్యేకంగా యాభైరెండు వాయిద్యాలను వాడారు. ఒక తెలుగు సినిమాలో ఏపాటకీ యిన్ని వాయిద్యాలు ఉపయోగించటం అంటూ జరుగలేదు నా ఎరుకలో.

*　　*　　*

పై నాలుగు పాటలకూ చక్కని వరుసలు చేసి సంగీతం సమకూర్చినది సంగీత దర్శకుడు బి. శంకర్. హిందుస్థానీ సంగీతంలో అఖండుడీ యువకుడు. బాల్యం నుంచీ సంగీతమే జగమై ఎరిగినవాడు. మొదటిసారిగా "తల్లీ బిడ్డలు" చిత్రానికి సంగీత దర్శకత్వం వహించాడు. "తిరుపతమ్మ కథ" లో నాలుగు పాటలు చేశాడు. మళ్లీ యింత కాలానికి అతను "అమాయకుడు" చిత్రానికి సంగీత దర్శకత్వం వహించే అవకాశం వచ్చింది ఈ చిత్రనిర్మాతలు శ్రీ వెంకటసర్వయ్య శ్రీ శంకరయ్యలు—శంకర్ లోని ప్రతిభను ఉత్సాహాన్ని గుర్తించి అతనికి పూర్తి స్వాతంత్ర్యాన్ని యిచ్చారు. అందువల్లనే యీ పాటలు రసగుళికల్లా మధుర మనోజ్ఞంగా చేయగలిగాడు పైటెకీ వాయిద్య గోష్ఠిని అమర్చటంలో కూడ ఎంతో నేర్పు కనపరిచాడు. "అమాయకుడు" చిత్రం సంగీతంలో కొత్త శకాన్ని సృష్టించబోతున్నది. చిత్రానికి కథ ఎంత ముఖ్యమో సంగీతం కూడా అంత ముఖ్యమన్న అంశాన్ని స్పష్టం చేస్తుంది

*　　*　　*

రికార్డు చేసిన నాలుగు గీతాలనూ యీ చిత్రంలో నాయికానాయకులుగా నటిస్తున్న జమున కృష్ణలపై చిత్రీకరిస్తారు మొదటి షూటింగ్ షెడ్యూలులో మూడు రీళ్ల చిత్రం తయారయింది. రెండవ షెడ్యూలు యీ 16 నుంచి ఆరంభమవుతున్నది గుమ్మడి, జి. వరలక్ష్మి, అంజలీదేవి, ముక్కామల, రేలంగి, గిరిజ




"ఇద్దరుమొనగాళ్లు" లో కృష్ణకుమారి

చిత్రలహరి

కళ్యాణి యీ చిత్రంలోని యితర ముఖ్య తారాగణం. ఎం. కె. రాజా ఛాయాగ్రహణ దర్శకత్వమూ: అడ్డాల నారాయణరావు దర్శకత్వమూ వహిస్తున్న యీ "అమాయకుడు" చిత్రం హైదరాబాద్‌లోని శ్రీసారథి స్టూడియోలో నిర్మించబడుతున్నది.

*　　　*　　　*

గత సంచికలో 66 లో విడుదలయిన చిత్రాల జాబితా యిస్తూ పొరపాటున ఒక చిత్రం వదలి వేయడం జరిగింది. అనుకోకుండా దొరలిన యీ పొరపాటును



"వీరప్రతిజ్ఞ"లో నర్తకిగా—రాధ

మన్నించవలసిందిగా పాఠకుల్ని కోరుతూ ఆ చిత్రం వివరాలను యిక్కడ పొందుపరుస్తున్నాను. అంటే గత సం.రం. మొత్తం 34 చిత్రాలు విడుదల అయినవన్నమాట! 34 వ చిత్రం పాదుకా పట్టాభిషేకం' నిర్మాణం: అమరావతి చిత్ర. నటీనటులు: కృష్ణకుమారి, కాంతారావు, శశికాంత్, జయంతి, ధూళిపాళ, మాలతి, సంగీతం: ఘంటసాల, కెమెరా: వెంకట్, దర్శకత్వం: టెక్నికల్ యూనిట్.

—మోహన్‌కుమార్ ●

పుస్తకాలు

శాస్త్ర వైజ్ఞానిక పరిశోధనలు

(బ్రిటిష్ ఇన్‌ఫర్‌మేషన్ సర్వీస్ 1966. 40 పేజీలు.

ఈ పుస్తకం బ్రిటిష్ సమాచార కార్యాలయం ప్రకటించింది. గత మూడు నాలుగు శతాబ్దాలలో శాస్త్ర పురోభివృద్ధికి ఇంగ్లాండు దోహదం చేసిన కొన్ని వివరాలు ఉన్నాయి. ప్రకృతిని అర్థం చేసుకోడానికి జరిగే మౌలికపరిశోధనలు (Pure Science) ప్రకృతిని అదుపులో నుంచడానికి జరిగే ప్రయుక్తపరిశోధనలు (Applied Sciences దీనిలో వివరించారు. 1960 లో రాయల్ సొసైటి, రాబర్టు బాయల్, హూక్, న్యూటన్ మొదలైన వారి సభ్యత్వంతో చిత్రమైన పరిస్థితులలో ఏర్పడినదాది అనేక రంగాలలో బ్రిటన్ పురోగమించింది. బ్రిటిష్ శాస్త్రవేత్తలు గత రెండు దశాబ్దాలలో సైన్సులో 22 నోబుల్ బహుమతులందారవడం దీనికి నిదర్శనం.

వివిధ రంగాలలో జరిగే పరిశోధన ఎలా జరుగుతూందో ఎంత ఖర్చు అవుతుందో ప్రభుత్వ ప్రైవేటురంగాల బాధ్యత ఎంతవరకూ ఉందో ఈ పుస్తకం వివరిస్తుంది.

శాస్త్రానికి ప్రజాప్రయోజనానికి మొదట్లో ఉండే అగాధం మెల్లగా సమసిపోతోంది. కాకతాళీయంగా వచ్చే ఫలితాలనైనా అదే ధ్యేయంగా పెట్టుకొని పొందిన ఫలితాలనైనా మానవకళ్యాణానికి ఉపయోగించడమే ఇప్పుడు సర్వత్రా జరుగుతోంది. అదే ధ్యాసంతో అణుశక్తిని అదుపులోనుంచి 'శాంతి ప్రయోజనానికి ఉపయోగించడం. ప్లాస్టిక్ సహాయంతో మోటార్లలో అదురు తగ్గించడం, గట్టును ఓడలు ఒరుసుకోకుండా నిరోధించడం. కీళ్ళు (Joints) సరిచెయ్యడానికి ఉపయోగించడం జరుగుతోంది.

అట్టమీద ప్రచురించిన రెండుఫోటోలు విడివిడిగాను కలసికట్టుగాను శాస్త్ర పురోభివృద్ధిని సూక్ష్మంగా వివరిస్తాయి. 300 సంవత్సరాల క్రితం కంటికి కనిపించే దానికన్నా చిన్నవస్తువులేదని అనుకొనే రోజుల నుండి ప్రస్తుతం ఎలక్ట్రాను మైక్రోస్కోపులో వస్తువు లక్ష ప్రమాణాలు హెచ్చించగల్గడం, పదిలక్షల ప్రమాణాల వరకు పెద్దదిగా ఫోటోలు తియ్యగల్గడం జరుగుతోంది. అట్ట చివరి బొమ్మ శాస్త్రరంగంలో మరో పురోభివృద్ధి సూచిస్తుంది. విశ్వాంతరాళంలోని కోటాను కోట్ల కాంతి సంవత్సరాలు (సెకనుకు 1,80,000 మైళ్ళ చొప్పున ఒక సంవత్సరంలో కాంతి ప్రయాణం చెయ్యగల దూర కాంతి సంవత్సరం అంటారు.) నుండి వచ్చే సంకేతాలను గ్రహించగల్గుతున్నామని వివరిస్తుంది. అటు దానికింతు ఏదో ఇటు దీనికి అంతు ఏదో మనం ఇంకా తెలుసుకోవాలనే జిజ్ఞాసను ఈపటాలు మనలో రేపుతాయి.

పుస్తకం ముద్రణలోను, ముస్తాబులోను, భాషలోను ముచ్చటగా ఉంది. ఫోటోలు పుస్తకానికి ఎంతో ఆకర్షణ. అయితే ఒకటి రెండు పొరపాట్లు కూడా దొర్లాయి. (బి. ఎస్. ఎ.) కు "జేసిడి ఆక్సిబోనక్లిక్ అమ్లం" అన్నారు. (31వ పేజీ) "ఎంగోవ్యాక్రోస్కోప్ (24వ పేజీ.), ఇక Low Temperature Physics కు తక్కువ వేడి ఫిజిక్సు అనే దానికన్న తక్కువ ఉష్ణోగ్రత ఫిజిక్సు అంటే బాగుంటుంది. వేడి అనేది Heat కు, ఉష్ణోగ్రత Temperature దగ్గరగా ఉంటుందేమో.

ఈ పుస్తకం అందరూ చదవవలసినది.

—జమ్మి కోనేటిరావు ●

మాతా-భూమాతా

నవల. గ్లాడీస్ హెస్టికరోల్ నవల 'యాజ్ ది ఎర్త్ టర్న్స్'కు శ్రీ చందూర్ అనువాదం. సరళమైన భాషాంతరీకరణంతో చదువతగినదిగా వున్న ఈ నవల, సృష్టిగతికి—మానవసృష్టికి గల సామీప్య సంబంధలన సుబోధకం చేసేదిగా వుంది. 288 పేజీల పుస్తకం వెల నాల్గు రూపాయిలు. ప్రతులకు: ప్రతిమా బుక్స్, 3, మూకతాల్ వీధి, మద్రాసు—7.

శిఖోర్ధ్వాలు

నాటిక. కాంగ్రెసు ప్రభుత్వ పతనానికి శాపనార్థం పెడుతూ ముగిసే ఈ నాటిక పూర్తిగా ప్రభుత్వాన్ని విమర్శించేదిగా వుంది. చదవడానికి, వినడానికి, మాత్రమే బాగుంటుంది. రచయిత: శ్రీ సుంకర సత్యనారాయణ. 44 పేజీల పుస్తకం వెల: 75 పైసలు. ప్రతులకు: విశాలాంధ్ర ప్రచురణాలయం, ఏలూరు రోడ్డు, విజయవాడ—2.

—సిరరాజు ●

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S.Sambhu Prasad.

